
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు

శుక్రవారం 5 సెప్టెంబరు 2025


'సోమశిల'కు స్థిరంగా వరద



అనంతసాగరం, సెప్టెంబు 4(ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం స్థిరంగా కొనసాగుతోంది. గురువారం 23,490 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, 65.120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,250, డెల్టాకు 1,350 క్యూసెక్కుల చొప్పున సరఫరా చేస్తున్నారు.

గురుభ్యోనమః

- భావిభారత పౌరుల తయారీలో ఉపాధ్యాయులే కీలకం
- నేటికీ అంకితభావంతో ఎందరో..
- అవార్డులు, సత్కారాలు ఆశించకుండా సేవలు
- నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



తల్లి.. తండ్రి.. గురువు.. దైవం.. అంటారు. జన్మనిచ్చిన తల్లిదండ్రుల తర్వాత అంతటి గౌరవం గురువులకే దక్కుతుంది. దారిచూపే దిక్సూచి గురువు. విద్యార్థి జీవితాన్ని ప్రభావితం చేసేది వారే. ప్రాథమిక విద్య దశలో పిల్లలు ఉపాధ్యాయులను అనుసరించడం, అనుకరించడం ద్వారా ఎన్నో అంశాలు నేర్చుకుంటారు. గురువులు నైతిక విలువలకు ప్రాధాన్య మిస్తూ బాలబాలికలను ఉత్తమ విద్యార్థులుగా, మంచి పౌరులుగా, శక్తివంతులుగా తీర్చిదిద్దడంపై శ్రద్ధ వహించాలి. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి దేశ సార్వభౌమాధికారి అయిన రాష్ట్రపతి పీఠాన్ని అధిరోహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబరు 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటారు.



నెల్లూరు(విద్య), సెప్టంబరు 4 (ఆంధ్రజ్యోతి) :ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన వ్యక్తి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. విద్యారంగంలో విద్యార్థి జీవన గమనాన్ని నిర్దేశించి విలువలు ఎలా ఉండాలో అధ్యాపక లోకానికి చాటిచెప్పిన మహనీయుడాయన. ఆయన గొప్ప వేదాంతి, ఉన్నత ఆశయాలు కలిగిన ఉపాధ్యాయుడు. సర్వేపల్లి రాధాకృష్ణన్ తమిళనాడులోని తిరుత్తణి గ్రామంలో 1888, సెప్టెంబరు 5వ తేదీన జన్మించారు. భారతదేశానికి ఆయన తొలి ఉప రాష్ట్రపతిగా 1952-62 మధ్య కాలంలో పనిచేసి 1962-67 మధ్య కాలంలో రెండో రాష్ట్రపతిగా సేవలందించారు. అలాగే ఆంధ్ర విశ్వవిద్యాలయానికి 1931 నుంచి 1936 వరకు రెండో ఉపకులపతిగా కూడా పనిచేయడంతో పాటు స్వాతంత్ర్యానికి ముందే విద్యా సుగంధాలను విస్తరింపచేశారు. రాధాకృష్ణన్ 1954లో భారతరత్న, 1963లో ఆర్డర్ ఆఫ్ మెరిట్ వంటి అత్యున్నత పురస్కారాలను అందుకున్నారు. విద్యార్థికి, ఉపాధ్యాయుడికి మధ్య సంబంధం ఎలా ఉండాలో విడమరిచి చెప్పారు ఆచార్య రాధాకృష్ణ. ఆయన అధిరోహించిన శిఖరాలు ఆయన జీవితంలోని అసాధారణ కోణాలను వెల్లడిచేస్తాయి. ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి వరకు ఉన్నతి సాధించిన ఆయనను స్మరించుకుంటూ ఆయన జయంతి రోజున ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా మారింది.

ఉత్తమసేవలకు గురు సత్కారం...

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం మండలం పెనుబల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జీటీ)గా పనిచేస్తున్న సిహెచ్.చెన్నయ్య, ఇందుకూరుపేటలోని ఎంకేఆర్ ప్రభుత్వ హైస్కూల్ ప్లస్ పాఠశాలలో సూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఇంగ్లీష్ ఉపాధ్యాయులు కె.డోనమిక్‌రెడ్డి, ఇందుకూరుపేట నరసాపురం ఎంవీఆర్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్‌కె.ముజీర్‌లు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు డీఈఓ ఆర్.బాలాజీ రావు తెలిపారు. వీరితోపాటు జిల్లాలో స్కాట్ టీచర్స్ ఇద్దరు, స్కూల్ అసిస్టెంట్లు 15 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లు 21 మంది మొత్తం 38 మంది ఉపాధ్యాయులు ఉత్తమ పురస్కారాలను అందుకోబోతున్నట్లు చెప్పారు. వీరికి నగరంలోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు కలెక్టర్ ఆనంద్ ఆధ్వర్యంలో సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు విద్యాశాఖ-సమగ్రశిక్షలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని తెలిపారు.



పొదలకూరులో ఉపాధ్యాయులకు సత్కారం

రంగడికి పవిత్ర సమర్పణ

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. గురువారం నాల్గోరోజు ఉదయం నిత్య హోమాలు జరిగాయి. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి ప్రాకారోత్సవం కనుల పండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లకు పవిత్రాలు సమర్పించారు. ఆలయ ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.



పవిత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి



ఫత్తేఖాన్‌పేట రైతు బజారులో ఉల్లిపాయల విక్రయం(ఫైల్)

ఉల్లి @ 16

- రైతు బజార్లలో లభ్యం
- జిల్లాకు మరో ఐదు టన్నుల రాక

నెల్లూరు(వ్యవసాయం): రైతు బజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.16 కు అందుబాటులో ఉంచినట్లు మార్కెటింగ్‌శాఖ ఏడీ అనిత తెలిపారు. ఉల్లి రైతులను ఆదుకునేందుకు నేరుగా రైతుల నుంచే ప్రభుత్వం ఉల్లిపాయలను సేకరిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కర్నూలు నుంచి జిల్లాకు రెండు విడతలుగా 10 టన్నులు రాగా కందుకూరు, కావలి, నెల్లూరు, పొదలకూరు ప్రాంతాల్లోని రైతు బజార్లలో కిలో రూ.12కే వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. అయితే తాజాగా గురువారం జిల్లాకు మరో ఐదు టన్నులు వచ్చాయి. అయితే శుక్రవారం నుంచి ఉల్లి ధర పెరుగుతోంది. కిలోపై రూ.4 పెంచి రూ.16లకు వినియోగదారులకు అందు బాటులో ఉంచారు. ఎలాంటి గుర్తింపు కార్డు అవసరం లేకుండా అవసరమైనన్ని ఉల్లిపాయలు కొనుగోలు చేసుకునే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు
ఉచిత శిక్షణ

10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోండి

నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఔత్సాహిక పారిశ్రామి కవేత్తలకు నెల రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ర్యాంప్ పథకం ద్వారా ఈఎస్‌డీపీ (ఎంటర్‌పెన్యూర్‌షిప్ కం స్కిల్ డెవలప్‌మెంట్) ద్వారా ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. 18 నుంచి 40 మధ్య వయసు ఉన్న వారు ఆధార్, ఫొటోలు, కులధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు తదితర పత్రాలతో సెప్టెంబరు 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9000173808, 8121331514 నెంబర్లకు ఫోన్ చేయాలని కోరారు.

పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కండి

- కమిషన్ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కదలిక

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం కావాలని, అవసరమైన ప్రక్రియ చేపట్టాలని ఎన్నికల కమిషన్ నుంచి జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి. దీంతో గ్రామాల్లో ఎన్నికల సెగ ప్రారంభమైనట్టు అయ్యింది. స్థానిక సంస్థలైన మున్సిపాల్టీలు, పంచాయతీలకు గడువు ప్రకారం ఎన్నికలను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటంతో ఇందుకు అణుగుణంగా ఎన్నికల కమిషన్ చర్యలు చేపడుతోంది. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి వచ్చే ఏడాది జనవరిలోపు పూర్తి చేసుకోవాలని విధివిధానాలను రూపొందించి ఎన్నికల కమిషన్ ఉత్వర్వులు పంపింది. 2026, ఏప్రిల్ 2వ తేదీకి పంచాయతీ పాలక వర్గం ముగియనుంది. గడువు మూడు నెలలకు ముందే ఎన్నికలు నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 941 పంచాయతీలు ఉండగా జిల్లాల విభజనతో ఆ సంఖ్య 722కి తగ్గింది. ఈ 722 పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాల విలీనాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పంచాయతీలను కలిపే ప్రతిపాదనలు నగర పంచాయతీలుగా ఏర్పాటు చేసే ప్రతిపాదనలు ఉంటే వాటిని అక్టోబరు 15వ తేదీ కల్లా పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ సూచించింది. 16 నుంచి ఓటర్ల చేర్పు, 18 సంవత్సరాలు పూర్తయిన వారికి ఓటు హక్కు కల్పించి, జాబితా సిద్ధం చేసుకోవాలని పేర్కొంది. అలాగే నవంబరు 16 నుంచి 30వ తేదీ వరకు పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు, ఎన్నికల మెటీరియల్, బ్యాలెట్ బాక్సుల మరమత్తుల వంటి పనులను నవంబరు 30వ తేదీ నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇక కీలకమైన పంచాయతీల రిజర్వేషన్ల ప్రక్రియను పూర్తిచేసి డిసెంబరు 15న ప్రకటించాల్సి ఉంటుంది. డిసెంబరు చివరి వారంలో రాష్ట్ర ఎన్నికల అధికారులతో కలిసి రాజకీయ పార్టీలతో సమావేశాలను నిర్వహించాలని ఎన్నికల కమిషన్ సూచించింది. ఆ తర్వాత జనవరిలోనే ఎన్నికలను నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేసి అందుబాటులో ఉంచాలని సూచనప్రాయంగా జిల్లా యంత్రాంగానికి ఆదేశాలు అందాయి.



నెల్లూరులో అధునాతన రైతుబజార్

- మార్కెట్ యార్డులో ఏర్పాటుకు కసరత్తు
- ప్రభుత్వానికి ప్రతిపాదనలు



నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని నవాబుపేట మార్కెట్ యార్డులో అధునాతన రైతుబజారు ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ప్రతిపాదనలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నవాబుపేటలో జాతీయ రహదారికి సమీపాన నెల్లూరు మార్కెటింగ్ కమిటీకి సంబంధించి 22.7 ఎకరాల్లో మార్కెట్ యార్డు ఉంది. అందులో దాదాపుగా 6.7 ఎకరాల్లో 5 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాము ఉంది. సుమారు రెండు నెలల క్రితం రాష్ట్ర మున్సిపల్ మంత్రి నారాయణ ఆ మార్కెట్ యార్డును సందర్శించారు. హైవేకి సమీపంలో దాదాపు 16 ఎకరాల స్థలం ఉండటంతో అక్కడ మోడ్రన్ రైతుబజారు ఏర్పాటు చేస్తే రైతులకు, వినియోగదారులకు ఉపయోగకరం గా ఉంటుందని అధికారులకు సూచించారు. దీంతో మార్కెట్ కమిటీకి చెందిన ఆ స్థలాన్ని మున్సిపల్ శాఖకు కేటాయించాలంటూ మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపారు. అయితే ఆ స్థలాన్ని మార్కెట్ ధరకు మున్సిపల్ శాఖ కొనుగోలు చేస్తుందా? లేక అక్కడ దుకాణాలు నిర్మించి మార్కెటింగ్ శాఖకు అద్దె ప్రాతిపదికన ఆదాయ మార్గం కల్పిస్తుందా.. అన్న విషయాలపై స్పష్టత రాలేదు. మొత్తం మీద నవాబుపేటలో మల్టీపర్పస్ మోడ్రన్ రైతుబజారు మాత్రం ఏర్పాటు కానుంది. కాగా, ఇక్కడ ఎలాంటి సౌకర్యాలు, వసతులు, దుకాణాలు ఏర్పాటు చేయాలనే విషయమై ఇతర రాష్ట్రాల్లోని రైతు బజార్లను ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలించడం గమనార్హం.

'కోత' కట్టడికి ప్రణాళిక

సాధారణ కాన్పులకు ప్రభుత్వ ప్రాధాన్యం

ప్రసవాలపై స్టాఫ్ నర్సులకు 18 నెలల ప్రత్యేక శిక్షణ

మరి ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎలా..?

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. కొన్నేళ్లుగా సిజేరియన్ కాన్పులు ఎక్కువకావడంతో దీనిని తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటే ఈ సీజేరియన్ల నుంచి బయటపడవచ్చన్న దానిపై ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కాన్పులలో కీలకమైన స్టాఫ్‌నర్సులకు 18 నెలల పాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ క్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి 40 మందికిపైగా స్టాఫ్ నర్సులకు శిక్షణ ఇచ్చే అవకాశం ఉంది. ఇంతవరకు బాగానే ఉన్నా... ప్రైవేటు ఆసుపత్రుల్లో విచ్చలవిడిగా జరుగుతున్న సిజేరియన్ కాన్పులను ప్రభుత్వం ఏ విధంగా నియంత్రిస్తుందన్నది ప్రశ్నార్థకంగా మారింది. గర్భవతి ఆరోగ్య పరిస్థితి బాగానే ఉన్నప్పటికీ కాసుల కోసం కక్కుర్తి పడి ఎక్కువ మంది గర్భకోశ వ్యాధుల నిపుణులు సిజేరియన్‌కే ప్రాధాన్యమిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో 46 శాతం సిజేరియన్లు జరుగుతున్నట్లు అంచనా. దీనిని ప్రభుత్వం ఎలా అరికడుతుందో చూడాలి.

పొదుపు లెక్క..
ఇక పక్కా!

అందుబాటులోకి 'మనడబ్బులు-మనలెక్కలు 2.0'

- ప్రత్యేక యాప్ ద్వారా మహిళలకు పూర్తి వివరాలు
- పైలట్ ప్రాజెక్టుగా జిల్లా ఎంపిక
- తొలివిడతగా 5 మండలాల్లోని సభ్యులకు శిక్షణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : పొదుపు మహిళల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోంది. బ్యాంకు లింకేజీ రుణాలు, స్త్రీనిధి, ఉన్నతి వంటి ఎన్నో రకాల రుణాలు అందచేస్తూ ఆర్థిక చేయూతనిస్తోంది. తాజాగా పొదుపు సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం మనడబ్బులు-మనలెక్కలు 2.0 అనే నూతన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. ఇందుకోసం ఓ ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పొదుపు మహిళల ఆర్థిక లావాదేవీలకు జవాబుదారీతనం ఉండేలా చర్యలు తీసుకుంది. ఈ కార్యక్రమం అమలుకు జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. తొలుత జిల్లాలోని సంగం, పొదలకూరు, కావలి, వింజమూరు, వెంకటాచలం మండలాలు ఎంపికవగా, త్వరలో పొదుపు మహిళలకు శిక్షణా కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.

ప్రతి రూపాయికీ లెక్క

పొదుపు మహిళలు తమ సంఘంలోని ప్రతి రూపాయి వివరాలను ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. రుణాలు తీసుకోవటం, చెల్లింపుల్లో అవకతవకలు, తప్పుడు లెక్కలతో అక్రమాలు గతంలో చోటు చేసుకున్నాయి. వీటన్నిటికి ఈ యాప్ ద్వారా చెక్ పెట్టొచ్చు. ఈ యాప్‌కు సంబంధించి పొదుపు సంఘంలోని సభ్యులందరికీ ప్రత్యేక ఐడీ సంఖ్యను కేటాయిస్తారు. దీంతో సభ్యురాలి వ్యక్తిగత వివరాలు, సంఘం ఆర్థిక లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉంటాయి. యాప్‌లో సభ్యులకు సమాచారంతోపాటు ఆడియో సందేశం వెళ్తుంది. దీనివల్ల నిరక్షరాస్యులైన సభ్యులు కూడా తమ లావాదేవీల వివరాలు తెలుసుకోవచ్చు. ప్రతి నెలా పొదుపు సొమ్ము, రుణ వాయిదా చెల్లించడానికి నగదును సంఘంలోని సభ్యురాలికి, డీఆర్‌డీఏ-వెలుగు సిబ్బందికి ఇస్తారు. ఇచ్చిన సొమ్ము ఖాతాలో జమ అయ్యిందా లేదా అనే విషయాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. అంతేకాదండోయ్.. యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కూడా ఉంది. రుణ చెల్లింపులను కోసం ఫోన్‌పే, గూగుల్ పే వంటి సౌకర్యాలు కూడా ప్రవేశపెట్టనున్నారు.



నగదు లావాదేవీలు తెలుసుకోవచ్చు

పొదుపు సభ్యులు తీసుకున్న రుణాలు, చెల్లింపులకు సంబంధించిన సమాచారం కోసం ఎవరిమీదా ఆధారపడాల్సిన అవసరం లేదు. మోసపోవటం, నష్టపోవటం వంటి అవకాశాలూ ఉండవు. మన డబ్బులు-మనలెక్కలు 2.0 యప్ వల్ల లావాదేవీలు పారదర్శకంగా ఉంటాయి. ఆడియో సందేశం, సమచారం పక్కాగా ఉండటంతో ఎంతో అనుకూలంగా ఉంటుంది. పైలెట్‌గా ఎంపికైన మండలాల్లోని పొదుపు మహిళలకు త్వరలో శిక్షణ ఇప్పిస్తాం.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు అధికారి, డీఆర్‌డీఏ

కావలి ఎమ్మెల్యేపై హత్యాయత్నానికి
సాక్ష్యాలు ఉన్నాయ్!

- రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి అరెస్టు నుంచి రక్షణ కల్పించవద్దు
- హైకోర్టులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు
- క్వాష్ పిటిషన్‌పై విచారణ 10కి వాయిదా

అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కావలి టీడీపీ ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డిని హత్య చేయించేందుకు వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రయత్నించారని హైకోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి తగిన సాక్ష్యాలు కూడా ఉన్నాయని చెప్పారు. హత్యాయత్నం వ్యవహారంలో తనపై నెల్లూరు జిల్లా, జలదంకి పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ ప్రతాప్‌కుమార్‌రెడ్డి దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై గురువారం హైకోర్టు విచారణ జరిపింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ.. ప్రాథమిక ఆధారాలు ఉన్నందున అరెస్ట్ నుంచి పిటిషనర్‌కు రక్షణ కల్పించవద్దని కోరారు. ఎస్సీ ఎస్టీ చట్టం కింద కేసు నమోదైనందున ఫిర్యాదుదారుడి వాదనలు వినకుండా ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయడానికి వీల్లేదన్నారు. ఈ దశలో న్యాయస్థానం స్పందిస్తూ.. పిటిషనర్‌ను అరెస్ట్ చేసే అవకాశం ఉందా అనే విషయాన్ని ఐవోను అడిగి తెలుసుకుని ఆ వివరాలను కోర్టు ముందు ఉంచాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సూచించింది. ప్రతాప్‌కుమార్‌రెడ్డి ప్రస్తుతం దేశంలో లేరని, శ్రీలంకలో ఉన్నట్లు దర్యాప్తు అధికారి గుర్తించారని పీపీ తెలిపారు. కేసు డైరీతో పాటు ఇతర ఆధారాలు కోర్టు ముందు ఉంచేందుకు సమయం ఇవ్వాలని కోరారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కారణాలతో కేసు నమోదు చేశారన్నారు. హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ చట్టం కింద నమోదు చేసిన సెక్షన్లు పిటిషనర్‌కు వర్తించవన్నారు. ఆయనకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు. ఫిర్యాదుదారుడి తరఫు న్యాయవాది స్పందిస్తూ.. ఈ కేసులో సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తారన్నారు. వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు పిటిషన్‌పై తదుపరి విచారణను ఈనెల 10కి వాయిదా వేశారు.

ఆశ చూపి
ముంచేశారు!

- వెలుగులోకి 'హూజ్' నిర్వాహకుల బాగోతం
- సుమారు రూ.2 కోట్ల వరకు స్వాహా
- లబోదిబోమంటున్న బాధితులు

ఉదయగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఓ వైపు ప్రభుత్వం, మరో వైపు పోలీసులు హెచ్చరిస్తున్నా ప్రజల్లో మార్పు రావడం లేదు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే జనాల ఆశను ఆసరా చేసుకున్న ఆర్థిక నేరగాళ్లు సులువుగా మోసం చేసి బోర్డు తిప్పేస్తున్నారు. కూడబెట్టుకున్న కష్టార్జితాన్ని పోగొట్టుకుని నెత్తినోరు కొట్టుకుంటున్నారు. తాజాగా ఉదయగిరిలో హూజ్ యాప్ నిర్వాహకుల బండారం వెలుగులోకి వచ్చింది. బాధితుల కథనం మేరకు..

2024లో ప్రారంభమైన ఈ హూజ్ యాప్ ఇంటి వద్దే ఉంటూ డబ్బు సంపాదించండంటూ ప్రచారం చేపట్టింది. రూ.2,100, రూ.5,500, రూ.16,500, రూ.40,000 ఇలా స్లాబుల కేటాయించిన నిర్వాహకులు చెల్లించే సొమ్ము ప్రకారం కమీషన్ వస్తుందని జనాన్ని నమ్మించారు. ఉదాహరణకు రూ.2,100 కడితే రోజుకు రూ.75 చొప్పున నెలకు రూ.2,250 ఏడాదిపాటు చెల్లిస్తామని నమ్మబలికారు.



హూజ్ యాప్

ఇలా ఎంత నగదు చెల్లిస్తే అంత కమీషన్ వస్తుందని ఆశ చూపారు. దీంతో యువత, నిరుద్యోగులు, చిరుద్యోగులు, మహిళలు, కూలీలు ఎగబడి యాప్‌లో సభ్యత్వం పొంది నగదు చెల్లించారు. కొంతమంది అప్పుడ చేసి, ఇంకొందరు బంగారం కుదవపెట్టి డబ్బులు ఖాతాకు బదిలీ చేశారు. ఏడాదిపాటు తమ కార్యకలాపాలను సాగించిన యాప్ నిర్వాహకులు ఆ తర్వాత బోర్డు తిప్పేశారు.

నిలిచిన లావాదేవీలు

గత నెల 20వ తేదీ నుంచి నగదు లావాదేవీలు ఆగిపోవడంతో బాధితులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఒక్కొక్కరికి రూ.లక్షల్లో చెల్లించాల్సి ఉండటం, నగదును విత్‌డ్రా చేసుకునే సమయానికి యాప్ నిర్వాహకులు ఏదో ఆటంకం సృష్టించేవారు. బాధితులు యాప్ నిర్వాహకులకు సందేశాలు పంపినా స్పందన కరువైంది. తీరా ఒక్కసారిగా ఖాతాలన్నీ నిలిపివేసి బోర్డు తిప్పేయడంతో బాధితులు లబోదిబోమంటున్నారు.. జిల్లాలోని అన్ని మండలాల్లో హూజ్ యాప్ బాధితులు ఉన్నట్లు సమాచారం. సుమారు రూ.2 కోట్ల వరకు యాప్ నిర్వాహకులు బాధితులకు కుచ్చుటోపీ పెట్టినట్లు తెలిసింది. అయితే, తమకు జరిగిన అన్యాయంపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెనుకబడుగు వేస్తున్నారు.

ఆరేళ్లుగా పోరాటం చేస్తున్నాం

విడవలూరు : నీటిపారుదల కాలువను ఆక్రమించుకుని రొయ్యల గుంతలు వేసినందున, పూడిక తీసి రైతులకు న్యాయం చేయాలని ఆరేళ్లుగా స్థానిక రెవెన్యూ అధికారులతో పోరాటం చేస్తున్నామని రైతులు శివకోటారెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, విడవలూరు శీనయ్యలు తెలిపారు. విడవలూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. సర్వేనెంబరు 1362లో గల నీటి పారుదల కాలువని ఓ వైసీపీ నాయకుడు ఆక్రమించుని రొయ్యల గుంతలుగా మార్చటం మూలంగా తమ పొలాల్లోని నీరు వెళ్లక పంటలు దెబ్బతింటున్నాయన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10114
వెండి కిలో ధర	రూ. 126900
వెండి ఒక గ్రాము	రూ. 129.90

వైసీపీ నగర అధ్యక్షుడిపై
చీటింగ్ కేసు

● ఇప్పటికే పరారీలో శ్రీనివాస్ యాదవ్

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ నెల్లూరు నగర అధ్యక్షుడు బొబ్బల శ్రీనివాస యాదవ్, ఆయన సతీమణి శోభ సుభాషిణిపై చిన్నబజారు పోలీసులు గురువారం చీటింగ్ కేసు నమోదు చేశారు. బాధితురాలు, పోలీసుల సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. నగరంలోని ఏసీ నగర్‌లో కాకి ప్రతిమ గ్రేస్, పవన్ దంపతులు నివసిస్తున్నారు. ప్రతిమ తల్లి పేరుపై నగరంలోని శుభమస్తు షాపింగ్ మాల్ పక్కనే 10 అంకణాల స్థలం ఉంది. గతంలో ఆ స్థలాన్ని కొనుగోలు చేసేం దుకు హజరత్ నాయుడు రూ.16 లక్షలు ఇచ్చారు. అయితే వారు స్థలం అమ్మలేమని చెప్పి రూ.8 లక్షలు హజరత్ నాయుడుకు తిరిగి ఇచ్చి మిగిలిన రూ.8 లక్షలను స్థలం అమ్మిన తర్వాత ఇస్తామని చెప్పారు. కొంత కాలానికి ప్రతిమ తల్లిదం డ్రులు మృతిచెందారు. ఆ సమయంలో ప్రతిమను ఆమె మేనత్త శోభా సుభాషిణి, బొబ్బల శ్రీనివాస యాదవ్ దంపతులు కలిశారు. శుభమస్తు షాపింగ్ మాల్ పక్కనున్న స్థలాన్ని అమ్మేసి వచ్చిన నగదుతో అప్పులు తీర్చగా మిగిలిన మొత్తాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. దీంతో శ్రీనివాస యాదవ్ దంపతులను మధ్యవర్తులుగా పెట్టి స్థలాన్ని అమ్మాలని ప్రతిమ కోరింది. గతంలో ఆ స్థలం కొనుగోలుకు ఆసక్తి చూపిన హజరత్తయ్య వద్దకు వెళ్లి అడ్వాన్సు అమౌంటు మిన హాయించుకుని రూ.32 లక్షలు ఇచ్చేలా ఒప్పందంతో స్థలాన్ని విక్రయిం చారు. ఆ నగదులో రూ.25 లక్షలు క్యాష్‌గా, రూ.7 లక్షలు చెక్ రూపంలో హజరత్తయ్య దగ్గర నుంచి శ్రీనివాస యాదవ్ దంపతులు తీసుకున్నారు. చెక్‌ను ప్రతిమ బ్యాంకు అకౌంట్‌లో జమ చేశారు. రూ.25లక్షల నగదును వారి వద్దనే ఉంచుకున్నారు. అందులోనుంచి రూ.9 లక్షలు అప్పులకు కట్టారు. ప్రతిమ అకౌంట్‌లో ఉన్న రూ.7 లక్షల నగదులో రూ.4,29,830ను ఆమెకు తెలియకుండా ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసుకున్నారు. విషయం తెలుసుకున్న బాధితురాలు కార్డు ను బ్లాక్ చేసింది. దీంతో కార్డును ఎందుకు బ్లాక్ చేశావంటూ ఆమెను బెదిరించడం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మోస పోయానని తెలుసుకున్న ప్రతిమ గురువారం చిన్నబజారు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు బొబ్బల శ్రీనివాస యాదవ్, శోభ సుభాషిణిపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా శ్రీనివాస యాదవ్‌పై ఇప్పటికే ఓ కేసు దర్గామిట్ట పోలీసు స్టేషన్‌లో నమోదై ఉండగా, ఆయన పోలీసులకు చిక్కకుండా పరారీలో ఉన్నారు.

కసుమూరు దర్గాకు పూర్వవైభవం తెస్తాం

మస్తాన్ వలి దర్గాలో ఎమ్మెల్యే సోమిరెడ్డి పూజలు

వెంకటాచలం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ భారతదేశంలోనే ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలి దర్గాకు పూర్వవైభవం తీసుకొస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌తో కలిసి ఎమ్మెల్యే కసుమూరు దర్గాను దర్శించారు. ముజావర్లు, స్థానికులు, వక్ఫ్‌బోర్డు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం దర్గాలో ప్రత్యేక పూజలు చేశారు. దాతల విశ్రాంతి గది, చిన్నపిల్లలకు పాలిచ్చు గదులను ప్రారంభించారు. దర్గా అభివృద్ధిపై స్థానికులు, దర్గా ముజావర్లతో సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం డార్మెంటరీని పరిశీలించారు. దర్గా అభివృద్ధికి సమగ్ర ప్రణాళికను రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి తెలిపారు. తన నియోజకవర్గంలో కసుమూరు పుణ్యక్షేత్రం ఉండడం అదృష్టమన్నారు. దర్గా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. దర్గా అభివృద్ధికి దాతలు ముందుకు వస్తే సహకారం అందిస్తామన్నారు. పెళ్లి మండపానికి మరమ్మత్తులు, గదుల నిర్మాణం, మహిళల కోసం స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఉచిత అన్నదానం, ఉచిత మరుగుదొడ్లు, ఉచిత డార్మెంటరీ నిర్మిస్తామన్నారు. దర్గాకు అనుకుని ఉన్న చెరువు కట్టను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామన్నారు. వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ గత పాలకులు దర్గా అభివృద్ధి గురించి పట్టించుకోలేదన్నారు. వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో భక్తుల కోసం త్వరలో నిత్యాన్నదాన కార్యక్రమాన్ని చేపడతా మన్నారు. రాష్ట్రంలో 26 స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ను ఏర్పాటు చేస్తామని, మొట్టమొదటి సెంటర్‌ను కసుమూ రులోనే ప్రారంభిస్తామన్నారు. జిల్లాలో ఏఎ స్ పేట, బారాషాహిద్ దర్గా, నెల్లూరు నగరంలో కూడా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు ఏర్పాటు చేస్తు న్నామన్నారు. త్వరలో భక్తు ల వసతి కోసం గదులను నిర్మిస్తామన్నారు. పెళ్లి మం డపానికి కూడా మరమ్మ త్తులు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో దర్గా ఈఓ షరీఫ్, టీడీపీ మండలాధ్యక్షుడు రాధా కృష్ణారెడ్డి, టీడీపీ నేతలు రమేష్ నాయుడు, నాగార్జున్ రెడ్డి, కోదండయ్య నాయుడు, ధనంజయనాయుడు, మురళీధర్ నాయుడు, సతీష్ నాయుడు, మైనార్టీ నేతలు నన్నే సాహెబ్, జకీర్, షరీఫ్, అన్వర్, మౌలానా, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.



గదులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి, వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్

ముత్తుకూరు : సర్వేపల్లి నియోజకవర్గంలో భారీగా ముఖ్యమంత్రి సహాయనిధి సాయం మంజూరు చేశామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తెలిపారు. నెల్లూరు లోని వేదాయపాలెం కార్యాలయంలో గురువారం బాధితు లకు ఏపీ వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ షేక్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. సర్వేపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 379 మందికి రూ. 4కోట్లు సాయం అందించామన్నారు. గత ఐదేళ్లలో జగన్‌రెడ్డి ప్రభుత్వ తీరుతో డబ్బులు రాక విసుగెత్తిపోయిన కిమ్స్, అపోలో వంటి ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ కింద సేవలందించలేమనే పరిస్థితికి వచ్చాయ న్నారు. మండల టీడీపీ అధ్యక్షులు నీలం మల్లికార్జున యాదవ్, నాయకులు షేక్ ఆలిముత్తు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లను పరిశీలించిన జేసీ

విడవలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విడవలూరు పంచాయతీలో ఇంటి స్థలాల కోసం జగనన్న లే అవుట్లకి ఇచ్చిన భూమిని గురువారం జాయింట్ కలెక్టర్ కార్తీక్ పరిశీ లించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏటూరు ఆదిశేషారెడ్డి, కవిత, శిల్పా జైన్‌ల వద్ద సుమారు 7 ఎకరాల భూమిని అధికారులు సేకరించారు. అయితే పేదలకు పట్టాలు ఇవ్వకపోగా, భూమి ఇచ్చిన లబ్దిదారులకు పరిహారం కూడా ఇవ్వలేదు. దీంతో వారిలో శిల్పా జేయిన్ కోర్టుని ఆశ్రయించగా, మిగిలిన ఇద్దరు భూమిని తీసుకుని తమకు పరిహారం ఇవ్వలే దని, తమ భూములను తిరిగి ఇప్పించాలని జిల్లా కలెక్టరుకు విన్నవించుకున్నారు. ఈ నేపథ్యంలో జేసీ కార్తీక్ ఆ భూములను పరిశీలించి వివరాలను సేకరించారు. వెంటనే నివేదికలు పంపాలని కావలి ఆర్డీవో సన్నీ వంశీకృష్ణ, తహసీల్దారు చంద్రశేఖర్‌ను ఆదేశించారు.



భూముల వివరాలను అడిగి తెలుసుకుంటున్న జేసీ కార్తీక్

రెవెన్యూ అధికారులపై జేసీకి ఫిర్యాదు

స్థానిక రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకుని ఇష్టం వచ్చినట్లు భూముల రికార్డులు మారుస్తున్నారని మాతూరు శ్రీనివాసులురెడ్డి జేసీకి ఫిర్యాదు చేశారు. విడవలూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 156, 157లో గల సుమారు 5.30 ఎకరాల భూమిలో దేవిరెడ్డి కిశోర్ కుమార్ రెడ్డి తనకు 3.50 ఎకరా అమ్మాడని, అయితే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయకపోవటంతో 2022లో కోర్టును ఆశ్రయించానన్నారు. సర్వే నెంబర్లులో ఎటువంటి మార్పులు, చేర్పులు చేయరాదని కోర్టు స్పష్టంగా ఆదేశాలు జారీ చేసినా, రెవెన్యూ అధికారులు ముడుపులు తీసుకుని దేవిరెడ్డి కిశోర్ కుమార్ రెడ్డి పొలాన్ని తన తమ్ముడైన దేవిరెడ్డి కిరణ్ కుమార్‌రెడ్డి పేరు మీద మార్చేశారని ఆరోపించారు. దీంతో జేసీ స్పందించి సమస్యను పరిష్కరించాలని తహసీల్దారును ఆదేశించారు.

కండలేరు ఇన్‌ఫ్లో 9,750 క్యూసెక్కులు

రాపూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 39.470 టీఎంసీలు ఉందని ఏఈ అనిల్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 9750 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1375 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉందని పేర్కొన్నారు.

టేకు చెట్లు ఉన్నాయా.. రాజేశ్వరమ్మా..!

పొదలకూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నీ పొలంలో అసలు టేకు చెట్లు ఉన్నాయా.. రాజేశ్వరమ్మా.. అని మరుపూరు సమీపంలోని 11.78 ఎకరాల బీడు పొలం యజమాని, నెల్లూరుకు చెందిన బింగిమల్లి రామమూర్తి, ఆయన స్నేహితుడు వినోద్‌సింగ్, టీడీపీ యువ నాయకులు డేగ యశ్వంత్ రెడ్డి, ఆదాల మురళీ రెడ్డి, అట్లూరు అనిల్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. గురువారం పొలం వద్ద మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పొలం యజమాని బింగిమల్లి రామమూర్తి మాట్లాడుతూ తమకు మరుపూరు వద్ద 11.78 ఎకరాల తోట ఉందని ఇప్పటికే తమ తోటలో మూడు సార్లు టేకు చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు తెలిపారు. తమ తోట పక్కనున్న కందిగట్ల రాజేశ్వరమ్మ అనే మహిళ తనకు చెందిన 20 ఎకరాలలో సుమారు 100 టేకు చెట్లు నరికినట్లు ఆరోపించింది. అసలు టేకు చెట్లేలేని పొలంలో టేకు చెట్లు ఎలా నరుకుతామని వారు ప్రశ్నించారు.

పెంచలకోనలో పవిత్రోత్సవాల ప్రారంభం

రాపూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం నాడు పవిత్రోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి జరిగే పూజల్లో తెలిసోతెలియకో జరిగే దోషాల ప్రాయశ్చిత్తం కోసం ప్రతి ఏటా ఈ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఉత్సవాల సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు అనుజ్ఞ, విశ్వక్సేనారాధన, అంకురార్పణ, స్నపన తిరుమంజనం, శ్రీవారి పవిత్రాల ప్రతిష్ఠ, ఆదివాస హోమంల, తదితర కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించామని ఆలయ ఉపకమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

● ఆలయాల్లో కొన్ని మార్పులు..

పెంచలకోనలో పవిత్రోత్సవాలు ఈ నెల 7వతేదీ వరకు జరుగుతున్న సందర్భంగా స్వామివారికి జరుగు నిత్య కళ్యాణం, అభిషేకం 6వతేదీ అనగా శనివారం తాత్కాలికంగా రద్దు చేసి తిరిగి 8వతేదీ నుంచి యధావిధిగా నిర్వహించబడును. అలాగే ఆదివారం చంద్రగ్రహణం కారణంగా శ్రీవార్ల ఆలయం మధ్యాహ్నం 3గంటల నుంచి మూసివేసి మరుసటిరోజు సోమవారం నాడు ఉదయం 9గంటలకు తెరిచి స్వామివారికి జరుగు పూజ కార్యక్రమాలు నిర్వహించబడునని ఆలయ అధికారులు తెలిపారు.

ఆక్రమణలు తొలగించుకోవాలి

బుచ్చిరెడ్డిపాళెం : నెల్లూరు-ముంబై జాతీయ రహదారికి ఇరువైపులా కాలువలపై ఉన్న శాశ్వత, తాత్కాలిక ఆక్రమణలను సంబంధిత వ్యక్తులు తక్షణమే స్వయంగా తొలగించుకోవాలని నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9వ తేదీ ఉదయంలోపు తొలగించకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా కాలువ పూడికతీత నిమిత్తం ఈ చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బాణసంచా పేలి ఇద్దరికి తీవ్ర గాయాలు

కోవూరు, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సత్రం వీధిలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమను గురువారం అర్ధరాత్రి నిమజ్జనానికి ప్రదర్శనగా తీసుకువెళ్తుండగా బాణసంచా పేలి ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఊరేగింపు బ్రహ్మయ్య మెడికల్స్ వద్దకు వచ్చేసరికి బాణసంచా పేలడంతో బ్రహ్మయ్యకు చెందిన ఇల్లు పూర్తిగా కాలిపోయింది. ఇంట్లో ఉన్న ఫ్యూన్సీ, ప్రదర్శనను తిలకిస్తున్న ఎలక్ట్రికల్ షాపు యజమాని సేట్ తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వీరిని నెల్లూరులోని జీజీహెచ్‌కు తరలించారు. ప్రమాద నివారణకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు.

చూసుకోండి.. మీదైతే తీసుకెళ్లండి!



స్మార్ట్ రైస్ కార్డు కోసం వెతుకుతున్న లబ్ధిదారులు

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. గత నెల 25న ప్రభుత్వం కార్డుల పంపిణీని ప్రారంభించింది. నెలచివరి వరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి పంపిణీ చేయాలని సూచించింది. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు డీలర్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే డీలర్లు అందుకు ససేమిరా అనడంతో ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని సచివాలయ సిబ్బందికి అప్పగించింది. అయితే ప్రస్తుతం వారు సర్వేలో నిమగ్నమై ఉండడంతో అవి డీలర్ల వద్దే ఉండిపోయాయి. కాగా ఉదయగిరిలో గురువారం ఓ చౌక దుకాణం ఎదురుగా ఉన్న టేబుల్‌పై స్మార్ట్‌రైస్ కార్డులను వరుసక్రమంలో ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన, దారిన వెళ్లే లబ్దిదారులతో అక్కడ రైస్‌కార్డులు ఉన్నాయి. పరిశీలించి మీదైతే తీసుకెళ్లడంటూ సూచించారు. జిల్లాలోని అన్నీ మండలాల్లో స్మార్ట్‌రైస్ కార్డుల పంపిణీ ఇలాగే కొనసాగుతోందని పలువురు అంటున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

నెల్లూరుకు రింగ్‌రోడ్డు

డీపీఆర్ సిద్ధం చేయిస్తున్నాం
నుడా ఛైర్మన్ కోటంరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నుడా ఛైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 4(ఆంధ్ర జ్యోతి): నెల్లూరు నగరానికి నుడా ఆధ్వర్యంలో రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో సీకాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులతో అయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను నుడా ఛైర్మన్‌గా ఉన్నప్పుడు రింగ్‌రోడ్డుకు డీపీఆర్‌ని సిద్ధం చేశామని చెప్పారు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని గాలికి వదిలేసిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో మరోసారి డీపీఆర్ సిద్ధం చేయిస్తున్నామని తెలిపారు. ఈ బాధ్యతలు సీకాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించామని చెప్పారు. వారి రిపోర్ట్‌పై మున్సిపల్ మంత్రి నారాయణతో సమగ్రంగా చర్చిస్తా మని కోటంరెడ్డి వెల్లడించారు. మంత్రి నారాయణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహకారంతో రింగ్ రోడ్డు ఏర్పాటుకు అన్నివిధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఇది ఏర్పాటైతే నగర రూపురేఖలు మారుతాయన్నారు. సమావేశంలో నుడా అధికారులు పాల్గొన్నారు.

అంకిత భావంతో ప్రజలకు సేవలందించాలి

● తహసీల్దార్లతో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూశాఖలో కీలకమైన తహసీల్దార్లు అంకితభావంతో, నిష్పక్ష పాతంగా ప్రజలకు సేవలందించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నెల్లూరు క్లబ్ సమావేశ మందిరంలో జిల్లాలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం, ఆదాయ, కుల, నివాస ధ్రువీ కరణ పత్రాలు, రేషన్‌కార్డులు, ఇతర రెవెన్యూ సంబంధ అంశాల పరిష్కారం కోసం ప్రజలు తహసీల్దారు కార్యాలయాలకు ఎక్కు వగా వస్తుంటారన్నారు. వారి సమస్యలను ఓపిగ్గా విని పరిష్క రించాలని సూచించారు. తహసీల్దార్లకు పనివత్తిడి పెరిగిందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటి కప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, జిల్లా నాయకుడు బొబ్బా మురళి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కలెక్టర్ ఆనంద్‌ను, కలెక్టరేట్‌లో బొప్పరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

నలుగురు ఏవోలకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 4 (ఆం ధ్రజ్యోతి): జిల్లాపరిషత్ పరిధిలో విధు లు నిర్వర్తిస్తున్న నలుగురు ఏవోలకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగం మండల ప్రజా పరిషత్‌లో ఏవోగా పని చేస్తున్న శైలజ, జడ్పీ కార్యాలయ ఏవో వాసుదేవ రావు, దుత్తలూరు మండల ఏవోగా వెంక టేశ్వర్లు, అల్లూరు మండల ఏవో పీ వెంకటేశ్వరరావుకు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. వీరిలో శైలజను నెల్లూరు జిల్లాకి కేటాయించగా వాసుదేవరావుని తిరుపతి జిల్లా, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రావుని చిత్తూరు జిల్లాకు కేటాయించారు.

ఎన్‌డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

● ఛైర్మన్ నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ఛైర్మన్ నాగేశ్వరావు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(ఎన్‌డీసీ ఎంఎస్) లిమిటెడ్ బలోపేతానికి కృషి చేస్తానని ఆ సొసైటీ ఛైర్మన్ జీ నాగేశ్వర రావు తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులోని సంస్థ కార్యాలయంలో అధికారులు, అద్దెకున్న షాపుల వారితో సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో ఎన్‌డీసీ ఎంఎస్ షాపులకు అద్దె చాలా తక్కువగా ఉందని, అక్కడ అద్దె పెంపునకు చర్యలు తీసుకుంటా మని చెప్పారు. నెల్లూరులోని రైస్‌మిల్లు స్థలంలో ప్రభుత్వ అను మతితో సంస్థకు ఆదాయం సమకూరే కట్టడాలు కడతామని చెప్పా రు. ఆ కార్యక్రమంలో బీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

బలిజ వివాహ పరిచయ వేదిక

నెల్లూరు టౌన్ హాల్ (రీడింగ్ రూమ్‌లో) 07-09-2025 ఆదివారం సాయంత్రం 4 గం. నుండి 7 గం. వరకు మధ్యవర్తులు, కమీషన్ లేకుండా బలిజ వివాహ పరిచయ వేదిక జరుగును. వెబ్సైటు సర్వీసు ఛార్జి 500/-. సం.ప్ర. సెల్: 93983 14847
AJR-240519

ప్లాట్లు అమ్మబడును

ఇస్కాన్‌సిటీలో ప్లాట్లు, నెల్లూరు నగరం, చుట్టు ప్రక్కల పొలములు, ఇండ్లు, స్థలములు, అపార్ట్‌మెంట్స్, ఫామ్ హౌసులు తక్కువ ధరకే అమ్మకమునకు కలవు. సంప్ర. సెల్: 98664 35396
AJR-240520

తమిళనాడు, ఆంధ్రా యాత్రలు

తేది.12-09-25 తమిళనాడు-తిరువన్నామలై
తేది. 19-09-25 ఆంధ్రా-కుండలేశ్వరం 2రో
టికెట్ 3600/- (A/c బస్సు రూం+ భోజనం).
కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240642

అమ్మబడును

■ నెల్లూరు జిల్లా, కందుకూరు పట్టణం, కోటారెడ్డినగర్ పరిధిలో ఇంటి స్థలం గది 25,000/-కు అమ్మబడును. రామాయపట్నం పోర్టు దగ్గరలో పొలాలు అమ్మబడును. సంప్ర: సెల్: 7032178599
AJO-240972

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ప్రైవేటు లేఅవుట్ల పరిశీలన



లేఅవుట్లను పరిశీలిస్తున్న తహసీల్దారు స్వప్న

ముత్తుకూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన లే అవుట్లను గురువారం తహసీల్దారు స్వప్న పరిశీలించారు. లే అవుట్ యజమానులతో మాట్లాడారు. లే అవుట్లకు సంబంధించిన అనుమతులు, ఇతర ధ్రువపత్రాలను తనిఖీ చేశారు. మండలంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన లేఅవుట్లను గుర్తిన్నట్లు తెలిపారు. అనధికార లేఅవుట్లను చట్టబద్ధం చేసుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్‌డీ హేమంత్ కుమార్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కోవూరు ఏఎంసీ ఛైర్మన్‌గా బెజవాడ వంశీకృష్ణారెడ్డి



బెజవాడ వంశీకృష్ణా రెడ్డి

విడవలూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : కోవూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ పదవిపై నెలకొన్న ఉత్కంఠకు గురువారం ప్రభుత్వం తెర దింపింది. ఊటుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బెజవాడ వంశీకృష్ణారెడ్డిని కోవూరు ఏఎంసీ ఛైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా బెజవాడ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టు కుంటానని, సేవా భావంతో పని చేస్తానని వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన నియామకం పట్ల టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

యువకుడి ఆత్మహత్య

సంగం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు ఎస్టీ కాలనీకి చెందిన దుర్గయ్య (25) పురుగుల మందు తాగి గురువారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



బాధ్యతలు స్వీకరిస్తున్న పురంధర్ రెడ్డి

విడవలూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరి కోతలు జోరుగా సాగుతున్న నేపథ్యంలో కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సహకారంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటానికి చర్యలు తీసుకుంటామని విడవలూరు పీఏసీఎస్ ఛైర్మన్ పొన్నలూరు పురంధర్‌రెడ్డి తెలిపారు. విడవలూరు పీఏసీఎస్ ఛైర్మన్‌గా గురువారం ఆయన భాధ్యతలు స్వీకరించారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను అందుబాటులోని తెస్తామన్నారు. బకాయిలను చెల్లించి సొసైటీ అభివృద్ధికి రైతులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ఈసీవో దద్దోలు రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

వెంకటాచలం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి యూనివర్సిటీలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీఎస్‌యూ వీసీ అల్లం శ్రీనివాసరావు హాజరయ్యారు. మాజీ రాష్ట్రపతి, విద్యావేత్త సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. క్రీడాపోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, డీకే కళాశాల మాజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సీ శారద, వర్సిటీ ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ తదితరులున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు సుజా ఎస్ నాయర్ ఎంపిక

మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న వీఎస్‌యూలోని ఎంబీఏ విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ప్రొఫెసర్ సుజాఎస్ నాయర్‌కు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం వీఎస్‌యూకే గర్వకారణమని వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు కొనియాడారు. సుజాఎస్ నాయర్‌కు గురువారం శుభాకాంక్షలు తెలియజేశారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ శుభాకాంక్షలు తెలియజేశారు.

వీఎస్‌యూలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు ఇంటర్వ్యూలు

విక్రమ సింహపురి యూనివర్సిటీలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15, 16 తేదీలలో వీఎస్‌యూలో ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు వీఎస్‌యూ వెబ్‌సైట్‌ను పరిశీలించాలన్నారు.





మాట్లాడుతున్న వీసీ శ్రీనివాసరావు, ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఎంపికైన ఆచార్య సుజా ఎస్ నాయర్

పొదలకూరు : నాగార్జున ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో గురువారం ముందస్తు గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులను శాలువాలతో సత్క రించారు. డీఎస్ఆర్ బాలికోన్నత పాఠశాలలో రకాల ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

ముత్తుకూరు: ముత్తుకూరులోని వీబీఆర్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రమేష్, ఏఓ ఊటుకూరు రాము, స్కూల్ అధ్యాపక బృందంతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100) : 570



బ్రేక్ డౌన్ లేకుండా పనిచేయాలి : ఆర్టీసీ ఈడీ

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జీరో బ్రేక్ డౌన్స్ స్ఫూర్తితో అందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ టీ చెంగల్‌రెడ్డి సిబ్బందికి పిలుపునిచ్చారు. నెల్లూరు-1 డిపో గ్యారేజ్ గేటు వద్ద గురువారం గేట్ మీటింగ్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఆగస్టు నెలలో నెల్లూరు జిల్లా జీరో బ్రేక్ డౌన్స్ సాధించడం హర్షణీయమన్నారు. ఇందుకు కృషి చేసిన మెకానికల్ సిబ్బంది, సూపర్వైజర్లు, అధికారులను అభినందించారు. ఆర్టీసీ ఆదాయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం జీ రవికాంత్, డిప్యూటీ సీఎంఈ డీ శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కే రమేష్ పాల్గొన్నారు.

వైద్య సేవల్లో సంస్కరణలు

● జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి



I.N.T.E.R.V.I.E.W.

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరిచేందుకు అనేక సంస్కరణలు తీసుకువస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కొండేటి మాధవి వెల్లడించారు. ఇటీవల జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టిన ఆమె ఆంధ్రజ్యోతితో పలు విషయాలు ముచ్చటించారు.

? ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా మెరుగుపరుస్తారు.

! జీజీహెచ్‌కు రోజుకు 1400 మందికిపైగా రోగులు వస్తుంటారు. ఎక్కువగా పేద వారే వస్తున్నారు. వారికి వైద్య చికిత్సలు మెరుగుపరిచేలా చర్యలు తీసుకుంటున్నాము. ఇందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నాం. రోగులు ఎలాంటి నిరాశకు గురికాకుండా పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తాం.

? ప్రత్యేక పర్యవేక్షణ ఎలా..

! ఆసుపత్రి ప్రసూతి విభాగంలో ప్రతీ నెల 350 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. ఇక్కడ చిన్నపిల్లల విభాగం కూడా ఉంది. అలాగే మిగిలిన అన్ని విభాగాల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా పర్యవేక్షణ ఉంటుంది.

? ఆధునిక వైద్య చికిత్సల మాటేమిటి...

! ఆసుపత్రిలో కొత్తగా గుండె వైద్య చికిత్సలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇందుకు ఓ వైద్యురాలిని ప్రభుత్వం నియమించింది. న్యూరాలజీ వైద్య చికిత్సలు కూడా జరుగుతున్నాయి. బ్రెయిన్‌స్ట్రోక్‌కు కూడా ఆధునిక వైద్యం అందేలా చర్యలు తీసుకుంటాం. త్వరలో 50 పడకలు క్రిటికల్ కేర్ విభాగం కూడా అందుబాటులోకి వస్తుంది.

? వైద్యులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుందా...

! వైద్యులపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. నేను, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ కలిసి ప్రతీరోజు రోగుల వార్డును తనిఖీ చేస్తాం. డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలి. అందుబాటులో లేని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. వైద్యులు, సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి.

కుళాయి కనెక్షన్లు క్రమబద్ధీకరించాలి

● కార్పొరేషన్ కమిషనర్ నందన్



వ్యాపారితో మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ),సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మున్సిపల్ తాగునీటి కుళాయి కనెక్షన్లను క్రమబద్ధీకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ నందన్ అధికారులను ఆదేశించారు. ఆయన గురువారం టీపీ ఆర్వో వాసుబాబు, ఈఈలు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేశారు. కాగా, నగరంలోని మున్సిపల్ కాంప్లెక్స్‌లు, మార్కెట్లు, జలపుష్పభవన్లను కమిషనర్ పరిశీలించారు. స్థానికంగా పారిశుధ్య పనులపై ఆరా తీశారు. మున్సిపల్ కాంప్లెక్స్‌లలో దుకాణాలు అద్దెకు తీసుకున్న వారి నుంచి రావాల్సిన బకాయిలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోడ్డు మార్జిన్ వ్యాపారులతో మాట్లాడారు. వాహన రాకపోకలకు అంతరాయం కలిగేలా దుకాణాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. వాకర్స్‌రోడ్డు, పుత్తాఎస్టేట్ ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

8న ఐటీఐలో ఉద్యోగమేళా

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ ఆఫీస్, సీడాప్ సంయుక్తంగా ఈనెల 8వతేదీన వెంకటేశ్వరపురం ప్రభుత్వ బాలుర ఐటీఐలో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే శ్రీధర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు జిల్లాలోని 15 కంపెనీలు హాజరై నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని యూత్ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

7న చంద్రగ్రహణం... 8న శాంతి పూజలు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వతేదీ ఆదివారం రాత్రి 9.50 నుంచి అర్ధరాత్రి 01.31గంటల వరకు రాహుగ్రస్త సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవిస్తుందని నగరంలోని పప్పులవీధి విఘ్నేశ్వరాలయం అర్చకుడు మాచవోలు కోటేశ్వరశర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ధనిష్ఠ, శతభిషం, పూర్వాభాద్ర, ఉత్తరాభాద్ర నక్షత్రాల వారు కుంభ, మీన రాశులలో జన్మించిన వారు ఈ గ్రహణాన్ని చూడరాదని తెలిపారు. మరుసటి రోజు(సోమవారం) ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విఘ్నేశ్వరాలయంలో గ్రహణ శాంతి పూజలు జరుగుతాయని తెలిపారు.

7న గొలగమూడికి పాదయాత్ర



నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 7వతేదీ ఉదయం 6 గంటలకు నగరంలో బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ నుంచి గొలగమూడి వెంకయ్యస్వామి సన్నిధికి పాదయాత్ర జరుగుతుందని అద్దాల సాయిబాబా మందిరం అధ్యక్షుడు మధు సాయి తెలిపారు. గురువారం మందిరంలో ఆయన ఈ కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం పాదయాత్ర వివరాలు తెలిపారు. సాయి మాలధారణ మండల దీక్ష షిరిడీ యాత్ర సందర్భంగా పాదయాత్ర చేస్తున్నట్లు చెప్పారు.

పెన్నా కరకట్టలు పటిష్ట పరచండి

● కలెక్టర్‌తో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి భేటీ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పెన్నానది కరట్టలను బలోపేతం చేయించాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కలెక్టర్ ఆనంద్‌ను కోరారు. ఆమె కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్‌తో భేటీ అయ్యారు. కనిగిరి రిజర్వాయర్ మట్టికట్టను బలోపేతం చేయటంతోపాటు, షట్టర్లకు మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రానున్న రబీ సీజన్‌కు సంబంధించి సాగునీటి కాలువలకు మరమ్మతులు చేయించాలన్నారు. కోవూరు చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను కూడా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. పీ-4 కార్యక్రమం కింద మైపాడు వద్ద చేపట్టిన బకింగ్ హామ్ కెనాల్ సుందరీకరణ పనులను ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షించి, పచ్చదనం కోసం తగు చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరారు. ఈ విన్నపాలు విన్న కలెక్టర్ రైతులకు ఇబ్బందులు లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు నాయకులు విజయకృష్ణారెడ్డి, లక్ష్మయ్య, సింగరి వీరరాఘవులు, పాకం వెంకయ్య, పెన్నా డెల్టా చైర్మన్ జెట్టి రాజగోపాల్‌రెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి రావెళ్ల వీరేంద్ర నాయుడు, కేవీ శేషయ్య పాల్గొన్నారు.



కలెక్టర్ ఆనంద్‌తో భేటీ అయిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

సర్వేపల్లి నియోజవర్గంలో రూ.73.97లక్షల సీఎం సహాయ నిధి పంపిణీ



సీఎం సహాయ నిధి చెక్కులు అందిస్తున్న సోమిరెడ్డి, అజీజ్

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సర్వేపల్లి నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద భారీ మొత్తం అందించినట్లు స్థానిక ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ వెల్లడించారు. గురువారం నగరంలోని సోమిరెడ్డి కార్యాలయంలో 99 మందికి రూ.73.97 లక్షలకు చెక్కులను పంపిణీ చేశారు. సోమిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు నియోజకవర్గంలో 379 మందికి రూ.4 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద అందించినట్లు తెలియచేశారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ పథకం కింద డబ్బులు రాక ప్రజలు అప్పులు చేసి ప్రైవేట్ వైద్యాన్ని పొందాల్సి వచ్చిందని విమర్శించారు. అజీజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో చెన్నైలోని అడయార్ ఆసుపత్రికి వైద్యం కోసం వెళితే ఆరోగ్యశ్రీ బకాయిలు ప్రభుత్వం కట్టాల్సి ఉందని, వైద్యం చేయలేమని చేతులెత్తేసే పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ బకాయిలు తీర్చటంతో వైద్య చికిత్సలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

బీఎడ్ ఫలితాల్లో ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం విడుదల చేసిన బీఎడ్ మూడో సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో నగరంలోని సంతపేట ప్రభుత్వ బీఈడీ కళాశాల విద్యార్థులు వందశాతం ఫలితాలు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీ లక్ష్మీ ప్రసూన తెలిపారు. యూనివర్సిటీ స్థాయిలో తమ కళాశాలకు చెందిన షేక్ ఫారహీన్ సుల్తానా 8.91 స్కోర్‌తో ప్రథమ స్థానం, ఏ భవానీ 8.82 స్కోర్‌తో ద్వితీయ స్థానంలో నిలిచారన్నారు. ఉత్తమ బోధనతోనే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని, మున్ముందు మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులను అభినందించారు.

కుటుంబ కలహాలతో ఏసీ మెకానిక్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తుకు బానిసై కుటుంబ కలహాల కారణంగా ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని డైకాస్‌రోడ్డు సమీప ఎన్‌సీసీ కాలనీలో మస్తానయ్య(36), అలేఖ్య దంపతులు నివసిస్తున్నారు. వారికి 18 నెలల పాప ఉంది. మస్తానయ్య ఏసీ మెకానిక్ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కొంత కాలంగా ఆయన వేరే మహిళతో వివాహేతర సంబంధం నడపటమేకాక వ్యసనాలకు బానిసై అప్పులు చేసి కుటుంబాన్ని పట్టించుకోకుండా ఉన్నాడు. ఈ క్రమంలో భార్యభర్తల నడుమ తరచూ గొడవలు జరుగుతుండేవి. ఇదేవిధంగా ఈ నెల 3వ తేదీ రాత్రి కూడా గొడవ జరిగింది. దీంతో మస్తానయ్య భార్య నిద్రపోయిన తర్వాత ఇంట్లో ఉరేసుకున్నాడు. ఇది గమనించిన ఆలేఖ్య బంధువులకు చెప్పడంతో వారు మస్తానయ్యను కిందకు దించి జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. గురువారం మస్తానయ్య తమ్ముడు సాయి ఫిర్యాదుతో వేదాయపాళెం పోలీసులు వైద్యశాలకు చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ నెల్లూరు-1 డిపో మేనేజర్‌గా వెంకటేశ్వర్లు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ నెల్లూరు-1 డిపో మేనేజర్‌గా జీ వెంకటేశ్వర్లు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎంగా ఉన్న మురళీకృష్ణ ఈ ఏడాది జూలైలో ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి డీఎంగా సీఐ సునీత వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో గూడూరు డిపో మేనేజర్‌గా ఉన్న వెంకటేశ్వర్లును నెల్లూరు-1 డీఎంగా సంస్థ బదిలీ చేసింది. ఆయన గతంలో నెల్లూరు-1,2 డిపోల సీఐగా పనిచేశారు.

9న టీఆర్‌ఆర్‌లో అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల(గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకం కోసం ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు విభాగాలలో పనిచేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వెంకటేశ్వరపురంలో సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు

నెల్లూరు(వెంకటేశ్వరపురం/రూరల్), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటేశ్వరపురంలోని బ్లాక్‌బోర్డు మిత్ర మండలి, వికలాంగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమికనోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మస్తాన్ నాయుడు, ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయ దినోత్సవ విశేషాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్‌బోర్డు మిత్రమండలి అధ్యక్షుడు, పీఎంపీ ప్రసాద్, సనావుల్లా తదితరులు పాల్గొన్నారు. కాగా, బుజబుజ నెల్లూరులోని శేషు స్కూల్లో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బద్దేపూడి నరసింహగిరి, స్కూల్ కరస్పాండెంట్ బీ శేషు యాదవ్ మాట్లాడుతూ ఉత్తమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయులది కీలక పాత్ర అన్నారు. దేశానికి ఉత్తమ పౌరులను అందించేది ఉపాధ్యాయులేనని తెలిపారు. అనంతరం ఉపాధ్యాయులను సత్కరించారు.

నేడు అప్సా ఉపాధ్యాయ దినోత్సవం

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ సంఘం అప్సా ఆధ్వర్యంలో నగరంలోని జీఎస్‌ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు కర్తం ప్రతాప్‌రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని అన్నీ పాఠశాలల కరస్పాండెండ్లు, ఉపాధ్యాయుల్లో ఉత్తమ సేవలందించిన వారిని సత్కరిస్తామని తెలిపారు. ఉపాధ్యాయులందరూ ఉదయం 9 గంటలకు కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

బీజేపీ జిల్లా మీడియా ఇన్‌చార్జిగా చిన్నారెడ్డి



నియామక పత్రం అందుకుంటున్న చిన్నారెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ జిల్లా మీడియా ఇన్‌చార్జిగా చిన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డిని పార్టీ జిల్లా అధ్యక్షుడు శీపారెడ్డి వంశీధర్ రెడ్డి నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని గురువారం బీజేపీ జిల్లా కార్యాలయంలో అందించారు. శ్రీనివాసులురెడ్డి 35 ఏళ్లుగా బీజేపీలో ఉంటూ గతంలో జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, రైల్వే కన్సల్టేటివ్ కమిటీ మెంబర్‌గా పనిచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం విజయ్‌కుమార్ యాదవ్, యశ్వంత్‌సింగ్ పాల్గొన్నారు.

ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలి

● జిల్లా రిజిస్ట్రార్ (ఆడిట్) దీపిక

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : దస్తావేజుల రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే ప్రజలతో సబ్ రిజిస్ట్రార్లు, కార్యాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా వ్యవహరించి రిజిస్ట్రేషన్లు చేసి పంపాలని జిల్లా రిజిస్ట్రార్(ఆడిట్) ఎన్ దీపిక సూచించారు. గురువారం బుజబుజ నెల్లూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. పలు దస్త్రాలను పరిశీలించారు. స్నేహపూర్వక వాతావరణంలో రిజిస్ట్రేషన్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ ప్రవీణ, మోనిక, రమేష్, సీతారామమూర్తి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ దీపిక

వేలాది విద్యార్థుల జీవితాలకు వెలుగునిచ్చిన మహోన్నతమూర్తి, గురుదేవులు శ్రీ ఎమ్.ఎస్.రాజు గారిని గురుపూజోత్సవం సందర్భంగా స్మరించుకొంటూ...
వై.మోహన్‌రాజు, కరస్పాండెంట్
శ్రీ సింహపురి E.M హైస్కూల్, వేదాయపాలెం సెల్:9866431779
శ్రీ సింహపురి డేస్కూల్, ICSE సెంట్రల్ సిలబస్ పొదలకూరు రోడ్డు, విజయలక్ష్మీనగర్
శ్రీ సింహపురి పబ్లిక్ స్కూల్, ICSE సెంట్రల్ స్కూల్ కొమరపూడి, నెల్లూరు
కీ.శే. ఎమ్.ఎస్.రాజు గారు శ్రీ సింహపురి విద్యాసంస్థలు

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
తమ శిష్యుల ఎదుగుదలే పరమావధిగా భావించిన ప్రతి గురువులకు మరియు మా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులందరికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
అందె శ్రీనివాసులు Correspondent, Cell: 9502622577
M.A., B.Ed., M.B.A., Principal, Cell: 92464 22244
S.V.R E.M. High School

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మా ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు, సిబ్బందికి, మా విద్యార్థిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
"KNOWLEDGE IS POWER" ☎ : 2317504, 9490891980
SRI GEETHANJALI E.H. HIGH SCHOOL
(Recognised by the Govt. of A.P.)
Lakshmi Nagar, Balaji Nagar (Exten.), Nellore-2.

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మా విద్యార్థిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ సిబ్బందికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
KRISHNAVENI HIGH SCHOOL
Near Petrol Bunk, Mypadu Gate Centre, Nawabpeta, Nellore-2. Cell : 90595 94695, 92487 88898

ఆచార్య దేవోభవ
ఎంతో మంది విద్యార్థులను మేధావులుగా తీర్చిదిద్ది, భారతావనికి అందించిన మా "గురుదేవులు" శ్రీ పులి జగదీశ్వరరావు గారికి టీచర్స్ డే శుభాకాంక్షలు...
మీ... 10th Class Batch (2025-26)
గొల్లవీధి, రంగనాయకులపేట, నెల్లూరు
పులి జగదీశ్వరరావు


ఉపాధ్యాయ దినోత్సవ మరియు మిలాడినబి శుభాకాంక్షలు
మా ఖాతాదారులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు ఉపాధ్యాయ దినోత్సవ మరియు మిలాడినబి శుభాకాంక్షలు...
CAR ZONE Ultimate Car Decors
కరెంటు ఆఫీస్ సెంటర్, దర్గామిట్ట, నెల్లూరు-4. ఎ.పి.,
email: nellore.carzone@gmail.com
సెల్ : 95503 73299 , 94406 91303

మన నెల్లూరులో మొదటి సారిగా ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో
100% చేనేత ఉత్పత్తులతో
ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో వారి
అత్యంత విశ్వసనీయ ప్రదర్శన సహిత అమ్మకం మరియు వెడ్డింగ్, దసరా, దీపావళికి మిమ్మల్ని ఆహ్వానిస్తున్నారు
ప్రవేశం ఉచితం !!
4, 5, 6, 7, 8 సెప్టెంబర్ 2025
వేదిక : జి పి ఆర్ గ్రాండ్, మినీ బైపాస్ రోడ్, నెల్లూరు
సంప్రదించండి: 95735 53337 లేదా 9000346337 info@indiansilkgallery.com

ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు
మా విద్యార్థిని, విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయ సిబ్బందికి ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు...
A Unique project by NRIs
AVENUES SENIOR SECONDARY SCHOOL
Affiliated to CBSE, New Delhi
ADMISSION FROM NURSERY - GRADE 11
PRASANTHI NAGAR, BRAHMANANDAPURAM, NELLORE
CONTACT : 9247007000, 9100894555
info@avenuesschool.com www.avenuesschool.com

గురుపూజోత్సవం శుభాకాంక్షలు...
SSB కళ్యాణ మండపం నెల్లూరు
Ac/ Non-Ac ఫంక్షన్ హాల్
మీ పెళ్లి వేడుకలకు అద్భుతమైన వేదిక!
✓ Specious Hall ✓ Parking Facility
✓ A/C or Non-A/C
✓ Budget Friendly Packages
అంబాపురం, కొత్తూరు, నెల్లూరు
CALL: +91 88855 53957 98495 05039

కన్నతండ్రే కాలయముడు



హత్యకు గురైన మోక్షిత, వర్షిణి, శివధర్మ (ఫైల్)

ముగ్గురు పిల్లలను చంపి తానూ ఆత్మహత్య

ఎర్రగొండపాలెం రూరల్, నాగర్‌కర్నూల్/వెల్దండ/ఉప్పునుంతల/కల్వకుర్తి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కన్న బంధం మాటున క్రూరత్వం దాగుందని తెలియదా ముక్కుపచ్చలారని పిల్లలకు! వేలు పట్టి నడిపించే నాన్నే కాలయముడు అవుతాడని ఊహించి ఉండరు ఆ చిన్నారులు! ఓ తండ్రి పేగుబంధాన్ని మరిచి తన ముగ్గురు పిల్లలనూ పాశవికంగా చంపిన దారుణ ఘటన నాగర్‌కర్నూలు జిల్లాలో వెలుగుచూసింది. ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం పెద్దబోయపల్లికి చెందిన గుత్త వెంకటేశ్వర్లు(38) మేనమరదలు దీపికను 12ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తెలు మోక్షిత (8), వర్షిణి (6), కుమారుడు శివధర్మ (4) ఉన్నారు. భార్యతో గొడవపడిన వెంకటేశ్వర్లు గత నెల 30న ముగ్గురు పిల్లలను బైక్‌పై ఎక్కించుకుని ఇంటి నుంచి వెళ్లిపోయాడు. దీంతో దీపిక తన భర్త, పిల్లలు అదృశ్యమయ్యారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టగా వెంకటేశ్వర్లు 31న శ్రీశైలం మీదుగా నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట సమీపంలోని హాజీపూర్ చౌరస్తా వరకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా గుర్తించారు. ఆ క్రమంలో పిల్లలు ఒక్కొక్కరుగా తండ్రితో పాటు బైక్‌పై కనిపించకపోవడం ఆందోళన రేకెత్తించింది. పోలీసులు వెల్దండ మండలం పెద్దాపూర్ దగ్గర వెంకటేశ్వర్లు మృతదేహాన్ని బుధవారం గుర్తించారు. అతడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు నిర్ధారించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పిల్లల జాడ కోసం సీసీటీవీ ఫుటేజ్‌ల ఆధారంగా జల్లెడ పట్టారు. చారకొండ మండలం జూపల్లి వచ్చేసరికి వెంకటేశ్వర్లుతో పెద్దకూతురు మోక్షిత ఒక్కతే ఉంది. ఆ తర్వాత వెంకటేశ్వర్లు ఒంటరిగా కల్వకుర్తి పట్టణానికి చేరుకున్నాడని నిర్ధారణకు వచ్చారు. దాంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి జాతీయ రహదారికి ఇరువైపులా గాలించారు. గురువారం మధ్యాహ్నం ఉప్పునుంతల మండలం సూరాపూర్ తండా వద్ద వర్షిణి, శివధర్మల మృతదేహాలు, కల్వకుర్తి మండలం తాండ్ర సమీపంలో మోక్షిత మృతదేహం పూర్తిగా కాలిపోయిన స్థితిలో లభ్యమయ్యాయి. వెంకటేశ్వర్లు ఒక్కోచోట పిల్లలను హతమారుస్తూ వచ్చినట్లు తేలింది. పురుగులమందు తాగించి చంపి, తర్వాత పెట్రోల్ పోసి దహనం చేశాడని భావిస్తున్నారు. వెల్దండ, ఉప్పునుంతల, కల్వకుర్తి మండలాల పోలీసులు పూర్తిస్థాయి విచారణ ప్రారంభించారు. ప్రకాశం జిల్లా నుంచి ప్రత్యేక పోలీసు బృందం అచ్చంపేట చేరుకుంది.

ఏబీసీ చైర్మన్‌గా కరుణేష్ బజాజ్



న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: ఆడిట్ బ్యూరో ఆఫ్ సర్క్యులేషన్స్ (ఏబీసీ) చైర్మన్‌గా ఐటీసీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్, ఎక్స్‌పోర్ట్స్) కరుణేష్ బజాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏడాది పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు. పాతికేళ్లకు పైగా ఐటీసీలో వివిధ హోదాల్లో పనిచేశారు. పలు బ్రాండ్లు దేశవ్యాప్తంగా విస్తృత గుర్తింపు పొందడంలో ఆయన కృషి ఉంది. ఐటీసీ కంటే ముందు భారతీ రిటైల్ లిమిటెడ్ (భారతీ-వాల్‌మార్ట్ జేవీ)లో 'హెడ్ ఆఫ్ బ్రాండ్స్'గా పనిచేశారు. ఏబీసీ డిప్యూటీ చైర్మన్‌గా బెన్నెట్ అండ్ కోల్‌మన్ కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మోహిత్ జైన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

8 ఏళ్ల తర్వాత తప్పు దిద్దుకున్నారు: ఖర్గే

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: 'ఒకే దేశం ఒకే పన్ను' పేరిట ఇప్పటి వరకూ 'ఒకే దేశం 9 పన్నుల' విధానాన్ని అమలు చేశారని, ఎనిమిదేళ్ల తర్వాత తప్పును గ్రహించి సరిదిద్దుకునే ప్రయత్నం చేశారని కేంద్రం తీసుకొచ్చిన జీఎస్టీ మార్పులపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే గురువారం ఎక్స్‌లో ఈ మేరకు స్పందించారు. రైతుల మీద కూడా (36 రకాల వ్యవసాయ ఉపకరణాలపై) పన్ను వేశారని, మొత్తం జీఎస్టీ రాబడిలో 64% పేదలు, మధ్యతరగతి ప్రజల నుంచి వస్తోందని తెలిపారు. మోదీ సర్కారు కార్పొరేట్ ట్యాక్స్‌ను 30 నుంచి 22 శాతానికి తగ్గించి సంపన్నులకు మరింత లబ్ధి చేకూర్చిందని ఖర్గే దుయ్యబట్టారు. జీఎస్టీ సరళీకరణ, శ్లాబుల తగ్గింపు మంచి నిర్ణయమని, అయితే, దీనికి 8 ఏళ్లు ఎందుకు పట్టిందని మాజీ ఆర్థికమంత్రి చిదంబరం ప్రశ్నించారు.

లబ్ధిని వినియోగదారులకు అందించండి

» జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను వినియోగదారులకు అందించాలని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్ పరిశ్రమ వర్గాలకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇదే అతిపెద్ద పన్ను సంస్కరణ అని, దీన్ని 'గేమ్ చేంజర్'గా అభివర్ణించారు. 2047 కల్లా భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చడంలో ఈ సంస్కరణలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. దాదాపు అన్ని రంగాల్లో డిమాండ్ పెరుగుతుందని, ఫలితంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. స్వదేశీ వస్తువుల విక్రయాలను భారీగా ప్రోత్సహించాలని పరిశ్రమ వర్గాలను కోరారు. గురువారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

ఆ మంత్రులపై క్రిమినల్ కేసులు

కేంద్రమంత్రుల్లో 40% మంది వీరే.. రాష్ట్రాల్లో 47%మందిపై నేరాభియోగాలు

- » కొందరిపై హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన క్రిమినల్ ఆరోపణలు
- » ఏపీ కేబినెట్‌లోని 25 మందిలో 22 మందిపై కేసులు
- » తెలంగాణలోని 15మంది మంత్రుల్లో 11 మందిపైనా..
- » తొలి పది మంది బిలియనీర్లలో ఆరుగురు తెలుగువాళ్లే
- » సంపన్నుల జాబితాలో చంద్రబాబు, లోకేశ్ 3, 7 స్థానాల్లో: ఏడీఆర్ నివేదిక



ఆస్తులు, అప్పుల్లో పెమ్మసాని టాప్

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రివర్గంలోని 72 మందిలో 40శాతం మంత్రులపైనా, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 643 మంది మంత్రుల్లో 47 శాతం మంది మంత్రులపైనా క్రిమినల్ కేసులు ఉన్నాయని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) సంస్థ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గ సభ్యులతోపాటు దేశంలో 27 రాష్ట్ర అసెంబ్లీలు, మూడు కేంద్రపాలిత ప్రాంతాల మంత్రుల నేపథ్యాన్ని వారు సమర్పించిన అఫిడవిట్ల ద్వారా ఏడీఆర్ సేకరించింది. గురువారం ఆ వివరాలను వెల్లడించింది. వీరిలో 47 శాతం మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్టు పేర్కొన్నారని తెలిపింది. ఏపీ అసెంబ్లీలో 25 మంది మంత్రులు ఉండగా, 22 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయని తెలిపింది. వారిలోనూ 14 మందిపై తీవ్రమైన కేసులు ఉన్నాయని తేల్చింది. తెలంగాణలో కూడా 15 మంది మంత్రుల్లో 11 మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో ఆరుగురిపై తీవ్రమైన క్రిమినల్ నేర ఆరోపణలు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది. కేంద్ర మంత్రివర్గంలో పార్లమెంట్ ఉభయ సభలకు చెందిన 72 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 29 మంది క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు. 19 మంది మంత్రులపై అత్యంత తీవ్రమైన నేర అభియోగాలు ఉన్నాయి. రాష్ట్రాల అసెంబ్లీల్లో 643 మంది మంత్రులు ఉన్నారు. వారిలో 302 మంది తమపై క్రిమినల్ కేసులు ఉన్నాయని వెల్లడించారు. వీరిలో 174 మంది మంత్రులు హత్య, హత్యాయత్నం, అపహరణ, మహిళలపై నేరాలు వంటి అత్యంత తీవ్రమైన క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారు.

పార్టీలవారీగా..

రాష్ట్రాల్లో బీజేపీకి చెందిన 336 మంది మంత్రుల్లో 136 మందిపై, కాంగ్రెస్ కు చెందిన 61 మంది మంత్రుల్లో 13 మంది మంత్రులపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 40 మంది మంత్రుల్లో 13 మందిపై, ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 16 మందిలో 11 మందిపై, సీపీఎంకు చెందిన పది మంది మంత్రుల్లో ఆరుగురిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి.


ఆస్తుల లెక్కలు..

రాష్ట్రాల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న మొత్తం మంత్రుల ఆస్తుల విలువ రూ.23,929 కోట్లు. కేంద్ర, రాష్ట్రాల్లో కలిపి చూస్తే మొత్తం 36 మంది మంత్రులు ఒక్కొక్కరి ఆస్తి రూ.100 కోట్లకు పైగానే ఉంటుంది. సగటున కేంద్ర, రాష్ట్ర మంత్రుల ఆస్తి విలువ రూ.37.21 కోట్లు. 30 రాష్ట్ర అసెంబ్లీల్లో 11 అసెంబ్లీల్లో వందకోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కర్ణాటకలో అత్యధికంగా ఎనిమిది మంది మంత్రులు రూ.100 కోట్లకు పైగా ఆస్తులను సమీకరించారు. ఆ తర్వాతి స్థానం ఏపీ, మహారాష్ట్రలకు దక్కుతుంది. ఆంధ్రప్రదేశ్ మంత్రుల్లో ఆరుగురి ఆస్తులు రూ.100 కోట్లకు పైనే. తెలంగాణ మంత్రుల్లో ఇద్దరు మాత్రమే రూ.100 కోట్లకు పైగా ఆస్తులు కలిగి ఉన్నారని తెలిపింది.

టాప్‌లో బీజేపీ..

పార్టీల వారీగా చూస్తే బీజేపీలోనే అత్యధికంగా 14 మంది రూ.100 కోట్లకు పైగా ఆస్తులున్న మంత్రులు ఉన్నారు. కాంగ్రెస్ లో 61 మంది మంత్రుల్లో 11 మంది బిలియనీర్లు. మూడోస్థానం తెలుగుదేశం పార్టీది. కేంద్ర, రాష్ట్ర మంత్రుల వారీగా చూస్తే దేశంలో అత్యధిక ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో గుంటూరు పార్లమెంట్ సభ్యుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన ఆస్తుల విలువ రూ.5,705 కోట్లు. ఆ తర్వాత స్థానంలో ఉన్న కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు రూ.1,413 కోట్ల మేరకు ఆస్తులు ఉన్నాయి. మూడోస్థానంలో ఉన్న ఏపీ సీఎం చంద్రబాబు ఆస్తుల విలువ రూ.931 కోట్లు. నాలుగో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి నారాయణ ఆస్తులు రూ.824 కోట్లు. ఐదో స్థానంలో ఉన్న కర్ణాటక మంత్రి సురేశ్ కు రూ.648 కోట్ల ఆస్తులున్నాయి. ఆరో స్థానంలోని తెలంగాణ మంత్రి గడ్డం వివేకానంద్ ఆస్తుల విలువ రూ.606 కోట్లు. ఏడో స్థానంలో ఉన్న ఏపీ మంత్రి లోకేశ్ ఆస్తుల విలువ రూ.542 కోట్లు. ఎనిమిదో స్థానంలో ఉన్న మహారాష్ట్ర మంత్రి మంగళ్ ప్రభాత్ లోధా ఆస్తుల విలువ రూ.447 కోట్లు. తొమ్మిదో స్థానంలోని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆస్తుల విలువ రూ.433 కోట్లు. పదో స్థానంలోని మధ్యప్రదేశ్ కు చెందిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ఆస్తుల విలువ రూ.424 కోట్లు. కాగా, అతితక్కువ ఆస్తులున్న పదిమంది మంత్రుల్లో త్రిపురకు చెందిన శుక్ల చరణ్ నోషియాకు కేవలం రూ.2 లక్షలు మేరకు మాత్రమే ఆస్తులు ఉండడం గమనార్హం. కాగా, ఆస్తులతోపాటు అత్యధిక అప్పులు ఉన్న మంత్రుల్లో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. ఆయన అప్పుల విలువ 1,038 కోట్ల మేరకు ఉన్నాయి. ఏపీ మంత్రి నారాయణ అప్పుల విలువ 190 కోట్లు ఉంటుందని ఏడీఆర్ తెలిపింది.

లోకం తీరు



కర్ణాటక కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర నివాసంపై మళ్లీ ఈడీ దాడులు

బెంగళూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): చిత్రదుర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే వీరేంద్ర పప్పీ నివాసంపై ఈడీ అధికారులు మరోసారి దాడులు నిర్వహించారు. చెళ్లకెరె నగరంలోని ఆయన నివాసంలో తనిఖీలు జరిపారు. బ్యాంకు ఖాతాలలో ఉన్న రూ.55 కోట్లను జప్తు చేశారు. ఎమ్మెల్యే వీరేంద్ర అక్రమ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఈడీ అధికారులు గుర్తించి, ఇటీవల అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆయన ఈడీ కస్టడీలో ఉన్నారు. విచారణలో సేకరించిన సమాచారం ఆధారంగా బుధవారం మరోసారి దాడులు నిర్వహించారు. 5విలాసవంతమైన కార్లను, బ్యాంకు ఖాతాల్లో ఉన్న రూ.55కోట్లను జప్తుచేశారు. వీరేంద్ర తక్కువ సమయంలోనే ఏకంగా రూ2వేల కోట్లు సంపాదించారని ఈడీ గుర్తించింది. దుబాయిలో ఉన్న ఆయన సహచరులు కూడా ఇదే దందా సాగిస్తున్నట్లు గుర్తించారు.

ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్ ఆర్మనీ కన్నుమూత

మిలన్, సెప్టెంబరు 4: ఇటలీకి చెందిన ప్రపంచ ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ జియోర్గియో ఆర్మనీ కన్నుమూశారు. ఆయన వయసు 91 ఏళ్లు. తాను నెలకొల్పిన జియోర్గియో ఆర్మనీ ఫ్యాషన్ హౌస్ 50 ఏళ్ల ఉత్సవాన్ని ఈ నెలలో నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే ఆయన తుది శ్వాస విడిచారు. సాధారణ ఇటాలియన్ ప్యాంటు, షర్టు వంటి రెడీమేడ్ దుస్తులతో వ్యాపారాన్ని ప్రారంభించి 10 బిలియన్ డాలర్ల సామ్రాజ్యంగా విస్తరించారు. సౌందర్య దృష్టిని వ్యాపారం గా మార్చడంలో విజయం సాధించిన పారిశ్రామికవేత్తగా గుర్తింపు పొందారు. 1934 జూలై 11న పియాసెంజా అనే చిన్న పట్టణంలో జన్మించిన ఆయన తొలుత ఓ డిపార్ట్‌మెంట్ స్టోర్‌లో పనిచేశారు.

మామంచి మాస్టార్లు!

- ● చదువుపై ఆసక్తి పెంచుతూ బోధనలు
- ● బాలలను రేపటి పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- ● బడుల ఉన్నతికీ అవిరాళ కృషి
- ● నేడు ఉపాధ్యాయ దినోత్సవం

ఒకరు గాలిబుడగల ద్వారా బోధిస్తే.. మరొకరు ఆట వస్తువులతో విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచుతారు. మరికొందరు ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు, ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ పిల్లలు బడిబాట పట్టేలా చేస్తున్నారు. ఇక తాము చదువు చెప్పుతున్న బడిలో మౌలిక సదుపాయాల కల్పన కోసం సొంత నిధులతోపాటు దాతల సహకారం తీసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తమ్మీద పిల్లలకు ఉత్తమ బోధన అందిస్తూ ఎంతోమంది ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలుస్తున్నారు. శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా అలాంటి గురువుల్లో కొందరిపై ప్రత్యేక కథనాలు మీకోసం...

పుస్తకాలతో కాదు.. బొమ్మలతోనూ బోధన




బొమ్మలతో విద్యార్థులకు బోధిస్తున్న శ్రీనివాసులు

విద్యార్థులకు పుస్తకాలతోనే కాదు.. బొమ్మలతో కూడా పాఠాలు బోధించవచ్చని లెక్కల శ్రీనివాసులు. తన సొంత నగదుతో రకరకాల వస్తువులు, బొమ్మలను కొనుగోలుచేసి వాటిని పాఠశాలలో ప్రదర్శిస్తూ విద్యార్థులకు చదువుపై మక్కువ పెంచుతున్నారు. 2008లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన శ్రీనివాసులు మొదట కొండాపురం మండలం బగాదిపల్లి, వెంకటరంగాపురంలో పనిచేశారు. ఆ తర్వాత కలిగిరి మండలం కావలిముస్తాపురంలో 2013 నుంచి 2023 వరకు పనిచేసి విద్యార్థులు, తల్లిదండ్రుల మన్ననలు అందుకున్నారు. 2023లో మండలంలోనే అనంతపురం సౌత్ ప్రాథమిక పాఠశాలకు బదిలీ అయ్యారు. తాను ఎక్కడ పని చేసినా విద్యార్థుల విద్యాభివృద్ధికి శ్రీనివాసులు కృషి చేస్తున్నారు. కొన్ని రకాల వస్తువులతో కళారూపాలను తయారు చేయించి విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీస్తున్నారు. అదేవిధంగా పాఠశాలలో వార్షికోత్సవాలు నిర్వహించి ఆట, పాటలు, విద్యలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్నారు. ఉపాధ్యాయవృత్తి అంటే తనకు అత్యంత ప్రీతి అని, విద్యార్థుల లేత మనసుకు ఆకట్టుకునే విధంగా బోధన జరిగితే వారు అన్ని రంగాల్లో రాణిస్తారనేది శ్రీనివాసులు ఉద్ఘాటన.

- కలిగిరి

బోధనతోపాటు సామాజిక సేవ చేస్తూ..




వరద బాధితుల కోసం రూ.10 వేల చెక్కును కలెక్టర్‌కు ఇస్తున్న చెన్నయ్య (ఫైల్)

విద్యతోనే ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని, అందుకు పేదరికం అడ్డుకాదని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యా యుడు చీదరాల చెన్నయ్య అన్నారు. బుచ్చి మండలం కట్టుబడిపాలెంకు చెందిన చీదరాల చెన్నయ్య ఎంఏ, ఎంఈడీ పూర్తి చేశారు. 1997లో అదే మండలంలోని నాగాయగుంట ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్‌జీటీ)గా చేరారు. అప్పటి నుంచి తన జీతంలో 10 శాతం సామాజిక సేవ కోసం ఖర్చు చేస్తున్నారు. పలు పురస్కారాలనూ అందుకున్నారు. 2023లో సామాజిక సేవలకు గుర్తింపుగా పుదుచ్చేరిలో ఏషియన్ ఇంటర్నేషనల్, కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి ప్రముఖుల చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. శుక్రవారం విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకోనున్నారు.

- బుచ్చిరెడ్డిపాళెం

సృజనాత్మక బోధన ఈమె ప్రత్యేకం



బోధనోపకరణం చూపుతూ బోధిస్తున్న మోహసిన్ సుల్తానా

సృజనాత్మక బోధనతో విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందిస్తూ ఆదర్శవంతమైన ఉపాధ్యాయినిగా విద్యార్థులు, తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంటోంది. పాటూరు మోడల్ ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయిని మోహసిన్ సుల్తానా. 2002లో ముత్తుకూరు మండలం కృష్ణపట్నం జడ్పీ హైస్కూల్‌లో జీవశాస్త్ర ఉపాధ్యాయినిగా చేరిన ఆమె బోధనలో వినూత్న పద్ధతులు పాటిస్తున్నారు. దీంతో విద్యార్థులు ఆమె చెప్పే పాఠాలు వినడానికి చాలా ఆసక్తి చూపుతున్నారు. కృష్ణపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చేరిన ఏడాదే జీవ, రసాయనశాస్త్రాలను విద్యార్థులకు బోధించారు. పదోతరగతి సైన్స్ సబ్జెక్టులో విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులయ్యారు. ● కేవలం పాఠాలు బోధించడమే కాకుండా సృజనాత్మకతను పెంపొందించే పలు ప్రయోగాలను విద్యార్థులతో చేయిస్తున్నారు. సైన్స్ ఫెయిర్‌లో జిల్లాస్థాయిలో రెండుసార్లు తమ విద్యార్థులు విజేతలయ్యేలా తర్ఫీదునిచ్చారు. ఎంతోమంది పిల్లల్ని బడిబాట పట్టించారు. ● సహచర ఉపాధ్యాయులకు మార్గదర్శకత్వం వహించే విధంగా ఎల్ఈపీ కార్యక్రమానికి రిసోర్సు పర్సన్‌గా ఎంపికయ్యారు. ఉత్తమ పనితీరు కనబరచారు.● విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించేందుకు వ్యక్తిగత శ్రద్ధతో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్ఎం) తయారుచేస్తున్నారు. ప్రాక్టికల్‌గా పాఠ్యాంశాలు బోధిస్తుండడంతో విద్యార్థులు సైన్స్ సబ్జెక్టుపై మక్కువ పెంచుకున్నారు. అంతేకాదు.. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి విద్యాభివృద్ధికి తోడ్పడుతున్నారు. ● పర్యావరణ పరిరక్షణ కోసం తా ను పని చేసిన ప్రతి పాఠశాలలోనూ ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేసి, మొక్కలు నాటిస్తున్నారు.

- కోవూరు

మా మంచి ముజీర్ సార్!




ఉత్తమ ఉపాధ్యాయుడు ముజీర్ (ఫైల్)

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన వ్యాయామ ఉపాధ్యాయుడు ముజీర్ స్వస్థలం ఇందుకూరుపేట మండలం ముదివర్తిపాలెం. తల్లిదండ్రులు కుడితిపాలెం షేక్ ఇబ్రహీం, రహమతున్నీసా. 6 నుంచి 10వ తరగతి వరకు ముదివర్తిపాలెంలో విద్యను అభ్యసించారు. ముదివర్తిపాలెం నుంచి నేషనల్స్‌లో మొట్టమొదటి పతకం సాధించిన క్రీడాకారుడిగా ప్రశంసలందుకున్నారు. జిల్లా నుంచి ఖోఖోలోనే కాకుండా అథ్లెటిక్స్‌లో జాతీయ స్థాయిలో మెడల్ సాధించారు. 1994-95లో శ్రీవెంక టేశ్వర యూనివర్సిటీ స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌తో పాటు యూనివర్సిటీలో ఫాస్టెస్ట్ పర్సన్‌గా నిలిచారు. 1995-96 ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీఈసీఈటీ)లో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. 1995-96 ఉస్మానియా యూనివర్సిటీ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ సాధించాడు. 1997లో నెల్లూరులో జరిగిన చీఫ్ మినిస్టర్స్ కప్‌లో లాంగ్ జంప్‌లో ప్రతిభ కనబరిచారు. 1997-98లో ఎంపీఈడీలో టాపర్‌గా నిలిచారు. డీఎస్సీలో జిల్లా మొదటి ర్యాంకు సాధించి వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందారు. టీపీ గూడూరు మండలంలోని ఈదూరు, ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నం, నర్సాపురం, ముదివర్తిపాలెం పాఠశాలల్లో ఆయన పని చేశారు. ప్రస్తుతం నర్సాపురం హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పలుమార్లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డులు అందుకున్నారు. ఈయన దగ్గర విద్య నేర్చుకున్న విద్యార్థులు ఉన్నత కొలువుల్లో పని చేస్తున్నారు.

- ఇందుకూరుపేట

విద్యార్థుల సేవలో తరిస్తూ..



ఉదయగిరి నుంచి తమ సొంత వాహనాల్లో విద్యార్థులను పాఠశాలకు తీసుకువస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి మండలం పుల్లాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు గాజులపల్లి సుబ్బారెడ్డి, ప్రశాంతికుమారిలు పాఠశాలలో సంఖ్యను పెంచడంతో పాటు దాతల సహాయంతో విద్యావలంటీర్‌ను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు స్టడీ అవర్స్, యోగా తరగతులు, నవోదయ ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం, చిత్రలేఖనం, వక్తృత్వ పోటీల్లో తర్ఫీదు ఇవ్వడంతోపాటు విద్యార్థులకు బహుమతులు అందజేస్తారు.

- ఉదయగిరి

రాధయ్య.. ఆంగ్ల బోధన అదుర్స్!



విద్యార్థులకు సులువైన పద్ధతిలో విద్య నేర్పుతున్న దాసరి రాధయ్య

ఆయన ఏ పాఠశాలలో పనిచేసినా అక్కడి విద్యార్థులు అనర్గళంగా ఇంగ్లీషు చదువుతారు. జాయ్‌ఫుల్ లెర్నింగ్ విధానంతో ఆయన విద్యను బోధిస్తారు. తానే స్వంతంగా తెలుగు, ఇంగ్లీషు మెటీరియల్స్ తయారు చేసి చదివిస్తున్నారు. రకరకాల బొమ్మలను ముందుంచి వాటిని తెలుగు, ఇంగ్లీషు పదాలతో పిలిపిస్తారు. దాసరి రాధయ్య 24ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన జలదంకి మండలం టీకే అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్నారు. గతంలో ఇదే మండలంలో వేములపాడులో పనిచేశారు. తాను చేసే ఉద్యోగాన్ని వృత్తిగా భావించకుండా హాబీగా మలుచుకుని పనిచేస్తున్నారు. ఇలాంటి ఉపాధ్యాయుడు దొరకడం విద్యార్థుల అదృష్టమని టీకే అగ్రహారం గ్రామస్థులు పేర్కొన్నారు.

- జలదంకి

ఇష్టంగా, అర్థమయ్యేలా..



ప్లాస్టిక్ స్టిక్స్, కాయిన్స్, చిన్న రాళ్లతో అర్థమయ్యేలా బోధిస్తున్న ఉపాధ్యాయిని సుహాసిని

లింగసముద్రం మండలం వాకమళ్లవారిపాలెం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయిని జీ.సుహాసిని విద్యార్థులకు వివిధ ఉపకరణాలతో సులభంగా అర్థమయ్యేలా బోధిస్తున్నారు. విద్యార్థులకు ప్లాస్టిక్ పుల్లలు, కాయిన్స్, చిన్న చిన్న రాళ్లు, చార్టులు, మార్బుల్స్ ఇతర ఉపకరణాలతో ఆమె విద్యాబోధన చేస్తున్నారు. అలాగే గదిలోని నేలపై చాక్‌పీస్‌తో బాక్సులు వేసి అందులో విద్యార్థులను నిలబెట్టి కూడికలు, తీసివేతలు చేయిస్తున్నారు. అలాగే చైల్డ్ సెంటర్ మెథడ్ పద్ధతి ద్వారా బోధన చేస్తున్నారు. దీంతో విద్యార్థులు కూడా ఎలాంటి బోరు ఫీలవ్వకుండా ఉత్సాహంగా చదువుతున్నారు. ఈ సందర్భంగా సుహాసిని మాట్లాడుతూ, తలిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తెలిపారు.

- లింగసముద్రం

ఎస్టీ, ఎస్సీ విద్యార్థుల అభ్యున్నతి కోసం..



యానాది కాలనీలో తల్లిదండ్రులను అవగాహన పరుస్తున్న ఉపాధ్యాయుడు కోటేశ్వరరావు

ఉలవపాడు మండలంలో 16 ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ కాలనీల్లోని ఎంపీపీ స్కూళ్లలో పనిచేస్తూ, ఆయా ప్రాంతాల్లోని తల్లిదండ్రులకు విద్య పట్ల అవగాహన కల్పిస్తున్నారు ఉపాధ్యాయుడు బత్తల కోటేశ్వరరావు. ఆయన చేరిన ప్రతీ చోటా విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచి, డ్రాప్ అవుట్స్ అనే పదం లేకుండా విధులు నిర్వహిస్తున్నారు. అంతేకాక ఆయా పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రుల చేత ఆత్మీయ సన్మానాలు పొందుతున్నారు. సాధారణ కుటుంబం నుంచి వచ్చినా కష్టపడి చదివి 1998లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తి చేపటినప్పటి నుంచి తను పని చేసిన ప్రతి పాఠశాలలో గ్రామస్థులు, తల్లిదండ్రుల, అధికారుల నుంచి ప్రత్యేక గుర్తింపు పొందిన ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారాయన. గురుపూజోత్సవం సందర్భంగా ఈనెల ఐదున మండల విద్యాశాఖ ఎంపిక చేసిన ఐదుగురు ఉత్తమ ఉపాధ్యయుల్లో ఒకరుగా బత్తల కోటేశ్వరరావు ఎంపికయ్యారు.

- ఉలవపాడు

రేపు స్పెషల్ పీజీఆర్ఎస్

ఉదయగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఆత్మకూరు ఆర్డీవో కార్యాలయంలో శనివారం స్పెషల్ పీజీఆర్ఎస్‌ను నిర్వహించనున్నట్లు తహసీల్దారు ఎల్.రామ్మోహన్ గురువారం పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు ఆర్డీవో పావని అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమాన్ని మండలంలోని గిరిజనులు సద్వినియోగం చేసుకుని తమ సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10114
వెండి కిలో ధర	రూ. 126900
వెండి ఒక గ్రాము	రూ. 129.90

న్యూస్ బాక్స్

డిపాజిట్ పథకంపై రైతులకు అవగాహన

మర్రిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర సహకార బ్యాంకు లిమిటెడ్ ఆధ్వర్యంలో గురువారం మర్రిపాడు మండలం భీమవరం సొసైటీ కార్యాలయంలో డిపాజిట్ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు సొసైటీ మేనేజర్ రామనారాయణ మాట్లాడుతూ అధికంగా డిపాజిట్లు చేసి సొసైటీలు అభివృద్ధికి దోహదపడాలని, బ్యాంకులో మొట్ట భూమికి ఎకరాకు రూ.2 లక్షలు, మాగాణికి ఎకరాకు రూ. 3 లక్షల చొప్పున రుణాలు పొందవచ్చని తెలిపారు. ప్రతీ ఖాతాదారుడు సంవత్సరానికి రూ.20 చెల్లించి భీమా పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు చిన్నారెడ్డి, ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చైర్మెన్ అరికట్ల జనార్ధన్ నాయుడు, శాఖమూరి నారాయణ, మండల టీడీపీ అధ్యక్షుడు గంగాధర్ యాదవ్, ఎలగాల వెంకటేశ్వర్లు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలల సమైక్య కార్యదర్శిగా భీమతాటి


వెంకటరమణయ్య

సంగం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు భీమతాటి వెంకటరమణయ్య జిల్లా పాఠశాలల సమైక్య సంఘం కార్యదర్శిగా ఎంపికైయ్యారు. దీంతో గురువారం ఆయనను ప్రధానోపాధ్యాయులు బుజ్జయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సీతారామపురం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేయడంతో పాటు సమయపాలన తప్పక పాటించాలని ఎంపీడీవో సాయి ప్రసాద్ తెలిపారు.గురువారం ఆయన సీతారామపురం బిట్-2 సచివాలయాన్ని తనిఖీ చేశారు.అనంతరం మాట్లాడుతూ విధుల నిర్వహణలో ఎవరు నిర్లక్ష్యం చేసినా సహించబోమని హెచ్చరించారు.పారిశుద్ధ్యం పై దృష్టి సారించాలని తెలిపారు. .ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాంనాథ్ రెడ్డి, పిడుగు రవింద్ర,జూనియర్ అసిస్టెంట్ భార్గవ్, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు కంట కన్నీరు!

- ఎంటీయూ 1010 ధాన్యానికి ధర ఏదీ..?
- పుట్టి రూ. 15 వేలకే దళారుల కొనుగోలు
- పెట్టుబడి కూడా కష్టమే...
- లబోదిబోమంటున్న అన్నదాతలు
- చోద్యం చూస్తున్న అధికారులు


దళారులకు ధాన్యం విక్రయిస్తున్న దృశ్యం

సంగం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎడకారు కింద సుమారు రెండు లక్షల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. ఎడకారు పంట దిగుబడికి వచ్చే సమయానికి సహజంగా వర్షాలు కురుస్తాయి. తెగుళ్ల కూడ ఎక్కువగానే ఉంటాయి. అయితే ఎంటీయు 1010 రకం వరి తెగుళ్లను బాగా తట్టుకుంటుంది. అంతేకాకుండా ఈ రకం వరికి తెగుళ్ల కూడ తక్కువే. ఈ సీజన్‌లో 1010 రకం వరి దిగుబడి బాగా వస్తుంది. దీంతో సన్న, చిన్నకారు రైతులు ఎక్కువగా ఎంటీయు 1010 రకం సాగుకే మొగ్గు చూపారు. అయితే ఈ రకం ధాన్యానికి ప్రభుత్వ మద్దతు ధర లేదు. దొడ్డు బియ్యం కావడంతో ప్రభుత్వం కొనుగోలు చేయదు. అయినా ఈ రకం వరి సాగుకు ఎడకారు సీజన్ అనువుగా ఉండడంతో జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల ఎకరాలకు పైగా సాగు చేశారు. అందులో సంగం మండలంలో 2112 ఎకరాల్లో రైతులు ఎంటీయు 1010 రకం సాగు చేశారు.

కోతలు ప్రారంభం

జిల్లాలో సాగు చేసిన ఎంటీయు 1010 రకం వరి కోతకు వచ్చింది. కోతలు ముమ్మరంగా సాగుతు న్నాయి. ఎకరా మూడు పుట్లకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. ఈ సీజన్‌లో మూడు పుట్లు దిగుబడి వస్తే బాగా పండినట్లే. దిగుబడి విషయంలో మాత్రం రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కౌలు రైతు కంట కన్నీరే..!

దిగుబడి బాగా వస్తుంది.. కాబట్టి సొంత భూమి కలిగిన రైతులకు పెట్టిన పెట్టుబడి వస్తుం ది. అదే కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. గిట్టుబాటు ధర లేకపోవడంతో కౌలు రైతుల కష్టానికి కన్నీరే మిగిలింది. పెట్టుబడి కూడా రాక అప్పుల పాలయ్యామని కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో ఉత్తరాదిలో వచ్చినట్లు వర్షం వస్తే ధరలు మరింత దిగజారే పరిస్థితి ఉందని ఆందోలన చెందుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వ స్పందించి ఆర్ఎస్‌కేల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ఎంటీయు 1010 రకం ధాన్యం కొనుగోలు చేయాలని అన్నదాతలు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర ఏదీ..?

ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల గురించి పట్టించుకోలేదు. ఒకవేళ ఏర్పాటు చేసినా ఈ రకం ధాన్యం కొనుగోలు చేయదు. దీంతో దళారులు కుమ్మక్కై పుట్టి రూ. 15 వేలకు అడుగుతున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 1010 రకం ధాన్యం రూ. 18 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది ఆ పరిస్థితి లేదు. దళారులు ముందుగానే కుమ్మక్కై ధరలు తగ్గించేశారు. అయినా రైతులు ధాన్యం నిల్వ చేసే పరిస్థితి లేదు. అటు ప్రభుత్వమూ కొనుగోలు చేయదు. దీంతో గత్యంతరం లేక దళారులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్న చందంగా పుట్టి రూ. 15 వేలకే విక్రయిస్తున్నారు. అంతేకాదు బస్తాకు 4 నుంచి 5 కేజీల తరుగు. దీంతో గిట్టుబాటు కావడం లేదని కౌలు రైతులు లబోదిబోమంటున్నారు.

అరకొరగా...



● ఈ రైతు పేరు ఐతా కృష్ణారెడ్డి. సంగం మండలం పడమటిపాళెం, 4 ఎకరాల రైతు. ఎడకారులో ఎంటీయు 1010 రకం వరిసాగు చేశాడు. ఇటీవల పంట కోతకురావడంతో నూర్పిడి చేసి రోడ్డు మీద ధాన్యం పోశాడు. దళారులు పుట్టి (850కేజీలు) రూ. 15,500కు అడగడంతో గత్యంతరం లేక విక్రయించాడు. ఎకరా మూడు పుట్ల లెక్కన దిగుబడి వచ్చింది. పుట్టి రూ. 15,500 లెక్కన ఎకరాకు రూ. 46,500 ఆదాయం వచ్చింది. ఎకరాకు ఖర్చులు రూ. 40 వేల వరకు ఖర్చు అయింది. ఖర్చులు పోను రూ. 5 నుంచి 6 వేలు మిగిలింది.

మూడు పుట్లు పండితేనే...

● వంగల్లు గ్రామానికి చెందిన చింతకుంట వెంకటశేషయ్య కౌలు రైతు. గ్రామంలో 5 ఎకరాలు కౌలుకు సాగు చేశాడు. ఎంటీయు 1010 రకం సాగు చేశాడు. వారం రోజుల కిందట కోత కోశాడు. ఎకరాకు మూడు పుట్లు దిగుబడి వచ్చింది. ఒక పుట్టి రైతుకు కౌలుకు పోను రెండు పుట్ల ధాన్యం మిగిలింది. పుట్టి రూ. 15 వేలకు విక్రయించాడు. రెండు పుట్లకు రూ. 30 వేలు వచ్చింది. ఖర్చు మాత్రం రూ. 35 వేల దాకా అయింది. రూ.5 వేలు నష్టం వచ్చింది. ఐదు ఎకరాలకు సుమారు రూ. 25 వేల దాకా నష్టం రావడంతో అప్పులపాలయ్యాడు. ఈ పరిస్థితి ఒకరిద్దరి రైతులదే కాదు. జిల్లాలో ఎంటీయు 1010 రకం సాగు చేసిన వందలాది మంది రైతుల పరిస్థితి ఇంతే.

ప్రత్యేక అవసరాల పిల్లల బాధ్యత తీసుకుంటా : ఎమ్మెల్యే కాకర్ల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

వింజమూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చిన్న వయసులో అంగవైకల్యం కలిగిన విద్యార్థుల బాధ్యతను తాను తీసుకుని, వారి అవసరాలు తీరుస్తానని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. వింజమూరు జడ్పీ హైస్కూల్‌లో సమగ్రశిక్ష సహిత విద్యావిభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచిత ఉపకరణ నిర్ధారణ శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని 8 మండలాల్లో ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల భవితకు తాను తోడుంటానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 352 మందికిపైగా ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు ఉన్నారని, వారిని ఈ వేదిక వద్దకు తీసుకురావడం, నిర్ధారణ పరీక్షలు చేయించడం పట్ల విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల శాఖ అధికారులతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

● తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదే

ఉదయగిరి : జన్మనిచ్చిన తల్లిదండ్రుల తరువాత స్థానం ఉపాధ్యాయులదేనని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. గురువారం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నాబార్డు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులను ఆర్‌జేడీ మువ్వా రామలింగం, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ వెంకటసుబ్బయ్యలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో సీటు కావాలంటే ప్రజాప్రతినిధులు, అధికారులు సిపార్సు చేయాల్సిన పరిస్థితి తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. పాఠశాలల ఆవరణలో మొక్కలు పెంచి పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తొలుత ఆయన జూనియర్ కళాశాలను సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో ముచ్చటించారు. కళాశాల ఇబ్బందులను ప్రిన్సిపాల్ ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం కావలి మార్గంలో గల ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీ.చెంచలబాబుయాదవ్, మన్నేటి వెంకటరెడ్డి, బయ్యన్న, గడ్డం వెంకటసామయ్య, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం


ఉదయగిరి : రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి : మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తుగా ప్రధానోపాధ్యాయుడు జే.మాధవరావు అధ్యక్షతన గురుపూజోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయులు సాయిబాబు, రోషన్‌తాజ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉపాధ్యాయ దినోత్సవం

సంగం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2-30కు ఉపాధ్యాయ దినోత్సవ సభ నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఈవో, ఎంఈవో 1 జానికీ రామయ్య గురువారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సత్కరిస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ హాజరు కావాలన్నారు.

ప్రతీ రైతుకు యూరియా అందాలి

● మండల సర్వసభ్య సమావేశంలో జడ్పీటీసీ


సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి కళారాణి

కలువాయి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో వరి సాగు చేసిన సన్న, చిన్నకారు రైతులు కొందరికి సక్రమంగా యూరియా అందలేదని జడ్పీటీసీ బి. అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ ఆర్. లక్ష్మీదేవి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వ్యవసాయశాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ వచ్చే సీజన్‌కైనా అధికారులు రైతులందరికీ యూరియా అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకరాకు 3 బస్తాలు యూరియా వాడాల్సి ఉండగా, రైతులు 6 బస్తాలు వేశారని, దీంతో యూరియా కొరత ఏర్పడిందన్నారు. వచ్చే రబీ సీజన్‌లో ప్రతీ రైతుకు సేవా కేంద్రం ద్వారా యూరియా పంపిణీకి ఇప్పటి నుంచే ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు వ్యవసాయాధికారి కళారాణి తెలిపారు. మండలంలో కొన్నేళ్లుగా ఆగిపోయిన స్త్రీనిధి రుణాలు పునరుద్ధరించేందుకు వెలుగు అధికారులు చర్యలు తీసుకోవాలని జడ్పీటీసీ కోరారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ పంగా పెంచలనరసారెడ్డి, ఎంపీడీవో భవాని, కలువాయి సొసైటీ అధ్యక్షులు గాడిపర్తి జగదల్‌నాయుడు, నీటి సంఘం ప్రతినిధి విజయకుమార్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

బోర్డు అనుమతితో నారుమడులు


నాడుమడులను పరిశీలిస్తున్న వేలం నిర్వహణాధికారి రాజశేఖర్

మర్రిపాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : బోర్డు అనుమతితో పొగాకు నారుమడులు ఏర్పాటు చేయాలని వేలం నిర్వహణాధికారి జి. రాజశేఖర్ తెలిపారు. గురువారం డీసీపల్లిలో నారుమడులను ఆయన పరిశీలించారు. 2025-26 పంట కాలానికి సంబంధించి ఏర్పాటు చేస్తున్న నారుమడులకు రైతులు గరిష్ఠంగా రెండు హెక్టార్లకు (5 ఎకరాలు) అనుమతి తీసుకోవచ్చన్నారు. ధరలతో పాటు ఏ రకం నారు అనే వివరాలతో బోర్డు ఏర్పాటు చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.

వామ్మో.. కొండచిలువ

● తహసీల్దార్ కార్యాలయంలో ప్రత్యక్షం


కార్యాలయంలోని కంప్యూటర్ గదిలో ఉన్న కొండచిలువ

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు తహసీల్దారు కార్యాలయంలోకి కొండచిలువ రావడంతో ఉద్యోగులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. రాత్రి కార్యాలయంలో ఉద్యోగులు పెండింగ్ పనులు చేసుకుంటున్నారు. ఆ సమయంలో సమీప చెట్లపొదల్లో నుంచి కొండచిలువ కార్యాలయ ప్రధాన ద్వారం నుంచి లోనికి ప్రవేశించి కంప్యూటర్ గదిలోకి వెళ్లింది. దానిని చూసిన ఉద్యోగులు భయభ్రాంతులకు గురై బయటకు పరుగులు తీశారు. అనంతరం దాన్ని చిన్నగా బయటకు పంపే ఏర్పాట్లు చేశారు. దీంతో కొద్దిసేపటి తరువాత అది సమీపంలో ఉన్న చెట్లపొదల్లోకి వెళ్లడంతో వారు ఊపిరిపీల్చుకున్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

ఉదయగిరి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): స్థానిక స్త్రీశక్తి భవనంలో లోకోస్ యాప్‌పై గురువారం సీసీలు, వీవోఏలకు ఏపీఎం శారా స్రవంతి అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలకు సంబంధించిన నగదు లావాదేవీల మొత్తం లోకోస్ యాప్ ద్వారా జరపాలన్నారు. అలాగే రుణాలకు సంబంధించిన రికవరీలను నూరుశాతం పూర్తి చేయడంతో లక్ష్యాలను అధిగమించాలన్నారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య

సంగం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు గ్రామం ఎస్టీ కాలనీకి చెందిన దుర్గయ్య (25) అనే యువకుడు పురుగుల మందు తాగి గురువారం మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గయ్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు సేవించాడు. కుటుంబ సభ్యులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందా డు. మృతుడికి వివాహం కాలేదు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అర్హులకు భూపంపిణీ చేయాలి

దుత్తలూరు(ఉదయగిరి), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): అర్హులకు భూపంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి పుల్లయ్య, కౌలు రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు గంటా లక్ష్మీపతి కోరారు. గురువారం దుత్తలూరులో మండల అధ్యక్షుడు నేలటూరి సింహాద్రి అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘ 4వ మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ మండలంలో 300 ఎకరాల భూములు పెత్తందారుల చేతుల్లో ఉన్నాయన్నారు. భూమి, ఇంటి నివేశన స్థలాలు లేని పేదలు మండలంలో ఎంతోమంది ఉన్నారని, వాటిని అర్హులైన వారికి అందజేయాలని డిమాండ్ చేశారు. మండలంలోని చింతలకుంట, నందిపాడు గ్రామాల్లో వందల ఎకరాల భూములు అక్రమణల ఉన్నాయన్నారు. అనంతరం 13 మందితో కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు గుజ్జుల మల్లికార్జున, మద్దులూరి లీల, నల్లబోతుల సుప్రజ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): విధుల్లో నిర్లక్ష్యం వహించినా.. సమయపాలన పాటించకపోయినా.. ప్రజల నుంచి ఫిర్యాదులొచ్చినా, కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో అప్పాజీ సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం పట్టణంలోని సచివాలయం-2ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించి, సిబ్బందిని వివరాలు తెలుసుకున్నారు. మీ సచివాలయంపై ఫిర్యాదులు వస్తున్నాయని, ఇకపై వస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

చూసుకోండి.. మీదైతే తీసుకెళ్లండి !


స్మార్ట్ రైస్ కార్డు కోసం వెతుకుతున్న లబ్ధిదారులు

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. గత నెల 25న ప్రభుత్వం కార్డుల పంపిణీని ప్రారంభించింది. నెలచివరి వరకు సచివాలయ సిబ్బంది ఇంటింటికి తిరిగి పంపిణీ చేయాలని సూచించింది. సెప్టెంబరు 1 నుంచి 15 వరకు డీలర్లు పంపిణీ చేయాలని ఆదేశించింది. అయితే డీలర్లు అందుకు ససేమిరా అనడంతో ప్రభుత్వం మళ్లీ వాటి పంపిణీని సచివాలయ సిబ్బందికి అప్పగించింది. అయితే ప్రస్తుతం వారు సర్వేలో నిమగ్నమై ఉండడంతో అవి డీలర్ల వద్దే ఉండిపోయాయి. కాగా ఉదయగిరిలో గురువారం ఓ చౌక దుకాణం ఎదురుగా ఉన్న టేబుల్‌పై స్మార్ట్‌రైస్ కార్డులను వరుసక్రమంలో ఏర్పాటు చేసి అక్కడికి వచ్చిన, దారిన వెళ్లే లబ్ధిదారులతో అక్కడ రైస్‌కార్డులు ఉన్నాయి. పరిశీలించి మీదైతే తీసుకెళ్లడంటూ సూచించారు. జిల్లాలోని అన్నీ మండలాల్లో స్మార్ట్‌రైస్ కార్డుల పంపిణీ ఇలాగే కొనసాగుతోందని పలువురు అంటున్నారు.

- ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి)

నెల్లూరుకు రింగ్‌రోడ్డు

డీపీఆర్ సిద్ధం చేయిస్తున్నాం

నుడా చైర్మన్ కోటంరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 4(ఆంధ్ర జ్యోతి): నెల్లూరు నగరానికి నుడా ఆధ్వర్యంలో రింగ్ రోడ్డు ఏర్పాటుకు కృషి చేస్తున్నామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తెలిపారు. నుడా కార్యాలయంలో సీకాన్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సభ్యులతో అయన గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో తాను నుడా చైర్మన్‌గా ఉన్నప్పుడు రింగ్‌రోడ్డుకు డీపీఆర్‌ని సిద్ధం చేశామని చెప్పారు. అయితే వైసీపీ ప్రభుత్వం దానిని గాలికి వదిలేసిందన్నారు. మళ్లీ కూటమి ప్రభుత్వం రావడంతో మరోసారి డీపీఆర్ సిద్ధం చేయిస్తున్నామని తెలిపారు. ఈ బాధ్యతలు సీకాన్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అప్పగించామని చెప్పారు. వారి రిపోర్ట్‌పై మున్సిపల్ మంత్రి నారాయణతో సమగ్రంగా చర్చిస్తా మని కోటంరెడ్డి వెల్లడించారు. మంత్రి నారాయణ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సహకారంతో రింగ్ రోడ్డు ఏర్పాటుకు అన్నివిధాలుగా కృషి చేస్తున్నామన్నారు. ఇది ఏర్పాటైతే నగర రూపురేఖలు మారుతాయన్నారు. సమావేశంలో నుడా అధికారులు పాల్గొన్నారు.

అంకిత భావంతో ప్రజలకు సేవలందించాలి

● తహసీల్దార్లతో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు


సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రెవెన్యూశాఖలో కీలకమైన తహసీల్దార్లు అంకితభావంతో, నిష్పక్ష పాతంగా ప్రజలకు సేవలందించాలని ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు కోరారు. గురువారం నెల్లూరు క్లబ్ సమావేశ మందిరంలో జిల్లాలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూసమస్యల పరిష్కారం కోసం, ఆదాయ, కుల, నివాస ధ్రువీ కరణ పత్రాలు, రేషన్‌కార్డులు, ఇతర రెవెన్యూ సంబంధ అంశాల పరిష్కారం కోసం ప్రజలు తహసీల్దారు కార్యాలయాలకు ఎక్కు వగా వస్తుంటారన్నారు. వారి సమస్యలను ఓపిగ్గా విని పరిష్క రించాలని సూచించారు. తహసీల్దార్లకు పనివత్తిడి పెరిగిందని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటి కప్పుడు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఏపీఆర్ఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకట రాజేష్, జిల్లా నాయకుడు బొబ్బా మురళి తదితరులు పాల్గొన్నారు. సమావేశానికి ముందు కలెక్టర్ ఆనంద్‌ను, కలెక్టరేట్‌లో బొప్పరాజు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు.

నలుగురు ఏవోలకు ఉద్యోగోన్నతి

నెల్లూరు(జడ్పీ), సెప్టెంబరు 4 (ఆం ధ్రజ్యోతి): జిల్లాపరిషత్ పరిధిలో విధు లు నిర్వర్తిస్తున్న నలుగురు ఏవోలకు ఎంపీడీవోలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. సంగం మండల ప్రజా పరిషత్‌లో ఏవోగా పని చేస్తున్న శైలజ, జడ్పీ కార్యాలయ ఏవో వాసుదేవ రావు, దుత్తలూరు మండల ఏవోగా వెంక టేశ్వర్లు, అల్లూరు మండల ఏవో పీ వెంకటేశ్వరరావుకు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పించారు. వీరిలో శైలజను నెల్లూరు జిల్లాకి కేటాయించగా వాసుదేవరావుని తిరుపతి జిల్లా, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర రావుని చిత్తూరు జిల్లాకు కేటాయించారు.

ఎన్‌డీసీఎంఎస్ బలోపేతానికి కృషి

● చైర్మన్ నాగేశ్వరరావు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ నాగేశ్వరావు

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(ఎన్‌డీసీ ఎంఎస్) లిమిటెడ్ బలోపేతానికి కృషి చేస్తానని ఆ సొసైటీ చైర్మన్ జీ నాగేశ్వర రావు తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులోని సంస్థ కార్యాలయంలో అధికారులు, అద్దెకున్న షాపుల వారితో సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు పట్టణంలో ఎన్‌డీసీ ఎంఎస్ షాపులకు అద్దె చాలా తక్కువగా ఉందని, అక్కడ అద్దె పెంపునకు చర్యలు తీసుకుంటా మని చెప్పారు. నెల్లూరులోని రైస్‌మిల్లు స్థలంలో ప్రభుత్వ అను మతితో సంస్థకు ఆదాయం సమకూరే కట్టడాలు కడతామని చెప్పా రు. ఆ కార్యక్రమంలో బీఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

బలిజ వివాహ పరిచయ వేదిక
నెల్లూరు టౌన్ హాల్ (రీడింగ్ రూమ్‌లో) 07-09-2025 ఆదివారం సాయంత్రం 4 గం. నుండి 7 గం. వరకు మధ్యవర్తులు, కమీషన్ లేకుండా బలిజ వివాహ పరిచయ వేదిక జరుగును. వెబ్సైటు సర్వీసు ఛార్జి 500/-. సం.ప్ర. సెల్: 93983 14847
AJR-240519

ప్లాట్లు అమ్మబడును
ఇస్కాన్‌సిటీలో ప్లాట్లు, నెల్లూరు నగరం, చుట్టు ప్రక్కల పొలములు, ఇండ్లు, స్థలములు, అపార్ట్‌మెంట్స్, ఫామ్ హౌస్‌లు తక్కువ ధరకే అమ్మకమునకు కలవు. సంప్ర. సెల్: 98664 35396
AJR-240520

తమిళనాడు, ఆంధ్రా యాత్రలు
తేది.12-09-25 తమిళనాడు-తిరువన్నామలై తేది. 19-09-25 ఆంధ్రా-కుండలేశ్వరం 2రో టికె 3600/- (A/c బస్సు రూం+ భోజనం). కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240642

అమ్మబడును
■ నెల్లూరు జిల్లా, కందుకూరు పట్టణం, కోటారెడ్డినగర్ పరిధిలో ఇంటి స్థలం గది 25,000/-కు అమ్మబడును. రామాయపట్నం పోర్టు దగ్గరలో పొలాలు అమ్మబడును. సంప్ర౹ సెల్ : 7032178599
AJO-240972

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	204
స్కిన్‌లెస్	226

కోడిగుడ్ల ధర (100): 570

ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా రాంబాబు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఏపీ ఎడ్యుకేషన్, వెల్ఫేర్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కందుకూరుకు చెందిన పోకూరి రాంబాబు నియమితులయ్యారు. టీడీపీలో గత కొన్నేళ్లుగా క్రియాశీలంగా పనిచేస్తున్న రాంబాబు పార్టీ నెల్లూరు పార్లమెంటు యూత్ ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన్ను పలువురు పార్టీ నాయకులు, శ్రేయోభిలాషులు అభినందించారు.



సేవాతత్పరులు యేటూరి



యేటూరి రామిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సామాజిక కార్యకర్తలు

కావలి(టౌన్), సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): యేటూరి రామిరెడ్డి సేవాతత్పరులని సామాజిక కార్యకర్తలు కొనియాడారు. గురువారం పట్టణంలోని చేవూరుతోటలో గల యేటూరి కల్యాణ మండపంలో రామిరెడ్డి సంస్మరణ సభ జరిగింది. రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు సిద్ధాంతి కృష్ణారెడ్డి ఆధ్యక్షతన జరిగిన సభలో పట్టణ ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పాల్గొని రామిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ రామిరెడ్డి ట్రస్ట్ స్థాపించి సొంత నిధులతో వృద్ధాశ్రమం నెలకొల్పి, నిరాదణ వృద్ధులను అక్కున చేర్చుకున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో రోటరీ గవర్నర్ రొటేరియన్ మాధవరెడ్డి, కార్యదర్శి రమేష్, సభ్యులు ఓరుగంటి వెంకటేశ్వర్లు, కేశవరెడ్డి, సామాజిక సేవా కార్యకర్త లు జెన్నీష్, మాలకొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

9న టీఆర్‌ఆర్‌లో అతిథి అధ్యాపకులకు ఇంటర్వ్యూలు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులు(గెస్ట్ ఫ్యాకల్టీ) నియామకం కోసం ఈనెల 9న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టరు ఎం. రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, పొలిటికల్ సైన్స్, తెలుగు విభాగాలలో పనిచేసేందుకు గెస్ట్ ఫ్యాకల్టీని నియమిస్తున్నట్లు తెలిపారు. ఆయా సబ్జెక్టుల్లో కనీసం 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులైతే 50శాతం మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలని తెలిపారు. నెట్, స్లెట్,సెట్, పీహెచ్‌డీ, బోధనానుభవం లాంటి అదనపు అర్హతలు ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తులు అందజేయాలని, ఇంటర్వ్యూకి ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాల్సి ఉంటుందని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో అలంకారప్రాయంగా కుళాయిలు



రైల్వేస్టేషన్‌లో మంచినీరు రాని కుళాయిలు

కావలి,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసి ఉన్న మంచి నీటికుళాయిలు అలంకారప్రాయంగా కనిపిస్తున్నాయి. ఆ కుళాయిల్లో సక్రమంగా నీరు రాక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి ప్లాట్‌ఫారం మీద మంచి నీటి కుళాయిలు మాత్రం ఏర్పాటు చేశారు. అయితే వాటిల్లో ఎప్పుడు నీరు వస్తాయో ఎప్పుడు రావో అర్థం కావటంలేదని ప్రయాణికులు వాపోతున్నారు. ప్లాట్‌ఫారంపై రైలు ఆగగానే ప్రయాణికులు వారి వారి బోగీలకు అందుబాటులో ఉన్న కుళాయిల వద్దకు నీరు పట్టుకునేందుకు పరుగులు తీయగా, తీరా కుళాయి తిప్పితే నీరు రాక పోవటంతో ఉసూరు మంటూ వెనుతిరిగి తమ రైలు బోగీలను ఎక్కుతున్నారు. గతంలో రైల్వే అధికారులు స్టేషన్‌లోకి రైళ్లు వచ్చి ఆగినపుడే ఆ కుళాయిలలో నీరు వచ్చేట్లు ఏర్పాటు చేశారు. అయితే ఇప్పుడు రైళ్లు ఆగినపుడు కూడా కొన్ని సందర్భాలలో కుళాయిల్లో నీరు రావటంలేదు. రైల్వే అధికారులు స్పందించి కుళాయిల్లో నీరు వచ్చేట్లుగా ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పందుల స్వైర విహారం



లింగసముద్రం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పంచాయతీలోని జంపాలవారిపాలెం ఎస్సీ కాలనీ వద్ద పందులు స్వైర విహారం చేస్తున్నాయి.కాలనీకి ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కనే ఉన్న వ్యర్థ పదార్థాలను తినేందుకు పందులు గుంపులుగా వస్తున్నాయి.దీంతో దోమలు విజృంభిస్తున్నాయి.చెత్తా చెదారంతో నిండి ఉన్న ఈ ప్రాంతం దోమలకు ఆవాసంగా మారుతోంది.సాయంత్రం అయ్యిందంటే దోమలు కుదుతున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు.

నాసిరకంగా హైవే పనులు

● నిర్మాణం పూర్తికాకనే కుంగిన కాలువ శ్లాబు ● వాహనాల రాకపోకలకు ఇబ్బంది

కావలి,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల ధన దాహమో... లేక అధికారుల పర్యవేక్షణలోపమో.. హైవే పనుల్లో కూడా నాణ్యతా, ప్రమాణాలు లోపించాయి. జాతీయ రహదారి పనులు అంటే ఎంతో నాణ్యతగా, పటిష్ఠంగా ఉంటాయని ప్రజల నమ్మకం.అయితే కావలి- ముద్దూరుపాడు మధ జరుగుతున్న హైవే పనుల్లో నాణ్యత లోపాలు కనిపిస్తున్నాయి. ఒక పక్క నిర్మాణాలు జరుగుతుండగానే మరోపక్క ముందుగా నిర్మించిన నిర్మాణాలకు కాలం చెల్లుతోంది.పట్టణ ఉత్తర శివార్లలో పెట్రోల్ బంకు దాటాక నిర్మించిన డ్రైనేజీ కాలువపై వేసిన శ్లాబు అప్పుడే కుంగిపోయింది. రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మిస్తూ వాటిపై శ్లాబులు వేసుకుంటూ రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు. అయితే ఆరోడ్డుకు ఇరువైపులా ఉన్న పొలాల్లో కొన్ని చోట్ల వ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేసుకున్నారు. ఆ దుకాణాల వద్దకు రాకపోకలు సాగించేందుకు కాలువపై వేసిన శ్లాబు మీదుగా వెళ్లాల్సి ఉంది. అయితే ఆ శ్లాబు నాసిరకంగా నిర్మిస్తుండటంతో పూర్తిగా అడుగుకల్లా కుంగి పోయింది.దీంతో రాకపోకలు సాగించాలంటే అ శ్లాబు ఎక్కడ కూలుతుందోనని వాహనచోదకులు భయపడుతున్నారు. ఇకనైనా హైవే అధికారులు నాణ్యతా ప్రమాణాలపై దృష్టి పెట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



కావలి-ముద్దూరుపాడు హైవే పనుల్లో కుంగిన కాలువపై వేసిన శ్లాబు

కష్టపడి చదివి ఉన్నతస్థాయికి రావాలి

వాడవాడలా ముందస్తు గురుపూజోత్సవం



లింగసముంద్రం : వెంగళాపురం ప్రాథమిక పాఠశాలలో ఎంఈవో-1 మాల్యాద్రిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



గుడ్లూరు హైస్కూల్‌లో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహిస్తున్న పాఠశాల సిబ్బంది



కొండాపురం : ఉపాధ్యాయుడు మహేష్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్థులు

లింగసముద్రం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎంఈవో-1, 2 కే. మాల్యాద్రి, ఎంవీ శివకుమార్ చెప్పారు.గురువారం మండలంలోని వెంగళాపురం ప్రాథమిక పాఠశాలలో ముందుగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంఈవోలను కాంప్లెక్స్ ఛైర్మెన్ యూ. మాధవరావు, హెచ్‌ఎం జీ. ఎస్తేరు, ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంఎసీ ఛైర్మన్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే లింగసముద్రం ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు ఎంఎస్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈవోలు మాల్యాద్రి, శివకుమార్, హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఐఈఆర్‌పీ రాజులను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం. సుధాకర్, ఇన్నాసమ్మ, సుజాత, షాహిద్దీన్, ఐఈఆర్‌పీ సుప్రియ, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్లూరు : గురువుల పట్ల విద్యార్థులు గౌరవంగా, మక్కువతో మెలగాలని గుడ్లూరు జడ్పీ హెచ్‌ఎస్ హెచ్‌ఎం పీవీ. రామ్‌మోహన్‌రావు అన్నారు. గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాలలో నిర్వహించారు. తొలుత సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటాని పూలమాలువేసి నివాళులు అర్పించారు. అనంతరం విశ్రాంతి ఉపాధ్యాయులు గొరైపాటి వెంకటేశ్వర్లు, విద్యార్థులకు 200 భోజనం ప్లేట్లను అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వల్లెపు మురళి, రామాల రవీంద్రరెడ్డి, పీడీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



బిట్రగుంట : సీనియర్ ఉపాధ్యాయులు వీరావలిని సన్మానిస్తున్న ఆర్ఎస్ఆర్ ప్రిన్సిపాల్

కొండాపురం : మండలంలోని కొమ్మి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో 2023 జూన్ నుంచి 2025 జూన్ వరకు ప్రదానోపాధ్యాయుడిగా పనిచేసిన దేగ మహేష్‌ను ఉపాధ్యాయులు, గ్రామస్థులు గురువారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో చేరిన సమయంలో 8 మందిగా ఉన్న విద్యార్థుల సంఖ్యను 50 మందికి పెంచడం, ఆదర్శ పాఠశాలగా మార్చడంలో మహేష్ కీలక పాత్ర పోషించాడని గ్రామస్థులు తెలిపారు. పాఠశాల నుంచి వెళ్లినప్పటికీ చేసిన సేవలను గుర్తించి హెచ్‌ఎం. మాధవి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

బిట్రగుంట : బోగోలు మండలం కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీఎన్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం టీచర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా గుడ్లూరు మండలం ఆవులవారిపాలెం ఎంపీపీ స్కూల్లో సీనియర్ ఉపాధ్యాయులు షేక్.వీరావలిని శాలువలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ కే.రాజారెడ్డి, ఏవో ఆర్వీ రమణారెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాగా ఎస్వీపాలెం పంచాయతీకి చెందిన అన్నంగి బలరామయ్య త్రేతాయుగ్ ఫౌండేషన్ న్యూఢిల్లీ వారు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకోవడం హర్షనీయమని స్వచ్ఛంద సేవాసంస్థ డైరెక్టర్ డాక్టర్ సింహాద్రి రావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

మురుగు కాలువలకు మోక్షం లేదా!?

● ముక్కులు మూసుకుని అడుగులు వేయాల్సిందే ● పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



బోగోలు యాదవపాలెం కూడలిలో రోడ్డుపై నిలిచిన మురుగు నీరు



ఇబ్రహీంపేట మసీదు వీధిలో మురుగు కాలువ దుస్థితి

బిట్రగుంట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో మేజర్ పంచాయతీలుగా ఉన్న బోగోలు, విశ్వనాథరావుపేటలో దాదాపు పాతికేళ్లకు ముందు నిర్మించిన ప్రధాన కాలువలు శిథిలావస్థకు చేరాయి. దీంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. బోగోలు పంచాయతీ యాదవపాలెం నాలుగు రోడ్ల కూడలిలో నడవాలంటే ముక్కులు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొని ఉంది. రైల్వే ఎల్సీగేట్ 143 నుంచి పోలేరమ్మ గుడి, హరిజనవాడ మీదుగా మిట్టకాలువలో కలిసే ప్రధాన కాలువ దె బ్బతిని ఏళ్ల గడుస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యారు. కొద్దిపాటి వర్షం పడినా ఈ కాలువలో ని నిల్వ ఉన్న మురికినీరు రోడ్లపపై ప్రవహిస్తాయి. సాధారణంగానే కా లువ మురికినీటి దుర్వాసన వెదజల్లు తుండటంతో స్థానికులు పంచాయతీ అధికారులకు ఎన్నో సార్లు ఫిర్యాదు చేసి పట్టించుకోలేదని అంటున్నారు. గతంలో వేసిన అంతర్గత రోడ్లు కుంగిపోయి లోతైన గోతులు ఏర్పడి వర్షపు నీరు నిల్వ ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, వివిధ పార్టీల అధ్యక్షులు నివసిస్తున్నా కాలువ సమస్యను ఎవరూ పట్టించుకోవటం లేదని స్థానికుల ఆవేదన. విశ్వనాథరావుపేట పేరుకు పెద్ద పంచాయతీ అయినా ఆదాయ వనరుల విషయంలో పూర్తిగా వెనుకపడి ఉంది. ఇబ్రహీంపేట మసీదు వీధి ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుకుని ఉన్నా ప్రధాన కాలువ పూర్తిగా దెబ్బతిని మురికి నీరు నిల్వ ఉంటున్నాయి. కాలువ ప్రాంతంలో ఎక్కువ మంది ముస్లింలు నివసిస్తుంటారు. నిత్యం అధికారులు తిరుగుతున్నా శిథిలమైన కాలువను పట్టించుకోరు. కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఒకసారి కన్నెత్తి మేజర్ పంచాయతీల దుస్థితి చూస్తే తమ గ్రామం బాగుపడుతుందని స్థానికులు కోరుకుంటున్నారు.

వృత్తి ధర్మం సార్థకం చేస్తూ..

నేడు ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కథనాలు



ఈ లెక్కల మాష్టారు అంటే పిల్లలకెంతో ఇష్టం. తన విద్యార్థులు ఉన్నత పౌరులుగా ఎదగాలి, వారి ఎదుగుదల ద్వారానే ఉపాధ్యాయుడి వృత్తిధర్మం సార్థకమవుతుందని మనసావాచా నమ్మి పనిచేశారు ఎండ్లూరి మహల్యారావు. ఆయన ఎక్కడ పనిచేసినా బదిలీ అయి వెళ్లే సమయంలో ఆయా గ్రామాల ప్రజలు బరువెక్కిన హృదయాలతో కన్నీటితో వీడ్కోలు పలికారంటే ఆయన ఎంత అంకితభావంతో తన బాధ్యతలు నిర్వర్తించాడో చెప్పనవసరం లేదు. కందుకూరు జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలోను అదే అంకితభావం అవే ఆదరాభిమానాలు మహల్యారావు పొందుతుండటం విశేషం. లెక్కలు మాష్టారు అయిన మహల్యారావు క్రమం తప్పకుండా క్లాసులు చెప్పటం, అవసరమైతే అదనపు క్లాసులు చెప్పటంతో పాటు సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించటం, పదవతరగతి విద్యార్థులకైతే ఆదివారాలు కూడా స్టడీ అవర్స్, స్పెషల్ క్లాసులు నిర్వహించటం ద్వారా తన సబ్జెక్టులో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా అంకితభావంతో పనిచేసి అందరికీ ఇష్టుడిగా మారారు.

- కందుకూరు

కొమ్మి పాఠశాలకు పూర్వవైభవం



కొండాపురం మండలంలోని కొమ్మి గ్రామ ప్రాథమిక పాఠశాలలో చదివిన వారంతా దేశ, విదేశాల్లో ఉద్యోగులుగా పని చేస్తు న్నారు. స్వాతంత్ర్యం రాక ముందు నుంచే ఏర్పాటు చేసిన ఈ ప్రాథమిక పాఠశాల ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దింది. గత ప్రభుత్వంలో జరిగిన పాఠశాలల విలీనంలో భాగంగా 3,4,5 తరగతులను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేసింది. 1, 2 తరగతులకు 8 మంది విద్యార్థులు మాత్రమే మిగిలారు. దీంతో పాఠశాల వైభవం కోల్పోయింది. 2023 మేనెలలో బదిలీపై పాఠశాలకు వచ్చిన ఏకోపాధ్యాయుడిగా డేగ మహేష్ అదే విద్యాసంవత్సరంలో ఒకటవ తరగతిలో 13 మంది విద్యార్థులను నమోదు చేయించారు. దీంతో పాఠశాలలో 21 మంది విద్యార్థులయ్యారు. సంఖ్య పెరగడంతో విద్యాశాఖ రెండో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేసింది. ఇద్దరు ఉపాధ్యాయులు స్థానికులు కావడంతో విద్యార్థులకు అవసరమయిన ఉపకరణలను అందచేసేందుకు దాతల సహాయం తీసుకున్నారు. పూర్వ విద్యార్థులు, విశ్రాంత ఉపాధ్యాయుడు హజరత్తయ్య, చెరుకూరు శ్రీకాంత్, బొబ్బ కొండపనాయుడు, గ్రామస్థుల సహకారంతో రేకులషెడ్డు, మినీ పార్కు, కంప్యూటర్ తదితర వస్తువులను అందచేశారు.

- కొండాపురం

వైభవంగా వినాయక గ్రామోత్సవం



కావలి టౌన్ : గ్రామోత్సవానికి ముందు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కావలి(టౌన్), సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి) : కలుగోళశాంభవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గణేశ్ నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. గ్రామోత్సవానికి ముందు నిర్వహించిన వేలంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు అల్లుడు సాయి రూ.5,60,000కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. ముందుగ భారీ గణనాథుడిని వాహనంపై ఉంచి అందంగా పూలంకరణ చేశారు. విద్యుత్ దీపాలంకరణ, బ్యాండ్ మేళాలు, 108మంది చిన్నారి జ్యోతులు, డీజే సౌండ్ సిస్టమ్, డప్పులు, మంగళ వాయిద్యాలతో అర్చక బృందం సాయంత్రం 7గంటలకు గ్రామోత్సవం ప్రారంభించారు. గ్రామోత్సవానికి భక్తులు బ్రహ్మరథం పట్టారు. ట్రంకురోడ్డు మీదుగా కొనసాగిన గ్రామోత్సవం రాత్రి 11గంటలకు మందాటి చెరువులో నిమజ్జనోత్సవం జరిగింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న గణేశ్ ఊరేగింపు

కావలి,సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): స్థానిక వైకుంఠపురం మున్సిపల్ స్కూల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహ ఊరేగింపు గురువారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతిష్ఠించిన విగ్రహాలను ట్రాక్టర్‌కానీ , మినీ లారీ కానీ, ఆటోలోకానీ ఎక్కించుకుని నిమజ్జనానికి తీసుకెళ్లతారు. అయితే వైకుంఠపురం స్కూల్ విగ్రహం అడుగు భాగాన నాలుగు చక్రాలతో చట్రం ఏర్పాటు చేసి, తాళ్లు కట్టి రథాన్ని లాగుతున్నట్లు లాగి నిమజ్జనానికి తీసుకెళ్లారు.



కావలి : వినాయక విగ్రహ ఊరేగింపును రథంలా లాగుతున్న భక్తులు

నేత్రదానం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు

అల్లూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం చేసి అంధులకు చూపును ప్రసాదించాలని అల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తెలిపారు. 40వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో కంటి వైద్యురాలు ఎం.శర్వాణితో కలసి ఆయన స్థానికులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి నేత్రాలను దానం చేస్తే ఇద్దరు వ్యక్తులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు ఆమని, కిరణ్మయి, అమృద సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీలో గందరగోళం

● జాప్యంపై స్థానికుల ఆవేదన



స్మార్ట్ రైస్ కార్డుల కోసం తహసీల్దారు కార్యాలయం వద్ద గుమిగూడిన ప్రజలు

కలిగిరి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ గందరగోళంగా మారింది. దీంతో పట్టణవాసులు కార్డుల కోసం రేషన్ దుకాణాలవద్ద, తహసీల్దారు కార్యాలయం వద్ద గురువారం బారులు తీరడం కనిపించింది. ఇంటింటికి తిరిగి కార్డులను పంపిణీ చేయడంలో జాప్యం జరగడంతో కార్డుదారులు వారం రోజులుగా కార్యాలయాల చుట్టూరా తిరగాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంపిణీ చేసే అధికారులు ఇటీవల బదిలీపై మండలానికి రావడం, స్థానిక నేతల సహకారం లభించకపోవడం, ఒకటి, రెండు తేదీల్లో పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడంతో కార్డుల పంపిణీలో తీవ్ర జాప్యం జరిగిందని పేర్కొంటున్నారు. కార్డుల పంపిణీ వేగవంతం చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఉద్యోగాలకు 'ప్రకాశం' విద్యార్థుల ఎంపిక




ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

కందుకూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూణెకు చెందిన ప్రముఖసంస్థ రాంచ్ పాలీమర్స్ గురువారం ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 45మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకుంది. టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ ఇంటర్వ్యూతో ఎంపికలు నిర్వహించగా ఈఈఈ, మెకానికల్ విభాగాలకు చెందిన 55మంది హాజరయ్యారు. వారిలో 45మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసుకున్నారని కరస్పాండెంట్ కంచర్ల విజయ్‌శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్లు విక్రమ్, సాహిత్య, అకడమిక్ ఇన్‌చార్జి మీరావలి, సుమలత, భరద్వాజ్ పాల్గొన్నారు.

అత్యాచాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కావలి రూరల్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రకోట ఎస్టీ కాలనీలో మైనర్ బాలికపై అత్యాచార యత్నం చేసిన నిందితుడు పాలకీర్తి బ్రహ్మయ్యను గురువారం అరెస్ట్ చేశారు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేయడంతోపాటు పరారీలో ఉన్న నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3


తిరుపతి
జిల్లా వార్తలు
శుక్రవారం 5 సెప్టెంబరు 2025

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

జిల్లాలో 20 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు రాష్ట్రస్థాయి పురస్కారాలకు ఎంపికయ్యారు. బోధన, పరిశోధన రంగాల్లో వీరు చేసిన కృషికి గుర్తింపుగా ఈ గౌరవం దక్కింది. శుక్రవారం అమరావతిలో జరగనున్న గురుపూజోత్సవంలో వీరు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా పురస్కారాలు అందుకోనున్నారు. - శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

20 మందికి రాష్ట్రస్థాయి 'ఉత్తమ' ఉపాధ్యాయ అవార్డులు

విద్యావిధానంపై పరిశోధన



పొన్నంరెడ్డి కుమారి నీరజ.. శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలు. విద్యావిధానంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పలు పరిశోధనలు చేశారు. విద్యార్థులకు అర్థవంతమైన బోధనతో పాటు పరిశోధనలపై ఆసక్తి కల్పిస్తున్నారామె.

క్రమశిక్షణాపథం



గంగారామ్.. శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో స్టాటిస్టిక్స్ లెక్చరర్. తన బోధనతో విద్యార్థులను ప్రభావితం చూస్తూ ఉత్తమ పథంలో నడిపిస్తున్నారు. ఆర్థిక, వ్యక్తిగత క్రమశిక్షణను నేర్పిస్తున్నారు.

ఆయన ఓ ఇన్‌స్పైర్



సుబ్రహ్మణ్యం శర్మ.. శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ టీచరు. బోధనతో పాటు ప్రయోగాలు చేయిస్తూ విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్ర, జాతీయస్థాయి ఇన్‌స్పైర్, సైన్స్ ప్రదర్శనల విషయంలో చొరవ చూపి విద్యార్థులను తీసుకెళ్లారు.

క్రీడాసక్తికి పునాది



రామకృష్ణ.. శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి ప్రభుత్వ పాఠశాలలో పీడీ. స్వస్థలం అనకాపల్లి జిల్లా నాతవరం. పుష్కరకాలంగా అమ్మ ఎడ్యుకేషన్‌ఫౌండేషన్ సంస్థ ద్వారా ఎందరో విద్యార్థులకు సొంత నిధులు వెచ్చించి క్రీడలపై ఆసక్తి పెంచారు. పేద విద్యార్థులను రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. అత్యవసరమైతే విద్యార్థులకు ఆర్థిక సాయం చేస్తున్నారు.

ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎస్వీ కుమార్




పుత్తూరు, ఆంధ్రజ్యోతి: పుత్తూరు మండలం పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు చెందిన ఎస్వీ కుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపాల్‌గా ఎంపికయ్యారు. 1992లో లెక్చరర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన ఈయన తాను పనిచేసిన కళాశాలల్లో పలు కంపెనీలతో మాట్లాడి జాబ్ మేళాలను నిర్వహించారు.

అర్థమయ్యే రీతిలో బోధన



చంద్రగిరి, ఆంధ్రజ్యోతి: చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడు చీర్ల వెంకటరమణ రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. అర్థమయ్యే రీతిలో బోధించడంలో ఈయన గుర్తింపు పొందారు.

సులభ బోధనకు పెట్టింది పేరు



బాలసుబ్రహ్మణ్యం.. తొట్టంబేడు మండలం సాంబయ్యపాళెం ప్రభుత్వ పాఠశాలలో టీచరు. తెలుగులో పలు రచనలు సాగించడంతో పాటు మిమిక్రీ ఆర్టిస్టుగా గుర్తింపు పొందారు. అట్టముక్కలు, వివిధ సులభమైన మార్గాల ద్వారా పిల్లలకు విద్యాబోధన చేస్తూ మేధస్సుకు పదును పెడుతుంటారు. ఆయన రచించిన సీతాకోకచిలు పద్యాన్ని మహారాష్ట్ర ప్రభుత్వం ఒకటో తరగతి తెలుగు పుస్తకంలో పాఠ్యాంశంగా ప్రచురించింది.

తిరుపతిలో నేడు గురుపూజోత్సవం

● 68 మందికి జిల్లా ఉత్తమ పురస్కారాల ప్రదానం

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని కచ్చపి స్టేడియంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు గురుపూజోత్సవం ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన 62 మందికి.. ఆరుగురు ఎంఈవోలకు పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ తోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కమిషనర్ తదితర అధికారులు, రాజకీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు.



టి.రమాశ్రీ - ఎం.బాలాజీ - పి.అఖిల స్వతంత్ర - టి.విజయ



వి.సుబ్బారావు - టి.చంద్రశేఖరయ్య - రమ్యాకుబేర్ - ఎం.అరుణ



పి.జ్యోత్స్న - వైఎస్ శారద - వెంకటకృష్ణ - సి.భువనేశ్వరిదేవి

13 మంది వర్సిటీ అధ్యాపకులకూ..



డి.సుబ్రమణ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి):బోధన, పరిశోధన, విస్తరణ, సేవ తదితర రంగాల్లో కృషికి గుర్తింపుగా తిరుపతిలోని యూనివర్సిటీలు, కాలేజీల్లో 13 మంది ఉత్తమ అధ్యాపకులుగా ఎంపికయ్యారు.

ఎస్వీ యూనివర్సిటీ: ప్రొఫెసర్లు టి.రమాశ్రీ (ఈసీఈ), ఎం.బాలాజీ (బయోకెమిస్ట్రీ), అఖిల స్వతంత్ర (మెకానికల్ ఇంజినీరింగ్), టి.విజయ (బోటనీ), టి.చంద్రశేఖరయ్య (పాపులేషన్ స్టడీస్), డి.సుబ్బారావు (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)

పద్మావతి యూనివర్సిటీ: ప్రొఫెసర్లు వైఎస్ శారద (ఇంగ్లీషు), ఎం.అరుణ (హోంసైన్స్), పెంచలనేని జ్యోత్స్న (బయో టెక్నాలజీ), పి.వెంకటకృష్ణ (కంప్యూటర్‌సైన్స్), రమ్యాకుబేర్ (ఫార్మసీ), పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరిదేవి (జువాలజీ)తో పాటు ఎస్వీ వ్యవసాయ కాలేజీలో డాక్టర్ డి. సుబ్రమణ్యం (అగ్రానమీ) కూడా పురస్కారానికి ఎంపికయ్యారు.

శెట్టిపల్లె ఫైల్స్ క్లియర్!

స్థలాల యజమానులకు కనీసం 2 సెంట్ల కేటాయింపు

మంత్రి వర్గ భేటీలో నిర్ణయం

దశాబ్దాల వివాదానికి చెక్ పెట్టిన ప్రభుత్వం

ఇక, శెట్టిపల్లె భూ సమస్య కనిపించదు. బాధితుల గోడు అసలు వినిపించదు. దశాబ్దాల వివాదానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. శాశ్వత పరిష్కారం చూపుతూ సీఎం నారా చంద్రబాబు నేతృత్వంలో గురువారం జరిగిన కేబినెట్ నిర్ణయం తీసుకుంది. - తిరుపతి, ఆంధ్రజ్యోతి

తిరుపతి నగరపరిధిలోని శెట్టిపల్లెలో సర్వే లెక్కల ప్రకారం దాదాపు 636 ఎకరాలున్నాయి. దాదాపు 500 కుటుంబాలు వ్యవసాయాన్నే జీవనాధారంగా నమ్ముకుని జీవించేవారు. 3-5-1979లో ఇనామ్ చట్టం రద్దయింది. అదే ఏడాది జూన్ 25న శెట్టిపల్లె గ్రామం ఏర్పాటైంది. 1980-81 మధ్య కాలంలో సాగుబడిని అనుభవంగా పరిగణనలోకి తీసుకున్న అప్పటి కలెక్టర్.. అనుభవంలో ఉన్నవారి భూములను గుర్తించి, గట్టువారి సర్వే నిర్వహించి రఫ్ పట్టాలను మంజూరు చేశారు. రఫ్ పట్టాల ఆధారంగానే భూమి హక్కుదారులుగా ఉండేవారు. క్రయవిక్రయాలు కూడా పెద్దఎత్తున జరిగాయి. ఈ నేపథ్యంలోనే 82.67 ఎకరాలను రైల్వే శాఖ తిరుపతి సీఆర్ఎస్ కోసం భూములు తీసుకుని పరిహారం చెల్లించింది. భూములు కోల్పోయిన ప్రతి ఇంటికి సీఆర్ఎస్‌లో ఓ ఉద్యోగాన్ని కల్పించింది. నగరానికి దగ్గరగా ఉండడంతో రఫ్ పట్టాలతో క్రయవిక్రయాలు జరగ్గా.. ఒకే ప్లాట్‌ను ఇద్దరు, ముగ్గురుకు కూడా విక్రయించినట్టు వెలుగులోకి వచ్చింది. ఈవివాదానికి బ్రేక్ వేస్తూ 2015లో సీఎం చంద్రబాబు నాయుడు శెట్టిపల్లె భూములను 22ఏలో చేర్చారు. దీంతో రిజిస్ట్రేషన్ జరగకుండా అడ్డుకోగలిగారు.

వైసీపీ పొలిటికల్ గేమ్

భూములు తమ అనుభవంలో ఉన్నా, అక్కరకు అమ్ముకోవాలన్నా కుదరదు. ఎవరు ఆక్రమిస్తారోనన్న ఆందోళన. నిజమైన హక్కుదారులే శెట్టిపల్లె భూముల్లో బాధితులయ్యారు. రెండు నియోజకవర్గాలతో ముడిపడిన ఆ ప్రాంతంపై వైసీపీ పెద్దల కన్ను పడింది. మేం చేస్తాం...మేమే చేశాం...అంటూ ఎవరికివారు మభ్యపెట్టారు. ఖాళీ ప్రొసీడింగ్స్ కాపీలు చేతిలోపెట్టి సమస్యను సెటిల్ చేసేశామంటూ చెప్పారు. హక్కుదారులు స్థలాల దగ్గరకు వెళితే రెవెన్యూ వాళ్లు అడ్డుకుని వెనక్కి పంపేశారు. ఇలా వీరితో వైసీపీ పొలిటికల్ గేమ్ ఆడింది.

క్లియర్ చేసిన కూటమి

ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం శెట్టిపల్లి భూముల సమస్యను కొలిక్కి తెచ్చింది. స్థలాల యజమానులకు కనీసం 2 సెంట్ల చొప్పున కేటాయించేందుకు గురువారం నాటి మంత్రిమండలిలో అంగీకరించింది. 2400 మంది యజమానుల్లో 1700 మందికి పైగా యజమానులకు 4 సెంట్లలోపే స్థలాలున్నాయి. వారికి ల్యాండ్ పూలింగ్‌లో ఒకటన్నర సెంటు కంటే తక్కువ స్థలాలు దక్కనున్నాయి. దీంతో రెవిన్యూ శాఖ చేసిన ప్రతిపాదన మేరకు మంత్రి మండలి కనీస స్థలం 2 సెంట్లు చొప్పున ఇచ్చేందుకు అంగీకరించింది. దానివల్ల 1700 కుటుంబాలకు లబ్ధి కలగనుంది.

చంద్రబాబు విజన్‌తో మహర్దశ

చంద్రబాబు విజన్‌తో శెట్టిపల్లెకు మహర్దశ రానుంది. వెడ్డింగ్ డెస్టినేషన్, స్టార్ హోటల్స్ ఏర్పాటుచేసే ఆలోచనలు యంత్రాంగం ఉన్నట్టు తెలుస్తోంది. కేబినెట్ నిర్ణయం మేరకు 227 ఎకరాల్లో టౌన్‌షిప్ వేస్తారు. ఇందులో దాదాపు 2500 మంది బాధితులకు (ప్లాట్ ఓనర్లకు 50:50, అగ్రికల్చర్ 30:70 చొప్పున) ప్లాట్లు కేటాయిస్తారు. 65 ఎకరాలు తుడాకు, 90 ఎకరాలు ప్రభుత్వం ఉంచుకుంటుంది. తుడాకు కేటాయించే 65 ఎకరాలు ఎంఐజీ లేఅవుట్‌లు వేసి విక్రయించగా వచ్చిన ఆదాయంతో టౌన్‌షిప్ రూపొందిస్తుంది. ప్రభుత్వం వద్ద ఉండే భూములను భవిష్యత్ అవసరాలతో పాటు వెడ్డింగ్ డెస్టినేషన్ సెంటర్‌గా మార్చనుంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం

తాము అధికారంలోకి వస్తే శెట్టిపల్లె భూ సమస్యను సెటిల్ చేస్తామని ఎన్నికలముందు హామీ ఇచ్చాం. ఆమేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లాం. ఎట్టకేలకు సమస్యను సుఖాంతం చేయగలిగాం.

- ఆరణి శ్రీనివాసులు, ఎమ్మెల్యే, తిరుపతి

మీకు రుణపడి ఉంటాం

● కలెక్టర్‌కు శెట్టిపల్లె భూబాధితుల కృతజ్ఞతలు.. సన్మానం



తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి భూ సమస్యకు పరిష్కారం చూపారని, రుణపడి ఉంటామని భూబాధితుల కమిటీ గురువారం కలెక్టర్ వెంకటేశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపింది. మంత్రి వర్గ నిర్ణయం తెలిసిన వెంటనే వీరు కలెక్టర్‌ను కలిశారు. మీ కృషి ఫలితంగానే మాకు న్యాయం జరిగిందంటూ సంతోషం వ్యక్తంచేశారు. మాటిచ్చి నెరవేర్చినందుకు సంతృప్తిగా ఉందని, రెండు నెలల్లో పూర్తిగా సమస్యను పరిష్కరిస్తామని కలెక్టర్ వారికి చెప్పారు. కమిటీ అధ్యక్షుడు ఎ.రాధాకృష్ణ, శ్రీనివాసులు, రాజేంద్ర, సురేష్, జ్యోతిరెడ్డి, నాదముని, చిరంజీవి, బుజ్జి పాల్గొన్నారు.

అందరికీ 2సెంట్లు ఇచ్చేలా సీఎం నిర్ణయం

కేబినెట్ అజెండాలో తొలుత శెట్టిపల్లి కనిపించలేదు. సీఎం చంద్రబాబుగారికి వివరించి అడిషనల్ అజెండాలో చేర్చాం. హౌస్‌ఫర్‌ఆల్ స్కీం కింద 2సెంట్లు ఇస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.దీనివల్ల తుడా 7ఎకరాలు నష్టపోయినా, బాధితులు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం.

- డాలర్స్ దివాకర్ రెడ్డి, తుడా ఛైర్మన్

నాయుడుపేటలో సిర్మా టెక్నాలజీస్‌కు 26 ఎకరాలు

● ఏరో స్పేస్ సిటీలో స్కైరూట్ పెట్టుబడి ప్రతిపాదనకు ఆమోదం
● మంత్రిమండలి సమావేశంలో నిర్ణయాలు

తిరుపతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో సిర్మా టెక్నాలజీస్ పరిశ్రమ ఏర్పాటుకు 26.70 ఎకరాల భూమి కేటాయింపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశంలో ఆమోదించింది. రూ.1595 కోట్ల పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటు చేసి 2168 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఈ సంస్థ ప్రతిపాదించింది. పరిశ్రమతో పాటు జాయింట్ వెంచర్ల కింద ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు ప్లాంట్, కాపర్ క్లాడ్ లామినేట్ ప్లాంట్, ఈఎంఎస్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించగా, 26.70 ఎకరాలు కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

● ఏరో స్పేస్ సిటీ ఏర్పాటు దిశగా కీలక ముందడుగు పడింది. ఈ స్పేస్ సిటీలో పెట్టుబడులు పెట్టడానికి మెస్సర్స్ స్కై రూట్ ఏరో స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఎస్ఐపీబీ సిఫారసులకు అనుగుణంగా పరిశ్రమల శాఖ చేసిన ప్రతిపాదన మేరకు స్కైరూట్ సంస్థకు ఎకరా రూ.5 లక్షల వంతున భూములు కేటాయించేందుకు మంత్రి మండలి పచ్చజెండా ఊపింది. స్పేస్ సిటీలో ప్రభుత్వం ఎర్త్ స్టోర్డబుల్ ఇంజన్ టెస్టు ఫెసిలిటీ, క్రయోజనిక్ ఇంజన్ టెస్టు ఫెసిలిటీ, అదే ఫెసిలిటీ 2వ యూనిట్ వంటి సదుపాయాలను కల్పించనుంది.

● దీర్ఘకాలంగా ఉన్న శెట్టిపల్లె సమస్యకు పరిష్కారం చూపింది.

● తిరుపతి సహా 16 జిల్లాల్లో దీపం-2 పథకం కింద 5 కిలోల సిలిండర్లు తీసుకున్న వారికి కూడా 14.2 కిలోల కేటగిరీలో ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు దక్కేలా మంత్రి మండలి నిర్ణయం తీసుకుంది. దీనివల్ల జిల్లాలో కనీసం 2 వేల కుటుంబాలకు మేలు జరగనుంది.

CTBTA DATE 05-09-2025
TODAY'S LIVE BIRDS & CHICKEN PRICES
CHITTOOR TIRUPATI BROILER TRADERS ASSOCIATION
టుడే సప్లై రేట్ 105/- డ్రెస్డ్ స్కిన్‌తో 195/-
రిటైల్ లైవ్ బర్డ్ 130/- స్కిన్‌లెస్ 220/-

ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలకు ఎన్ఆర్ఎఫ్ ర్యాంకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్ వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో ఎస్వీయూ, పద్మావతి మహిళా యూనివర్సిటీకి ర్యాంకులు దక్కాయి. ఎస్వీయూకు 47వ ర్యాంకు, పద్మావతి మహిళా యూనివర్సిటీకి 60వ ర్యాంకు దక్కింది. బోధన, పరిశోధన, విస్తరణ తదితర రంగాల్లో ఈ వర్సిటీల విశేష కృషికి గుర్తింపుగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ర్యాంకు రావడం పట్ల ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు, పద్మావతి వర్సిటీ వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని హర్షం వ్యక్తం చేశారు.

తుడా ప్లాట్ల వేలం ప్రారంభం

తిరుపతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ (తుడా) సుమారు 145 ఎకరాల్లో సూరప్పకశం వద్ద వేసిన పద్మావతి నగర్‌లోని 277 ప్లాట్లు ఈ-వేలం ద్వారా ఆన్ లైన్ పద్ధతిలో గురువారం నుంచి 13వ విడత వేలం ప్రారంభమైంది. తుడా వారి కనీస ధర చదరపు గజం రూ.14వేలుగా నిర్ణయించారు. తొలిరోజు అనూహ్య స్పందన లభించింది. తొలిరోజు ఎల్ఐజీ 9 ప్లాట్లు, హెచ్ఐజీ 3 ప్లాట్లు అమ్ముడుపోయాయి. ఈ-వేలం ప్రక్రియను ఈనెల 17వ తేదీ వరకు నిర్వహిస్తామని తుడా కార్యదర్శి డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్ బాబు తెలిపారు. భూసేకరణ అధికారి ఎస్.సుజన, ఐసీసీఐ బ్యాంకు ప్రతినిధి ప్రవీణ్ ఆధ్వర్యంలో జరుగుతున్న వేలం ప్రక్రియను కార్యదర్శి పర్యవేక్షించారు. ఈ-వేలంలో పాల్గొనదలచిన వారు వెయ్యి రూపాయలు కట్టి ఆన్లైన్‌లో ఈనెల 16వ తేదీ లోపు ఎప్పుడైనా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని తెలిపారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోకు షోకాజ్ నోటీసు

రేణిగుంట సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రభురావుకు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి గురువారం షోకాజు నోటీసులు జారీ చేశారు. గుత్తివారిపల్లిలో తాగునీరు కాలుష్యం కావడంతో అతిసారం బారిన పడి ఓ వృద్ధురాలు మృతిచెందగా మరికొందరు ఆస్పత్రిపాలయ్యారు. దీనిపై వారం రోజుల్లో జవాబు ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేశారు.



అటు తనిఖీలు.. ఇటు విచారణ

● రెండో రోజు చెవిరెడ్డి ఇంట్లో సిట్ అధికారులు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఒక బృందం తనిఖీలు చేపట్టింది. మరో బృందం చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని విచారించింది. ఇలా తిరుపతి విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ ఆధ్వర్యంలో 15 మందితో కూడిన సిట్, విజిలెన్స్ అధికారులు రెండు బృందాలుగా విడిపోయారు. రెండో రోజైన గురువారం తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంటలోని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇంట్లో ముమ్మరంగా సోదాలు జరిపారు. మద్యం కుంభకోణం కేసులో ఏ38గా ఉన్న చెవిరెడ్డి భాస్కరరెడ్డి ఇప్పటికే అరెస్టయ్యారు. బుధవారం ఆయనకు సంబంధించి రియల్ ఎస్టేట్ కార్యాలయంలో తనిఖీ చేయగా, అప్పటికే ఖాళీ చేసినట్లు గుర్తించారు. చెవిరెడ్డి కుటుంబీకులు అందుబాటులో లేకపోవడంతో ఆయన ఇంట్లో.. ఇంట్లోనే నిర్వహిస్తున్న కార్యాలయంలో తనిఖీలు చేయలేదు. గురువారం వేకువజామున చెవిరెడ్డి సతీమణి లక్ష్మి, కుమారుడు మోహిత్‌కుమార్ ఇంటికి వచ్చారు. ఉదయం పది గంటలకు సిట్, విజిలెన్సు అధికారులు చెవిరెడ్డి ఇంటికి చేరుకోగా.. రాత్రి 8.30 గంటల వరకు తనిఖీలు చేపట్టారు. వీరిలో ఇద్దరు అదనపు ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు, సిబ్బంది ఉన్నారు. చెవిరెడ్డి కుటుంబానికి చెందిన వివిధ కంపెనీలు, సంస్థల లావాదేవీలకు సంబంధించిన రికార్డులు, డాక్యుమెంట్లను ఒక బృందం పరిశీలించింది. రెండు కంప్యూటర్ హార్డు డిస్కులను, ఇంట్లోని సీసీ కెమెరాల హార్డు డిస్కులను, పలు కీలక రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. అదే సమయంలో మరో బృందం లిక్కర్ స్కామ్‌లో ఏ39గా ఉన్న మోహిత్‌రెడ్డిని విచారించింది. తమ వద్దనున్న సమాచారం ఆధారంగా ప్రశ్నలు సంధించినట్లు సమాచారం. కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఇన్‌ఫ్రా, భీమ్ స్పేసస్ ఎల్ఎల్ఎల్‌పీ, సీఎంఆర్, క్యాంపు మ్యాన్ పవర్ సర్వీసస్, సీఎంఆర్ గార్డెన్స్, మ్యాచ్ కార్న్ టెక్నాలజీస్.. తదితర సంస్థలు ఎవరి పేర్లతో ఉన్నాయి? వాటి రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు సమర్పించాలని మోహిత్‌ను అడిగినట్లు తెలిసింది. కాగా, సిట్ అధికారుల విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు బయటకు వచ్చినట్లు తెలిసింది. దాదాపు ఐదారు సంస్థలకు సంబంధించి లేని సంస్థల పేర్లతో బయట బోర్డులు పెట్టినట్లు విచారణలో గుర్తించారని సమాచారం.

తుడా, కానుకల మాటేమిటి?

తుడా ఛైర్మన్‌గా చెవిరెడ్డి భాస్కర రెడ్డి, మీరు (మోహిత్ రెడ్డి) ఉన్నప్పుడు సీఎంఆర్ సంస్థ పేరుతో ఎన్ని.. ఎలాంటి అభివృద్ధి పనులు చేశారు? పండగల సమయంలో పంపిణీ చేసిన కానుకలకు డబ్బులు ఎక్కడ నుంచి తెచ్చారు? సొంత రియల్ ఎస్టేట్ కంపెనీల వ్యవహార లావాదేవీలు, వాటి ఆదాయ వనరులు, ఎంతమంది భాగస్వాములున్నారు? వారెవరు? ఆయా సంస్థల్లో మీరు పెట్టిన పెట్టుబడికి నగదు ఎక్కడ నుంచి తెచ్చారు? వాటి ఆధారాలు ఉన్నాయా? ఉంటే డాక్యుమెంట్లు సమర్పించాలని విచారణాధికారులు చెప్పినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, సిట్ తనిఖీల నేపథ్యంలో చెవిరెడ్డి ఇంటి వద్ద టెన్షన్ వాతావరణం నెలకొంది. వైసీపీ నాయకులు, ఆయన అనుచరులు బయట పడిగాపులు కాశారు. చెవిరెడ్డి ఇంటి వద్ద తిరుపతి రూరల్ పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎవరినీ అక్కడ ఉంచకుండా పంపించేశారు.

ఆరుకంపెనీల అడ్రస్‌లు తీసుకున్నాం



తిరుపతిరూరల్, ఆంధ్రజ్యోతి: ఈ సోదాల సందర్భంగా చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి నివాసంలో ఆరుకంపెనీలకి సంబంధించి వివరాలు, అడ్రస్‌లు తీసుకున్నామని విజిలెన్సు ఎస్పీ కరీముల్లా షరీఫ్ గురువారం రాత్రి మీడియాకు చెప్పారు. కొన్ని రికార్డులు సేకరించామని, వీటిని తదుపరి విచారణ కోసం సిట్‌కి అందిస్తామన్నారు.

విచారణకి సహకరించాం


సిట్ అధికారుల విచారణకు పూర్తిగా సహకరించామని మోహిత్‌రెడ్డి తెలిపారు. వారు అడిగిన అన్ని డాక్యుమెంట్లు ఇచ్చామన్నారు. ఏ తప్పు చేయలేదు కాబట్టి.. ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామన్నారు.

APSRTC
SHORT TENDER NOTICE
Tenders are invited through ONLINE ("www.tender.apeprocurement.gov.in") for 1. Expansion of Bus Station at Venkatagiri, Tirupati District. 2. Annual and Periodical Maintenance to the Bus Station at Kakinada, Kakinada District. For full Tender Notice please visit "www.apsrtc.ap.gov.in". For Online participation please visit "https://tender.apeprocurement.gov.in". NOTE: Bid Document download Start Date & Time: 16.09.2025, 4.00 PM, Bid Submission Closing Date & Time : 24.09.2025, 4.00 PM. Further details: Ph. No: 9959224686 (10.00 AM to 5.30 PM). APSRTC reserves the right to cancel or reject any tender or all the tenders of this notification without assigning any reason at any stage.
NIT NO. 14/CCE/APSRTC/2025-26, Dt.04.09.2025 Chief Civil Engineer, APSRTC, Vijayawada

శ్రీ శ్రీనివాస MPHW (F) ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్
ఆర్.వి.ఎస్.నగర్, తిరుపతిరోడ్డు, చిత్తూరు
ANM / MPHW Training కోర్సుకు సువర్ణవకాశం
కాలపరిమితి 2 సంవత్సరములు మాత్రమే
అర్హులు : ఇంటర్మీడియట్ ఏదైనా గ్రూపు నందు పాస్ అయిన వారు మరియు / APOSS / ఇంటర్ ఒకేషనల్ (10+2) పాస్‌అయిన వారు ఎస్సీ/ఎస్టీ/బీసీ మరియు మైనార్టీ విద్యార్థినులు
వయస్సు : 17 సంవత్సరముల నుండి 35 సంవత్సరముల వరకు
గమనిక : అర్హులైన విద్యార్థినులు టెన్త్ మరియు ఇంటర్ పాసైన సర్టిఫికెట్లు మరియు బయోడేటా పై అడ్రస్‌కు పోస్ట్ ద్వారా పంపగలరు.
హాస్టల్ వసతి కల్పించబడును
పూర్తి వివరాలకు ఈ సెల్ నెంబరును సంప్రదించండి - 8309836927



గురుతర బాధ్యతలు



ఆది గురువు అమ్మ తర్వాత స్థానం ఉపాధ్యాయుడిదే. అందుకే ఆచార్య దేవోభవ అంటారు. భావి తరాలను తీర్చిదిద్దే కీలక పాత్ర వీరిదే. తరగతి గదిలో విద్యాబుద్ధులు నేర్పించి విలువల బాటలో నడిపించి ఉత్తమ సమాజాన్ని నిర్మించాల్సింది వీరే. అందరిపై ఉపాధ్యాయుల ప్రభావం ఉంటుంది.. ఇదే రంగం నుంచి జీవితాన్ని ప్రారంభించి దేశంలో అత్యున్నత రాష్ట్రపతి స్థాయికి ఎదిగారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. ఉత్తమ ఉపాధ్యాయులకు ఆదర్శ నమూనా నిలిచారీ మహానుభావుడు. ఈయన జన్మదినంనాడు ఏటా ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకొంటున్నారు. సర్వేపల్లి చూపిన స్ఫూర్తి పథాన నడుస్తున్న కొందరు టీచర్ల గురించి ఈ సందర్భంగా తెలుసుకుందాం.

● నేడు ఉపాధ్యాయ దినోత్సవం




విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుస్తులు అందిస్తున్న వెంకటరమణ

బోధనకు సేవా పరిమళాలు అద్దుతూ...



వడమాలపేట,సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సేవాభావాన్ని జోడిస్తూ వృత్తికి వన్నె తెస్తున్నారు ఓబీఆర్ కండ్రిగకు చెందిన ఎల్లమరాజు వెంకటరమణ. 1988లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయునిగా కెరీర్ ప్రారంభించిన ఈయన ఎక్కడ పనిచేసినా తనదైన ముద్రవేసుకుంటున్నారు. ప్రస్తుతం వడమాలపేట బాలుర ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. వేతనంలో 20 శాతం పాఠశాల, విద్యార్థుల ప్రయోజనం కోసం వెచ్చిస్తుంటారు. పాఠాలు చెప్పడంతోనే సరిపెట్టుకోకుండా స్కూలుకు అవసరమైన బోధనోపకరణాలను సమకూర్చుతున్నారు. అవసరమైన పిల్లలకు యూనిఫాం, నోట్ పుస్తకాలు అందజేస్తుంటారు. పిల్లలకు ఆసక్తి కలిగించేలా నాన్నా చెప్పవా, మన శాస్త్రవేత్తలు, మదర్ఎర్త్, స్వాతంత్ర్య సమర యోధుల కథల పుస్తకాలను తానే కొని విద్యార్థులతో చదివింపజేస్తున్నారీ ఆదర్శ ఉపాధ్యాయుడు. పనిచేసిన ప్రతిపాఠశాలలోనూ విద్యార్థుల,వారి తల్లిదండ్రుల ప్రేమాభిమానానికి పాత్రుడవుతున్నారు. ఈయన సేవలకు గుర్తింపుగా 2008లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా, తదుపరి ఏడాది రాష్ట్ర స్థాయిలోనూ పురస్కారం అందుకున్నారు..

సెలవు ఎరుగని భాస్కరుడు..



సత్యవేడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వీలు చిక్కితే సెలవులు పెట్టేవారికి ఈ ఉపాధ్యాయుడు గురించి తెలుసుకోవల్సిందే. సత్యవేడు మండలం వీవీపురం జడ్పీ హైస్కూల్‌లో సైన్స్ టీచర్ మూకూరి భాస్కర్ ఎనిమిదేళ్ళుగా ఒక్క సీఎల్ గాని, ఎస్‌సీఎల్ గానీ వాడుకోలేదంటె విస్మయమే. 2000లో కుప్పం మండలంలో ఉపాధ్యాయుడిగా కెరీర్ ప్రారంభించిన ఈయన పాతికేళ్లలో ప్రతి స్కూలులోనూ అంకితభావంతో ప్రత్యేక ముద్ర వేసుకుంటున్నారు. 14 యేళ్లలో ఒక్క సెలవు కూడా తీసుకోలేదు. వరుసగా గత ఎనిమిదేళ్ళలో కూడా ఇదీరీతిలో నిబద్ధత చాటుకున్నారు. 2016లో వైరల్ జ్వరంతో బాధపతున్నా మాస్క్ ధరించి వచ్చారు. కరోనా విష్మతర పరిస్థితుల్లో విద్యా మెటీరియల్‌ను విద్యార్థుల ఇళ్లకు చేర్చి ఉత్తీర్ణతకు తోడ్పడ్డారు. ఇప్పటివరకూ వివిధ పాఠశాలల్లో రూ. 5లక్షలతో వసతులను కల్పించారురు. సెలవు సమయాల్లో దాతలను సంప్రదించి రూ.20 లక్షలకు పైగా నిధులతో వసతులను ఏర్పాటు చేశారు. తన కుమారులిద్దరినీ టెన్త్ వరకు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివించారు. 2018లో భాస్కర్‌కు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు వరించింది.

ఫిజిక్స్ బోధిస్తే అర్థం కావాల్సిందే...

తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): క్లిష్టమైన ఫిజిక్స్ సబ్జెక్టును అర్థమయ్యేలా బోధించడం జోత్స్న ప్రత్యేకత. ఈమె రేణిగుంట మండలం గుత్తివారిపల్లి జడ్పీహైస్కూలులో పనిచేస్తున్నారు. ఫిజిక్స్ పాఠాలను ఆసక్తి కలిగేలా వివరించడమే కాకుండా ప్రయోగాత్మకంగా బోధిస్తారీమె. ఈమె పాఠం చెబితే బట్టీ పట్టకుండా సులభంగా పిల్లల మెదళ్లలో నిలిచిపోతుంది. ఉపాధ్యాయులకూ ఉపయోగపడేలా ఆమె ఫిజిక్స్ మెటీరియల్‌ను తయారుచేసి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆమెవద్ద చదువుకున్న పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి సైన్స్ పోటీల్లో ప్రాజెక్టులు తయారుచేశారు. ఫిజికల్ సైన్స్ ఫోరంలో నూతన విధానాల అమలుకు ఫోరంకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వడంలో ముందుటుంన్నారు.




లెక్కల చిక్కులకు తులసి చిట్కాలు



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): టి. తులసి. చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలు. గణితమంటే చాలామంది విద్యార్థులకు ముచ్చెమటలు పడతాయి. కష్టతరమైన లెక్కలను పిల్లలకు అర్థమయ్యేలా సులభమైన పద్ధతుల్లో బోధించడం తులసి టీచర్‌ది అందె వేసిన చేయి. గణితంపై భయాన్ని పోగొట్టి సులభంగా అర్థమయ్యేలా ప్రత్యేకంగా మెటీరియల్ కూడా తయారు చేశారు. ఇలా ప్రత్యేక పద్ధతుల్లో బోధిస్తూ మంచి గణిత టీచర్‌గా గుర్తింపు పొందారు. ఈక్రమంలోనే ఆమెను రాష్ట్ర విద్యాశాఖ కొత్త సిలబస్ తయారీలో సభ్యురాలిగా నియమించింది. పాఠ్యపుస్తకాల రచయితల్లో తులసి కూడా ఒకరు.

అంకితభావానికి కేరాఫ్ ఆలీఖాన్



ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డులతో ఆలీఖాన్

పుత్తూరు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కుందిమాకుల గుంట గిరిజన కాలనీ. పట్టణానికి దూరంగా కొండల దిగువన నందిమంగళం పంచాయతీలోని ఈ కాలనీలో అందరూ రెక్కాడితే గాని డొక్కాడని వారే. ఈ శ్రమజీవుల పిల్లలను సరస్వతీ పుత్రులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు ఇక్కడి ప్రాథమిక స్కూలులోని ఏకోపాధ్యాయుడు షజాద్ ఆలీ ఖాన్. ఏడాదిలో అయిదు రోజులకు మించి సెలవు పెట్టని ఆయన తత్వమే చెబుతుంది ఆయన అంకితభావం. ఇక్కడి విద్యార్థులు అన్నిటా ముందంజ వేయాలనే సంకల్పంతో ఇంగ్లీషు భాష బోధన మీద ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నారు. తెలుగులో ముత్యాల్లాంటి అక్షరాలను నేర్పిస్తున్నారు. తక్కువ మంది కావడంతో ప్రతి విద్యార్థి మీద అదనపు శ్రద్ధ పెడుతున్నారు. ఏకోపాధ్యాయుని మీద పూర్తి నమ్మకంతో గిరిజనులు తమ పిల్లలను శ్రద్ధగా స్కూలుకు పంపడానికి ఆసక్తి చూపిస్తున్నారు. ఆలీఖాన్ హిందీ, ఇంగ్లిషుల్లో డబుల్ ఎంఏతోపాటు బీకాం, బీఈడీలను చేశారు. ఇరవై రెండేళ్ల కెరీర్‌లో ఆయన ఈ గిరిజనకాలనీలో ఐదేళ్లుగా పని చేస్తున్నారు. ఆయన పని నిబద్ధతకు తార్కాణంగా మూడు పర్యాయాలు మండల స్థాయి, ఓ సారి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడుగా అవార్డులు వరించాయి.

'ఆనంద్'మానందమాయె..

● హెచ్‌ఎం కృషితో వసతుల కల్పన



ఏర్పేడు, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆయనది రొటీన్‌గా విధులు నిర్వహించుకుపోయే తత్వం కాదు. అందువల్లే తాను పనిచేసిన స్కూలులో వసతులు లేకపోతే పట్టించుకోకుండా ఉండిపోలేదు. దాని రూపురేఖలు మార్చేందుకు నడుం బిగించారు. 2023 జూలైలో పల్లం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. స్కూలులో ప్రాథమిక వసతుల లేమిని గుర్తించారు. ప్రభుత్వం నుంచి గ్రాంటుతోనే ఇది సాధ్యం కాదని భావించారు. ఇందుకోసం ఆయన పరిచయస్తులు, మిత్రులు, పూర్వవిద్యార్థుల సహకారాన్ని అభ్యర్థించారు. వీరి చేయూతతో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో సఫలీకృతులయ్యారు. బ్రాడ్‌కామ్ క్రైసంస్థ ద్వారా రూ.8లక్షలతో స్టెమ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయించడంలో కీలకభూమిక పోషించారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి గ్రాంట్ నుంచి రూ.5లక్షలతో టాయిలెట్స్‌ను నిర్మించేందుకు చొరవ తీసుకున్నారు. తన మిత్రుడు, ఆర్టీసీ ఈడీ సహకారంతో 16 కిలోమీటర్ల మేర 12 గ్రామాల నుంచి పాఠశాలకు విద్యార్థులను తరలించడానికి ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించేలా కృషి చేశారు. ఆనంద్ అభ్యర్థనపై స్పందించిన పూర్వ విద్యార్థి (చింతలపాళెం) శివశంకర్ రూ.3లక్షలతో పాఠశాల ఆవరణలో స్టేజీ నిర్మిస్తున్నారు మరో పూర్వవిద్యార్థి పరమాల చంద్రశేఖర్ సహకారంతో రూ.50వేలతో పీఎంశ్రీ ఎంబ్లమ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. హెచ్‌ఎం చొరవ ఫలితంగా స్కూలులో విద్యార్థుల సంఖ్య వెయ్యికి చేరింది.

శెభాష్..సురేష్



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): దళవాయి సురేష్.. అప్పలాయగుంటలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను విద్యార్థుల సంఖ్యను బలోపేతం చేయడంలో కీలకపాత్ర పోషించారు. ఒకప్పుడు ప్రాథమికోన్నత పాఠశాలగా ఓ వెలుగు వెలిగిన ఈ స్కూలు ఏడుగురితో ప్రాథమిక పాఠశాలగా మారింది. ఇటీవల మోడల్ ప్రైమరీ పాఠశాలగా గుర్తించారు. ఈ పాఠశాలకు హెచ్‌ఎంగా బాధ్యతలు చేపట్టిన సురేష్.. వచ్చీరాగానే చట్టపక్కల గ్రామాలన్నీ తిరిగి తల్లిదండ్రులతో మాట్లాడారు. స్వయంగా తానే కారులో తీసుకువెళ్లి విద్యార్థులను తిరిగి తీసుకువస్తానని, పెద్దలను ఒప్పించారు. దీంతో 60 మంది విద్యార్థులను చేర్పించగలిగారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరికీ మార్గదర్శకంగా నిలుస్తున్నారు.

విద్యార్థులను చేయూత ఈ విద్యాప్రదాత



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బండి మధుసూదన్‌రెడ్డి ..తిరుపతి బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్లో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన 1991లో ఉపాధ్యాయులుగా రిక్రూట్ అయ్యారు. 34 ఏళ్లుగా పేద విద్యార్థులకు విద్యా సౌకర్యాలు, పాఠశాలల్లో వసతుల కల్పనకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. ప్రభుత్వం ఉచితంగా విద్యాకిట్లు అందించని కాలంలో ఆయనే కొందరు విద్యార్థులకు నోటుపుస్తకాలు సమకూర్చేవారు. దాతల సాయంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులకు చేయూతనందించడం ప్రారంభించారు.బల్లలు, బెంచీలు, బ్లాక్‌బోర్డులు తదితర వసతుల కల్పనకు పాటుపడుతున్నారు. ఏటా 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్నారు. వికలాంగ విద్యార్థులకు ట్రైసైకిల్స్ అందజేస్తున్నారు. మొక్కలు నాటిస్తూ పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులను భాగస్వాములను చేస్తున్నారు. 2006లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ, 2014లో రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.

సిలబస్ తయారీలోనూ స్థానం



తిరుపతి(విద్య), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): సి.భాగ్యశేఖర్ రెడ్డి. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఆంగ్లాన్ని బోధించడంలో ఈయన దిట్ట. పాఠానికి తగ్గట్టు ప్రత్యేకమైన కథలు, సామెతలు, సందర్భాలను ఉపయోగించుకుంటూ ఆంగ్ల పరిజ్ఞానాన్ని విద్యార్థుల మస్తిష్కంలో నిక్షిప్తం చెయ్యడంలో నేర్పరి. అందుకే ఆయనకు సిలబస్ తయారీలో స్థానం లభించింది. పాఠ్యపుస్తకాల రచయితగా, రిసోర్స్ పర్సన్‌గా గుర్తింపు పొందారు భాగ్యశేఖర్‌రెడ్డి.



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు - పూజా ద్రవ్యాలు

శ్రీకాళహస్తిలో శాస్త్రోక్తంగా

పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో రెండో రోజైన గురువారం శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు నిర్వహించారు. ఆలయంలోని యాగశాలలో ప్రధాన అర్చకులు, వేదపండితుల ఆధ్వర్యంలో శ్రీ-కాళ-హస్తి ఉత్సవర్లు, భరద్వాజ మహర్షి ఉత్సవమూర్తిని కొలువు తీర్చి విశేష అభిషేక పూజలు చేపట్టారు. ఉత్సవర్లకు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు పూజా ద్రవ్యాలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు స్వామినాధన్ గురుకుల్, వేద పండితులు, అధికారులు పాల్గొన్నారు.

అంతర్ జిల్లాల ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

● 10 ద్విచక్రవాహనాలు స్వాధీనం
● డీఎస్పీ శ్రీనివాసరావు వెల్లడి



ద్విచక్రవాహనాలతో పాటు మోస్ట్‌వాంటెడ్ దొంగని అరెస్ట్ చూపిస్తున్న రేణిగుంట అర్బన్ పోలీసులు

రేణిగుంట సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న దొంగను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి రూ 5.70 లక్షలు విలువచేసే 10 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం అర్బన్ పోలీస్ స్టేషన్లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. తిరుపతి, నెల్లూరు జిల్లాలో 64 కేసుల్లో మోస్ట్ వాంటెడ్ ద్విచక్ర వాహనాల దొంగ నెల్లూరు జిల్లా ఇందుకూరు మండలం మదివర్తిపాలెం దళితవాడకు చెందిన దొడ్ల సంతోష్. ఇతడు రేణిగుంట ఉదయం చెక్ పోస్ట్ కూడలి వద్ద పట్టుబడ్డాడు. ఇతడిపై చంద్రగిరి, అలిపిరి, తిరుచానూరు, భాకరాపేట, నెల్లూరు రూరల్, రేణిగుంట పోలీస్ స్టేషన్లలో ఇప్పటికే 48 ద్విచక్ర వాహనాల చోరీ కేసుల్లో అతడు జైలుకు వెళ్లి వచ్చాడు. దొంగను అరెస్టు చేసిన సీఐ జయచంద్ర, ఎస్ఐ నాగరాజు, పిఎస్ఐ స్వాతి, కానిస్టేబుళ్లు రాజశేఖర్, బారుషా, గౌరీ నాయుడు, శీను, చలపతిని ఎస్పీ హర్షవర్ధన్ రాజు అభినందించినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

గడువులోపు ఈ-పంట నమోదు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ-పంట నమోదును ఈనెల 30వ తేదీలోపు పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్-2025 సీజన్‌కు సంబంధించి ఈ పంట నమోదు జూలై 15 నుంచి ప్రారంభమైందన్నారు. పంట వేసిన, వేయని భూములను నమోదు చేయాలన్నారు. ప్రతి రైతుసేవా కేంద్రంలోని అధికారులు తమ పరిధిలోని భూముల వివరాలను ఈనెల 30వ తేదీలోపు నమోదయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి దశరథరామిరెడ్డి, జిల్లా పశసంవర్ధకశాఖ అధికారి రవికుమార్ పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికతో బ్రహ్మోత్సవాలకు..

● పోలీసు అధికారుల సమావేశంలో ఎస్పీ హర్షవర్ధన రాజు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబర్ 4(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు పటిష్ట ప్రణాళికతో ముందుకెళ్లాలని ఎస్పీ హర్షవర్ధన రాజు అధికారులను ఆదేశించారు.ఎస్పీ కార్యాలయంలో గురువారం అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావుతోపాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో సమావేశం నిర్వహించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీసు శాఖ పరంగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ఇందుకోసం రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని, క్యూలైన్ల ఏర్పాటుపై సమగ్ర నివేదికలు తయారు చేయాలని అన్నారు. టీటీడీతో సమన్వయం చేసుకుని ముందుకెళ్లాల్సిన అవసరముందన్నారు.

ఎస్వీయూకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ జారీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూకు ఐఎస్ఓ సర్టిఫికేషన్ జారీ అయ్యింది. విద్యా నైపుణ్యాలు, సమగ్రాభివృద్ధి, నిబద్ధత వంటి అంశాల్లో కృషికి గుర్తింపుగా ఐఎస్ఓ సర్టిఫికేషన్ ఇచ్చారు.రెండు రోజులుగా ఐఎస్ఓ ప్రతినిధుల బృందం యూనివర్సిటీ ప్రగతిని ప్రత్యక్షంగా పరిశీలించింది.



ఐఎస్ఓ సర్టిఫికేట్‌తో వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు

పవిత్రం సమర్పయామి



శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవర్లకు పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : గోవిందరాజస్వామి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం పవిత్రాల సమర్పణ శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి, పరివార దేవతల మూలవిరాట్లకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. శాత్తుమొర, ఆస్థానం వంటి వైదిక కార్యక్రమాల అనంతరం యాగశాలలో పవిత్రమాలలకు ప్రత్యేక పూజలు చేసి, కర్పూర హారతులు సమర్పించారు. ఆలయంలో ఊరేగించి శ్రీదేవిభూదేవి సమేత గోవిందరాజస్వామి, పరివార దేవతల మూలవిరాట్లకు పవిత్రమాలలను సమర్పించారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం, మాడవీధుల్లోని శ్రీమఠం ఆంజనేయ స్వామి కి పవిత్రమాలలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవర్లు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తాదులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో పెద్దజీయర్, చిన్న జీయర్లు, డిప్యూటీ ఈవో వీఆర్‌శాంతి, ఏఈవో ఏబీ నారాయణచౌదరి, సూపరింటెండెంట్, ఆలయ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

20 ఎర్రచందనం దుంగల స్వాధీనం

● కారు సీజ్



పట్టుబడ్డ ఎర్రచందనాన్ని చూపుతున్న అధికారులు

మంగళం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టు-పీలేరు రహదారిలో గురువారం ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు పెట్రోలింగ్ నిర్వహించి 20ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఒక కారును సీజ్ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసులుకు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం రాత్రి నుంచి పూతలపట్టు-పీలేరు రహదారిలో అధికారులు పెట్రోలింగ్ చేపట్టారు. గురువారం తెల్లవారుజామున పులిచెర్ల వద్ద ఏపీ05 టీవీ 1345 నంబరు గల కారు వేగంగా రావడాన్ని గమనించారు. ఆపే ప్రయత్నం చేయగా ఆపకుండా వెళ్లిపోయారు. వెంబడించగా పూతలపట్టు టోల్‌గేట్ సమీపంలో కారును ఆపి పారిపోయారు. కారులో పరిశీలించగా 20 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించారు. కారుతో సహా ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.27.49లక్షలు ఉంటుందని ఫ్లయింగ్ స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ సుబ్బరాయులు తెలిపారు. ఈ దాడిలో ఎఫ్ఎస్‌వో శశికుమార్, ఎఫ్‌బీవో చంద్రబాబు, డ్రైవర్ సాయికిరణ్, ప్రొటెక్షన్ వాచర్లు మునస్వామి, భార్గవ్, రాజా, చంద్ర పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి కుదేలు



మాట్లాడుతున్న మధుసూదన్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో రాష్ట్రాభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, కూటమి పాలన వచ్చాక పురోగమిస్తోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి జల్లి మధుసూదన్ పేర్కొన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర విభజన తర్వాత రాష్ట్రం అనేక సమస్యలు ఎదుర్కొందని, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ రాష్ట్రాన్ని మరింత కుదేలు చేసిందని విమర్శించారు. ఇప్పుడు కేంద్రం సహకారంతో కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతోందని వివరించారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలుస్తూ, భవిష్యత్తు నిర్మాణంలో ముందుకు సాగుతోందని తెలిపారు. తనపై నమ్మకంతో అత్యున్నత బాధ్యతలు అప్పగించిన పార్టీ జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు, కార్యకర్తల సూచనలు, సలహాలతో పార్టీని మరింత ముందుకు తీసుకెళతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోలా ఆనంద్ పాల్గొన్నారు. కాగా జల్లి మధుసూదన్‌ను బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు.

ఏనుగుల నుంచి రక్షణకు ఆర్‌టీజీఎస్‌టీ టెక్నాలజీ

మంగళం, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): ఏనుగులు సంచరిస్తే ఆ సమీప గ్రామస్థుల మొబైల్ ఫోన్లకు సమాచారం వెళ్లే విధంగా ఆర్‌టీజీఎస్ టెక్నాలజీ తీసుకువచ్చినట్లు తిరుపతి డీఎఫ్‌వో వివేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో వంద ఏనుగులు సంచరిస్తున్నాయని, వాటి నుంచి ప్రాణ, పంటనష్టం కలుగకుండా ఈ టెక్నాలజీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఏనుగులు గ్రామాల్లోకి, పంట పొలాల్లోకి వచ్చినపుడు వాటిని రెచ్చగొట్టే ప్రయత్నం చేయకూడదని సూచించారు. కొందరు ఏనుగులను నేరుగా చూడటానికి వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జిల్లా అభివృద్ధిపై దృష్టి సారించండి

● రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధికి ప్రతి అధికారీ కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ సూచించారు. గురువారం రాత్రి విజయవాడ నుంచి భూగర్భ జలాలు, చెరువులు, భూసమస్యలు తదితర అంశాలపై జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. జిల్లా ఖనిజ నిధుల కేటాయింపులు, కొత్త జిల్లాలకు నిధుల విడుదల, సీఎఫ్‌ఎంఎస్ లింక్ వంటి సమస్యలు పరిష్కరించాలని డివైడెడ్ డిస్ట్రిక్స్ మధ్య అప్రూవల్ పద్ధతిని పరిశీలించాలని విజయానంద్‌ను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. డీపీవో సుశీలాదేవి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

తిరుమలలో జీఎస్టీ ఎత్తివేయాలి

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి) : తిరుమల కొండపై జీఎస్టీ ఎత్తివేయాలని టీటీడీ ఉద్యోగ కార్మిక సంఘాల గౌరవాధ్యక్షుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. గత ఐదేళ్లలో జీఎస్టీ కింద రూ.150కోట్లకుపైగా టీటీడీ చెల్లించిందని వెల్లడించారు. కొండపై జీరో జీఎస్టీ ప్రకటించడం ద్వారా భక్తులు, యాత్రికులకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఆ నిధులతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడానికి వీలుకలుగుతుందని తెలిపారు. పాలకమండలి స్పందించి అత్యవసర సమావేశం నిర్వహించి, తీర్మానం ద్వారా కేంద్ర ప్రభుత్వానికి విన్నవించాలని గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు.

తిరుపతి పుణ్యక్షేత్రంలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమమా?

● అనుమతి ఇవ్వొద్దంటూ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతిలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమాలను నిర్వహించకుండా చూడాని ముఖ్యమంత్రి చంద్రబాబుకు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు హైదరాబాద్‌లోని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ విజ్ఞప్తి చేశారు. తబ్లిక్ జామాద్ ఆధ్వర్యంలో ఈనెల 13,14 తేదీల్లో తిరుపతిలో తబ్లిక్ ఇస్తామా కార్యక్రమం ఏర్పాటు చేశారని, దీనికి పోలీసుల అనుమతి కూడా తీసుకున్నారన్నారు. తబ్లిక్ జామాద్ సంస్థను సౌదీ అరేబియా ప్రభుత్వం నిషేధించిందని, ఇక్కడ ఎలా అనుమతి ఇస్తారని ఆయన ప్రశ్నించారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా దృష్టి సారించి ఇలాంటి సంస్థల కార్యక్రమాలు మన దేశంలో జరగకుండా కట్టుదిట్టం చేయాలని కోరారు.

టీడీపీలో కష్టపడే వారికి తగిన గుర్తింపు



ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న లీలావతి

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి సీఎం చంద్రబాబు నాయుడు తగిన గుర్తింపు ఇస్తున్నారని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన గుండాల లీలావతి గురువారం ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగు మహిళా రాష్ట్ర కార్యదర్శిగా గుండాల లీలావతి పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేశారన్నారు. ఆమె సేవలను గుర్తించిన సీఎం చంద్రబాబునాయుడు లైవ్‌స్టాక్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో నెలబల్లి భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, చంద్రమౌళి, పెంచలయ్య, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ గూడూరు 7వ అదనపు కోర్టు న్యాయమూర్తి కే.వెంకట నాగ పవన్ గురువారం తీర్పు వెలువరించినట్లు పోలీసులు తెలిపారు. 2021 ఫిబ్రవరి 4వ తేదీ రాత్రి సూళ్లూరుపేట పట్టణం కోళ్లమిట్ట వద్ద షటిల్ ఆడుతుండగా చిన్నపాటి వివాదం తలెత్తడంతో మద్దూరు పవన్ కుమార్ అదే ప్రాంతానికి చెందిన నిమ్మల అనిల్ కుమార్‌ను కత్తితో పొడిచి చంపాడు. మృతుడి బంధువు వల్లూరు మణికంఠ ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లురెడ్డి కేసు దర్యాప్తు చేసి చార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువుకావడంతో నిందితుడికి జీవితఖైదు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ సహాసిని వాదించారు.

ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న చైర్మన్, డైరెక్టర్లు

తడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గం గురువారం కొలువుదీరింది. గత నెలలో పాలక వర్గాన్ని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసిన విషయం తెలిసిందే. ఏఎంసీ చైర్మన్‌గా సూళ్లూరుపేట పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆకు తోట రమేష్, వైస్ చైర్మన్‌గా తడ మండలం వెండ్లూరుపాడు గ్రామానికి చెందిన రవీంద్రనాథ్‌రెడ్డి, 19మంది డైరెక్టర్లతో పాలకవర్గం ఏర్పాటు కాగా, వారితో ఏఎంసీ కార్యదర్శి రావమ్మ ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ ఆకుతోట రమేష్ బాధ్యతలు స్వీకరించారు. చైర్మన్, డైరెక్టర్లను పలువురు టీడీపీ నాయకులు, ఏఎంసీ సిబ్బంది శాలువాలతో సత్కరించారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి

తడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో రెండవ నెంబరు ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల మేరకు... రెండవ ప్లాట్‌ఫాం సిమెంట్ బెంచీపై సుమారు 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి అచేతనావస్థలో ఉన్నాడని స్టేషన్ మాస్టర్‌కు సమాచారం అందింది. ఆయన రైల్వే పోలీసులకు చెప్పడంతో వారు వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభ్యం కాలేదు. తెలుపురంగుపై నీలంరంగు గళ్లచొక్కా, ఎర్రటిరంగులో దుస్తులు ధరించి ఉన్నాడని, అతని వివరాలు తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కోరారు. పంచనామా నిమిత్తం శవాన్ని సూళ్లూరుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

బలిజ వివాహ పరిచయ వేదిక
నెల్లూరు టౌన్ హాల్ (రీడింగ్ రూమ్‌లో) 07-09-2025 ఆదివారం సాయంత్రం 4 గం. నుండి 7 గం. వరకు మధ్యవర్తులు, కమీషన్ లేకుండా బలిజ వివాహ పరిచయ వేదిక జరుగును. వెబ్సైటు సర్వీసు ఛార్జి 500/-. సం.ప్ర. సెల్: 93983 14847
AJR-240519

ప్లాట్లు అమ్మబడును
ఇస్కాన్‌సిటీలో ప్లాట్లు, నెల్లూరు నగరం, చుట్టు ప్రక్కల పొలములు, ఇండ్లు, స్థలములు, అపార్ట్‌మెంట్స్, ఫామ్ హౌస్‌లు తక్కువ ధరకే అమ్మకమునకు కలవు. సంప్ర. సెల్: 98664 35396
AJR-240520

తమిళనాడు, ఆంధ్రా యాత్రలు
తేది.12-09-25 తమిళనాడు-తిరువన్నామలై
తేది. 19-09-25 ఆంధ్రా-కుండలేశ్వరం 2రో టిక్ 3600/- (A/c బస్సు రూం+ భోజనం). కె. వాసు, నెల్లూరు. సెల్: 94913 40504
AJR-240642

అమ్మబడును
■ నెల్లూరు జిల్లా, కందుకూరు పట్టణం, కోటారెడ్డినగర్ పరిధిలో ఇంటి స్థలం గది 25,000/-కు అమ్మబడును. రామాయపట్నం పోర్టు దగ్గరలో పొలాలు అమ్మబడును. సంప్ర: సెల్: 7032178599
AJO-240972

పాఠకులకు ముఖ్య గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లైయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లైయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

వీల్‌చైర్ వితరణ

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆస్పత్రికి గూడూరుకు చెందిన సునీత సేవాసంస్థ వీల్‌చైర్ అందజేసింది. కార్యక్రమంలో ఆ సంస్థ అధ్యక్షుడు సారంగం శ్రీనివాసులు తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది భక్తవత్సలరెడ్డి, కన్యాకుమారి, మోహన పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు

కోట, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం మండల ఉపాధ్యా యులకు క్రీడాపోటీలు జరిగాయి. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంఈవోలు శిరీషా, మస్తానయ్య ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు వీల్‌చైర్, తొక్కుడుబిల్ల, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి శుక్రవారం జరిగే గురుపూజోత్సవంలో బహుమతులు ప్రదానం చేయడం జరుగుతుందని ఎంఈవోలు తెలిపారు.

ఆర్కిటెక్చర్ థీసెస్‌లో యశ్వంత్ ప్రతిభ

బాలాయపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి గ్రామానికి చెందిన రాయి విజయ్ కుమార్ కుమారుడు యశ్వంత్ జాతీయ స్థాయి ఆర్కిటెక్చర్ థీసెస్ పోటీల్లో యశ్వంత్ ప్రతిభ చాటాడు. మిజోరాం యూనివర్శిటీలో ఆర్కిటెక్చర్ కోర్సు చదువుతున్న యశ్వంత్ ఈనెల ఒకటి నుంచి మూడవ తేదీ వరకు లక్నోలోని ఇంటిగ్రల్ యూనివర్శిటీలో జరిగిన సీఈపీ అవార్డ్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ ఆర్కిటెక్చరల్ థీసెస్ జోన్ వన్ పోటీల్లో ఐదో స్థానంలో నిలిచాడు.

శ్రీనివాసస్తత్రంలో బందోబస్తు

కోట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీనివాససత్రం బీచ్ వద్ద గురువారం భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. బుధవారం నెల్లూరు జిల్లా మనుబోలు మండలం పిడూరు గ్రామానికి చెందిన యశ్వంత్ శ్రీనివాససత్రం బీచ్‌లో అలలకు కొట్టుకుపోయి మృతి చెందడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్‌ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మనమిత్ర యాప్ ద్వారా 161 సేవలు

వాకాడు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన మనమిత్ర యాప్ ద్వారా 161 సేవలు పొందవచ్చని ఎంపీడీవో శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈనెల 6వ తేదీ నుంచి మనమిత్ర యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు సచివాలయాల సిబ్బందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు.

సచివాలయ భవన ప్రారంభానికి
ముహూర్తమెప్పుడో?

డక్కిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ముహూర్తం కుదరలేదో... ప్రజాప్రతినిదులకు తీరిక లేదో కానీ వెలికల్లు గ్రామ సచివాలయ భవనం మూడేళ్లుగా ప్రాంభానికి నోచుకోవడం లేదు. డక్కిలి మండలం వెలికల్లు గ్రామ సచివాలయ భవనం రూ.40 లక్షల వ్యయంతో మూడేళ్ల క్రితమే నిర్మించారు. ప్రస్తుత దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అప్పట్లో వైసీపీ నుంచి వెంకటగిరి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. అయితే ఆయన ప్రాధాన్యం తగ్గిస్తూ నేదరుమల్లి రాంకుమార్ రెడ్డిని నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో సచివాలయ భవనం ప్రారంభోత్సవం జరగలేదు. తర్వాత కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదైనా సచివాలయ భవనాన్ని ప్రారంభించలేదు. ప్రస్తుతం ఇరుకైన పంచాయతీ భవనంలో సచివాలయ సిబ్బంది కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఒక్కసారిగా పది మంది వస్తే నిల్చోవడానికి కూడా స్థలం ఉండదు. సచివాలయ సిబ్బంది ఇబ్బంది పడుతూ విధులు నిర్వహిస్తున్నారు. ఇక కొత్త భవనం వినియోగంలో లేకపోవడంతో తలుపులు, కిటికీలకు చెదలు పట్టి దెబ్బతినడంతో సర్పంచ్ మరమ్మతులు చేసినట్లు తెలిసింది. కాగా, మంత్రి ఆనం రామనాయణరెడ్డి, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణల చేతుల మీదుగా సచివాలయ భవనాన్ని ప్రారంభించాలని స్థానిక నేతలు భావిస్తునట్లు తెలిసింది. అయితే మంత్రికి వీలున్నప్పుడు, ఎమ్మెల్యేకు సమయం లేకపోవడంతో తేదీ ఖరారు కావడం లేదని సమాచారం. ప్రజాప్రతినిధులు సచివాలయ భవనాన్ని ప్రారంభించి సిబ్బంది ఇబ్బందులను తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.



మూడేళ్లుగా ప్రారంభానికి నోచుకోని వెలికల్లు సచివాలయ భవనం

విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే



క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ గీతాకుమారి

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని డీఎస్పీ గీతాకుమారి అన్నారు. గురువారం స్థానిక ఏఎరెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించిన క్రీడాపోటీలను డీఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులకు క్రమశిక్షణ, విలువలతో కూడిన విద్యను బోధిస్తూ వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేనన్నారు. గురువులను గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు రవీంద్రబాబు, కాంచన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతరకు రావాలని సీఎంకు ఆహ్వానం



ముఖ్యమంత్రికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, పక్కన ఆలయ చైర్మన్ మురళీ కృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పోలేరమ్మ జాతర విచ్చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆహ్వానించారు. గురువారం అమరావతిలోని సీఎం నివాసానికి వెళ్లి జాతర ఆహ్వాన పత్రిక అందజేశారు. అంతకుముందు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కలిసి జాతరకు ఆహ్వానించారు. ఎమ్మెల్యే వెంట పోలేరమ్మ దేవస్థానం చైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులు రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ పునుగోటి విశ్వనాధనాయుడు, గొల్లగుంట చరణ్, గంగాధర్ ఉన్నారు.

భూముల మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోండి

డక్కిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలో రీసర్వే పూర్తి కాని గ్రామాల్లో ఎఫ్‌పీఓఎల్‌ఆర్ కింద ఈ నెల 15వ తేదీ లోగా మ్యుటేషన్‌కు దరఖాస్తు చేసుకోచ్చని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. భాగ పరిష్కారం చేసుకున్న అసైన్‌మెంటు భూములను మార్పు చేసుకోవచ్చన్నారు.

రెండు బైక్‌ల స్వాధీనం: ఇద్దరి అరెస్టు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద గతంలో చోరీకి గురైన రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకుని, ఇద్దరిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. నాయుడుపేట సర్కిల్ కార్యాలయంలో గురువారం నిందితుల వివరాలను వెల్లడించారు. వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో మణికంఠ, శ్రావణ్‌కుమార్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు మోటారు సైకిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

దాడి కేసులో ఒకరి అరెస్టు

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గోమతి సెంటర్ వద్ద జరిగిన దాడి కేసులో నిందితుడైన సురేంద్ర రెడ్డిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు. ఆగస్టు 31వ తేదీ రాత్రి నరసయ్య అనే వ్యక్తి తనకు ఇవ్వాల్సిన రూ.160 నగదు గురించి సురేంద్రరెడ్డిని అడగగా వాగ్వాదం జరిగింది. ఈసందర్భంగా నరసయ్యపై సురేంద్రరెడ్డి కత్తితో దాడిచేశాడు. గురువారం సురేంద్రరెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో జడ్పీ సీఈవో తనిఖీలు

డక్కిలి, సెప్టెబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటేశ్వరపురం గిరిజన కాలనీలోని అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం జడ్పీ సీఈవో మోహన్‌రావు తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. పౌష్టికాహారం సక్రమంగా అందుతోందా లేదా అని పిల్లలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం దేవునివెల్లంపల్లిలోని వేస్ట్ మేనేజ్‌మెంటు కేంద్రాన్ని తనిఖీ చేశారు. పొడి, తడిచెత్త ద్వారా తయారైన వర్మీ కంపోర్టు ఎరువులను రైతులకు విక్రయించి వచ్చిన ఆదాయంతో పంచాయతీలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఎంపీపీ గోనురాజశేఖర్ సీఈవోని శాలువ కప్పి సత్కరించారు.

స్లూయిస్ నిర్మాణానికి రూ.1.3 కోట్లు మంజూరు

డక్కిలి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చెన్న సముద్రం వద్ద తెలుగుగంగ నీటిని చెరువులకు మళ్లించేలా స్లూయిస్ నిర్మాణం చేపట్టేందుకు రూ.1.3 కోట్లు మంజూరైనట్లు టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి తెలపారు. తెలుగుగంగ నీటి కోసం మండలంలోని మాటుమడుగు, శ్రీపురం, దందవోలు, కేబీపల్లి గ్రామాల ప్రజలు గత కొన్నేళ్లుగా ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే కురుగొండ్ల సీఎం దృష్టికి తీసుకెళ్లి స్లూయిస్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే ఉజ్వల భవిత

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, పేద విద్యార్థులు కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇటీవల నీట్ ఫలితాలో ప్రతిభచాటిన విద్యార్థిని జననిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిల్లకూరు మండలం బల్లవోలు గ్రామంలో పేద కుంటుంబంలో పుట్టిన జనని నీట్ ఫలితాల్లో 3200వ ర్యాంకు సాధించి నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి మెడికల్ కళాశాలలో సీటు సాధించడం గర్వించదగ్గ విషయమన్నారు. జననిని స్ఫూర్తిగా తీసుకుని పేద విద్యార్థులు చదువుల్లో రాణించి వారి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. జననికి తనవంతుగా రూ.10వేలు ప్రోత్సాహక నగదు అందించారు.

ఉత్తమ ఉపాధ్యాయినిగా స్నేహలత



నాయుడుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని స్నేహలతను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక చేసినట్లు డీఈవో గురువారం ప్రకటించారు. శుక్రవారం తిరుపతిలో జరగనున్న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా స్నేహలతకు పురస్కారం అందజేయనున్నట్లు తెలిపారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిని కలిసిన టీడీపీ నేతలు

పెళ్లకూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను పెళ్లకూరు మండల టీడీపీ నాయకులు గురువారం అమరావతిలో కలిశారు. మండలంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. ఎంపీడీవోతో పాటు ఇతరశాఖల అధికారులు మండలాభివృద్ధిని అడ్డుకుంటున్నారని మంత్రికి ఫిర్యాదు చేశారు. అలాగే పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, నాయకులు కందమూడి శివకుమార్, దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, కాటూరు గోపాల్‌రెడ్డి, కలవకూరు మునీష్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో టీడీపీ నాయకులు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంఈవోలు



తడ ఎంఈవో మల్లికార్జునరావు

తడ/నాయుడుపేట, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా తడ, నాయుడుపేట ఎంఈవోలు ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందజేయడానికి అధికారులు ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. ఇందులో తడ ఎంఈవో కె.మల్లికార్జునరావు, నాయుడుపేట ఎంఈవో బి.మునిరత్నం ఎంపికయ్యారు. శుక్రవారం తిరుపతిలో జరిగే కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ఎంఈవోలు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను అందుకోనున్నారు.


రహదారి నియమాలు పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండండి



రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ ప్రభాకర్

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రహదారి నియమాలను పాటిస్తూ ప్రమాదాలకు దూరంగా ఉండాలని ఏఎంవీఐ ప్రభాకర్ అన్నారు. గురువారం పోటుపాళెంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలను నడిపే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్లను, కారు నడిపే సమయంలో సీటు బెల్టు ధరించాలన్నారు. అతివేగంగా, మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతాయన్నారు. జాగ్రత్తగా వాహనాలను నడపడం వల్ల సురక్షితంగా గమ్యస్థానాలకు చేరకుంటారన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ శాంతి, ఏవో శ్రీదేవి, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి ప్రాధాన్యం



రక్తదాన శిబిరంలో రోటరీక్లబ్ సభ్యులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్య, వైద్యానికి ప్రాధాన్యతనిస్తూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని రోటరీక్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ రవీంద్ర అన్నారు. గురువారం స్థానిక డీఆర్‌డబ్ల్యు కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరొకరికి ప్రాణదానం చేసినవారమవుతామన్నారు. అనంతరం స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు ఫర్నీచర్, సాయిరాం వృద్ధాశ్రమానికి ఇన్వర్టర్ అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతురావు, మునిగిరీష్, దశరధరామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, బాలకృష్ణంరాజు, పీవీ.కృష్ణయ్య, శ్రీధర్‌రెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధికి విద్యే పునాది

గూడూరు, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సమాలాభివృద్ధికి విద్యే పునాది అని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేది గురువులేనని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. గురువారం కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో విద్యావ్యాప్తికి ఎంతో కృషి చేసిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. ఆయన స్ఫూర్తితో నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు గురువులకు మోమెంటోలను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్ పీర్‌కుమార్, శ్రీనివాసులు, సురేంద్ర, శ్రీధర్‌శర్మ, నారాయణరాజు, కోటేశ్వరరావు, మైమూన్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎల్‌ఏసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. పాఠశాల ప్రాంగణంలో మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మీనా కుమారి మాట్లాడుతూ ఉపాధ్యాయుల క్రమశిక్షణాయుత జీవితం విద్యార్థులకు మార్గదర్శకంగా ఉంటుందన్నారు. సమాజ భవిష్యత్తుకు పాఠశాల తరగతులు క్రియాశీలం కాబట్టి ఉపాధ్యాయులు తమ కర్తవ్య నిర్వహణ అంకితభావంతో కొనసాగించాలన్నారు. రోటరీక్లబ్ అధ్యక్షుడు నాగూరయ్య, ప్రధాన కార్యదర్శి కృష్ణా రావు, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, రామమోహన్, జీవీ నాయుడు, ఆనంద్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పరీక్షలు

బాలాయపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): తిరుపతి స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో బాలాయపల్లి జయంపు జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఉచిత క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి హరిత బీపీ, షుగర్ పరీక్షలతో పాటు మహిళలకు రొమ్ము క్యాన్సర్, పురుషులు, మహిళలకు నోటి క్యాన్సర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లియోనా, పంచాయతీ కార్యదర్శి లీలావతి పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ M/s. Shriram Finance Ltd., Venkatagiri బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన వివరముల ప్రకారం యావన్మందికి తెలుపునది షేక్ గౌసుబ్బాషా తండ్రి షేక్ రహీం సాహెబ్, మాసాపేట, వెంకటగిరి మున్సిపాలిటి, తిరుపతి జిల్లా గారికి సంబంధించిన ఈ క్రింది షెడ్యూలులో చూపిన స్థిరాస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకొన్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూలు స్థిరాస్తిపై ఎవరికైనను ఎటువంటి హక్కులు, ధార్మీక క్లయిమ్‌లు, తనఖాలు, అగ్రిమెంట్, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలో ఈ క్రింది చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియచేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

SCHEDULE

(పూర్వం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా) ప్రస్తుతం తిరుపతి జిల్లా వెంకటగిరి సబ్.రి. వెంకటగిరి మున్సిపాలిటి వెంకటగిరి గ్రామ రెవెన్యూ సర్వే నెం:- 279 రు, మాసాపేట వీధిలో డోర్ నెం. 21-275 రు ఇంటికి దక్షిణం వైపు యుండు 115 చ.గ.ల స్థలంలో తూర్పు వైపు గల ఖాళీ స్థలానికి చేరి హద్దులు:- తూర్పు:- మహమ్మద్ షకీలా వగైరాల ఖాళీ స్థలం, పడమర:- షేక్ రిజ్వానాకు విక్రయించిన స్థలం, ఉత్తరం:- మహమ్మద్ షకీలా వగైరాల ఖాళీ స్థలం మరియు బాత్ రూమ్ గోడ (డోర్ నెం. 21-275 రు) దక్షిణం:- సందు వీధి. ఈ హద్దులలో తూ.ప. 22.6 అడుగులు, ఉ.ద. 23 అడుగులు, వైశాల్యం 517.5 చ.అడుగులు లేక 57.5 చ.గ.లు లేక 7.25 అంకణములు స్థలమున్నూ, ఈ స్థలమునకు చెందిన యావత్తు ఈజిమెంట్ దారి హక్కులతో సహా.

Tayi Vijayakumar, B.Com., B.L., Advocate, Teachers Colony, Venkatagiri. Cell:94405 07929



